1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 6
సంచిక : 3
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక


అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఆగస్టు 2020



అగస్టు 29 తెలుగు స్వాభిమాన దినోత్సవం



అలోచనాశీలి, ఆచరణవాది, సంస్కర్త
పీవీ నరసింహారావు శతజయంతి

జాతీయ విద్యావిధానం- 2020 ; మంచీ చెడూ

మాతృభాషలతో దోబూచులాట, సంస్కృతం హిందీలకు మురిపాలమూట

సామాజిక, రాజకీయ ఉద్యమంగా తొలి అడుగు వేసిన 'మన నుడి – మన నది'



సభలో తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర సమితి సభ్యుడు శ్రీ సన్నిధానం నరసింహశర్మ ప్రసంగిస్తున్న దృశ్యం



జనసేన పార్టీ ఆధ్వర్యంలో 15–3–2020న రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో 'మన నుడి–మన నది' కార్యక్రమంలో భాగంగా తెలుగు భాషాభిమానుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక సాహితీవేత్తల, రచయితల, కవుల, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాదెండ్ల మనోహర్‌తో సహా సమావేశంలో తొలి నుండి చివరివరకు పాల్గొని శ్రద్ధగా ప్రసంగాల్లోని ముఖ్యాంశాల్ని నోట్స్ వ్రాసుకున్నారు. శ్రీయుతులు అరిపిరాల నారాయణరావు, సన్నిధానం నరసింహశర్మ, డా॥ కర్రి రామారెడ్డి, అబ్బిరెడ్డి పేరయ్య నాయుడు, పెరుమాళ్ల రఘునాథ్, తలారివాసు, ఖాదర్ ఖాన్, చెల్లపిల్ల వేంకటశాస్త్రి, డా॥ దేవవరపు నీలకంఠరావు, తుల్లి రాజగోపాల్, డా॥ గూటం స్వామి, ఎం.శ్రీరాంమూర్తి, శ్రీమతులు అద్దేపల్లి సుగుణ, కుసుమకామేశ్వరి తదితర ప్రముఖులు పాల్గొని, ప్రసంగించారు. మాతృభాషలోనే విద్యార్థి వ్యక్తిత్వం వికసిస్తుందని, మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని ఎన్ని కమిషన్లు సూచించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వక్తలు గట్టిగాచెప్పారు. ఆంగ్ల మాధ్యమం వల్ల బట్టీచదువులు పెరిగి, ప్రశ్నించే తత్వం లేకుండా పోతోందని మరొక ముఖ్యప్రస్తావన. మాతృభాషామాధ్యమమే ఉత్తమమని అందరూ చెప్పారు. సన్నిధానం నరసింహశర్మగారైతే 'పవన్ కళ్యాణ్ గారు తమ పార్టీ మాతృభాషామాధ్యమాన్నే బలపర్చుతుందని, తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామని ప్రకటించినట్లు' తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు తనకు గర్తు చేశారని, అన్నప్పుడు పవన్‌కళ్యాణ్ చిరునవ్వుతో స్పందించారు. వక్తలందరినీ పవన్‌కళ్యాణ్ సత్కరించారు. ఆయన క్లుప్తంగా మాట్లాడుతూ అందరిప్రసంగాల్లోని విషయాలను తాను రాసుకున్నాని, వాటిని నా మున్ముందు ఉద్యమ కార్యక్రమంలో గుర్తుంచుకొంటానని అన్నారు. తనకు మాతృభాషపై మమకారం వల్లనే ఈ కార్యక్రమాలు చేపట్టాననీ, మీరంతా ముందుకువచ్చి సహకరిస్తేనే ముందుకుసాగగల్గుతానని అన్నారు. నావల్ల కొన్ని లక్షల మందిలో ఈ అంశాలు ప్రచారమవుతాయని, కాని మీరంతా నిలబడి సహకరించి ఉద్యమాన్ని ముందుకు నడిపించాలని ఆయన చెప్పడం అందరికీ సంతోషాన్ని కలిగించింది.

ఈ సమావేశం తర్వాత రోజుల్లో కరోనా వ్యాప్తి ఉధృతంగా పెరిగి, ఎటువంటి ఉద్యమ కార్యక్రమాలకు అవకాశం లేకపోవడంతో 'మన నుడి– మన నది' ముందుకు సాగలేదు. ఇది జరిగి నాలుగు నెలలు దాటినా, ఆలస్యంగానైనా మన పత్రికలో క్లుప్తంగా ప్రచురించడానికి కారణం, ఇది అనేక ప్రాంతాల్లో, దేశాల్లో ఉన్న మన పాఠకులందరికీ తెలియాలనే.

నవంబర్ 13న తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి డా॥ వెన్నిసెట్టి సింగారావుతో కలసి పవన్‌కళ్యాణ్ గారితో సమావేశమైన వివరాలు డిసెంబరు 'అమ్మనుడి'లో ఇచ్చిన సంగతి పాఠకులకు గుర్తుండేవుంటుంది. ఆ తర్వాత కొద్ది కాలానికే పవన్‌కళ్యాణ్ 'మన నుడి – మన నది' ఉద్యమాన్ని ప్రకటించడం గమనార్హం. జన హృదయరంజకుడైన పవన్‌కళ్యాణ్ మాతృభాష విషయంలో శ్రద్ధవహించడం ఆయనపై తెలుగు ప్రజల్లో కొత్త ఆశలను కలిగిస్తున్నది.


- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా।। సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా।। గారపాటి ఉమామహేశ్వరరావు, డా।। వెన్నిసెట్టి సింగారావు, డా।। సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



ఆగస్టు 2020

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

లోపలి పుటలలో....


కార్టూన్లు	ఫోటోలు	కంప్యూటరీకరణ
సరసి	**తమ్మా శ్రీనివాసరెడ్డి**	**బండారు రఘురాం**

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



తెలుగు అధ్యాపకులకు ఆదర్శంగా జీవించిన శ్రీ నెమ్మాని వేంకట రమణయ్య గారికి శ్రద్ధాంజలి

తెలుగు అధ్యాపకులు శ్రీ నెమ్మాని వేంకటరమణయ్య గారు జులై 1వ తేదీన విశాఖపట్టణంలో కుమారుని ఇంట తన 85వ ఏట కన్నుమూశారు. చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన వేంకట రమణయ్య గారు ఎం.ఎ, ఎంఫిల్ చదివి తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అర్ధాంగి ఇందిరమ్మ 1989లో కాలధర్మం చెందారు. కుమారుడు ఆనందవర్ధన్ ఎల్ఐసీ ఉద్యోగిగా విశాఖపట్నంలో ఉంటున్నారు.

రమణయ్యగారు కేవలం బ్రతుకు తెరువుకోసం అధ్యాపక వృత్తిని చేపట్టినవారు కాదు. తెలుగు భాషపై అనురాగంతో, నిబద్ధతతో విద్యార్థులకు తెలుగు భాషా సాహిత్యాలను బోధించారు. పోతన భాగవతమన్నా, నన్నయ భారతమన్నా ఎంతో ఇష్టం. 'అమ్మనుడి' పత్రిక మీద అపారమైన అభిమానం. ప్రతినెలా పత్రిక చేరడంలో ఏమాత్ర ఆలస్యమైనా వెంటనే ఫోన్ చేసి అడిగేవారు. తన కుటుంబసభ్యులందరినీ తెలుగు భాషా సంస్కృతుల పట్ల అంకితభావం గలవారిగా తీర్చిదిద్దారు. వేంకట రమణయ్య గారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము. – సంపాదకుడు 'అమ్మనుడి'

పాఠకులకు, అభిమానులకు విన్నపం

❖ 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. వివరాలు ఈ పుటలోనే గలవు. దయచేసి ఆ సూచనలను అనుసరించ ప్రార్థన.

❖ చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను పునరుద్ధరించుకోగోరుతున్నాము.

❖ నెట్‌లో పత్రికను పొందగోరేవారు దయచేసి తమ 'మెయిల్ ఐడి'ని తెలుపండి. చందాదారులకు మాత్రమే పంపించబడుతుంది.

❖ 'అమ్మనుడి' పత్రికను నడుపడం ఆర్థికంగా ఎంతో కష్టసాధ్యంగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక – మీ మిత్రులను, విద్యాసంస్థలను ప్రోత్సాహించి వారిని చందాదారులుగా చేర్పించగోరుతున్నాము.

–ప్రచురణకర్త

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి – నాడు – నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ – పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**–యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో – చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8–386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా – 522 211. ఫోన్ : 9440448244
ఇ–మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ–మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.



ఆగస్టు 29:
గిడుగు రామమూర్తి 157వ జయంతి
తెలుగు భాషాదినోత్సవం



తెలుగుజాతి జనులందరికీ పిలుపు

గిడుగు రామమూర్తి గారిని నేటికీ తలచుకోవడానికి కారణం– ఆయన చూపిన దారి ఇప్పటికీ, తెలుగు వారికి దారిదీపంగా నిలిచివుండడమే. ఆయన నడిపిన ఉద్యమాన్ని వాడుక భాషోద్యమం/వ్యవహారిక భాషోద్యమం అనడం నాటికి సరిపోయింది గాని, ఇప్పుడు దానిని తెలుగు స్వాభిమాన దినోత్సవంగా ప్రజా ఉద్యమంగా నిర్వహించాలి. ఆనాడా మహనీయుని పోరాటం అంతా– పండితుల చాదస్తం వల్ల ప్రజలకు దూరమైపోతున్న తెలుగు భాషను ప్రజాస్వామీకరించడం. ఆవిధంగా ఆయనది గొప్ప సంస్కరణోద్యమం. ఆ ఉద్యమం అన్ని రంగాల్లో భాషను ఉపయోగించుకోగల ధైర్యాన్ని తెలుగువారిలో నింపింది. ఆయన 1940లో కన్ను మూశారు. స్వాతంత్ర్యం తర్వాత భాషా రాష్ట్రాల ఏర్పాటుతో పరిపాలనలో, బోధనలో ప్రజల భాష పూర్తిగా ఎదుగుతుందనీ 'తెలుగు' ప్రజలు ఉన్నతంగా వికసిస్తారని పెట్టుకొన్న ఆశలన్నిటినీ మన నాయకులే వమ్ముచేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు పరిస్థితి దయనీయంగా తయారైంది.

ఇప్పుడు 'కరోనా' వ్యాప్తి వల్ల ఎటువంటి బహిరంగ కార్యక్రమాలనూ జరిపే వీలులేదు. కనుక కొద్ది మందితో తగు కార్యక్రమాల్ని నిర్వహించండి. వలగూడ/జాలవేదిక (ఇంటర్నెట్) సహాయంతో సమావేశాలను నిర్వహించండి. పెద్ద, చిన్న పత్రికల్లోనూ, యూట్యూబ్, టి.వి. కార్యక్రమాల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ పాలు పంచుకోండి. కరపత్రాలను ప్రచురించండి. **తెలుగును బోధనాభాషగా (మీడియం) అమలు చేయాలనీ, పాలన అంతా తెలుగులో జరగాలనీ ఈ రెండు ప్రధాన అంశాల పైననే ఇప్పుడు మనం ప్రజలలో ప్రచారం చెయ్యాలి. ప్రభుత్వంతో పోరాటం చెయ్యాలి.**

అన్ని కార్యక్రమాల్లోనూ గిడుగు స్ఫూర్తిని ముందుకు తేవడం, ఆయన ఆదర్శంతో ముందుకు సాగడం ముఖ్యం. ఆగస్టు 29 నుండి సరికొత్త చైతన్యంతో ముందుకు సాగుదాం.

తెలుగు భాషోద్యమ సమాఖ్య 98480 16136

యూనికోడ్ లో తెలుగులోకి చొప్పించాలనుకున్న రెండు తమిళ అక్షరాల నిర్ణయాన్ని విరమించుకున్నట్లు యూనికోడ్ కన్సార్టియం ప్రకటించింది

వినోద్ రాజన్ అనే వ్యక్తి తెలుగు యూనికోడ్ అక్షరమాలలోకి తమిళ అక్షరాలని చేర్చాలంటూ ఒక ప్రతిపాదన ఉంచాడు. దానిని స్వీకరిస్తూ, తెలుగు యూనికోడ్ పట్టికలోకి తమిళ అక్షరాలని చేర్చనున్నట్లు యూనికోడ్ కన్సార్టియం ఏప్రిల్ 30న ప్రకటన చేసింది.

కానీ ఈ మొత్తం వ్యవహారంలో తెలుగువారిని భాగస్వాములుగా చేసుకోలేదు. తెలుగు ప్రభుత్వాలు సభ్యులుగా ఉండకపోవటం, తెలుగు వారెవ్వరూ సభ్యులుగా ఆ సమయంలో ఉండకపోవటం ఒక కారణమైతే, ఆ వ్యక్తి ఇచ్చిన ప్రతిపాదన ప్రకారం కొన్ని వైష్ణవ సంప్రదాయ పుస్తకాలలో తమిళ అక్షరాలు ఉండటం మరో కారణం.


ఈ విషయాన్ని తెలుసుకున్న తెలుగువారు సామాజిక మాధ్యమాలలోని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా, తానా సంస్థ వారు, సంస్థాపరంగా లేఖలు రాసారు. తెలుగు భాషా శాస్త్రవేత్తల ఫోరం ఉపాధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, యూనికోడ్ కన్సార్టియం సాంకేతిక సంఘం ఉపాధ్యక్షురాలూ, ప్రధాన ఆర్థికాధికారీ ఐన శ్రీమతి లిజామూర్‌కి, అన్ని ఆధారాలతో కూడిన వివరణాత్మక లేఖను పంపుతూ తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు.

తెలుగు భాషోద్యమ సమాఖ్య, పలువురు ప్రముఖులు బహిరంగ లేఖ రాసారు. పత్రికాముఖంగా నిరసన తెలిపారు. వేలల్లో తెలుగువారు యూనికోడ్ వారికి తెలిసేలా సందేశాలు జాలస్థలం ద్వారా పంపారు.

సురేష్ కొలిచాల గారు జాగు చేయకుండా యూనికోడ్ లో తమ సభ్యత్వాన్ని తాజీకరించి, తెలుగువారందరి నిరసనను తన వాదనగా తెలిపారు. యూనికోడ్ వారు జరిగిన తప్పిదాన్ని గ్రహించి, తాము ఆమోదించిన ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కృషిలో పాలు పంచుకొన్న అందరికీ అభినందనలు.

– సంపాదకుడు

గమనిక: ఈ విషయమై వివరాలను 'అమ్మనుడి' జులై సంచికలో చూడవచ్చును.



భారతీయ కవితాత్మను ఆవిష్కరించిన
'అదేనేల' రచయిత

యల్లపు ముకుందరామారావు గారికి
తాపీ ధర్మారావు పురస్కారం




ప్రముఖకవి, అనువాదకుడు యల్లపు ముకుంద రామారావు గారిని **తాపీధర్మారావు పురస్కారం**తో సత్కరించడానికి నిర్ణయించడమైనదని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

'అనువాద కళని ఆపోశన పట్టిన రామారావు, యిప్పుడు 'అదే నేల' ద్వారా, భారతదేశంలోని భిన్నభాషల్లో విలసిల్లిన కవిత్వాన్ని, వాటి చారిత్రక నేపథ్యంతో సహా, మనముందు కుప్పబోసి దేశీయ సాహిత్య ప్రపంచంలోకి తనదైన శైలితో ఆహ్వానిస్తున్నారు. వందలాది భారతీయ భాషల నుంచి, దాదాపు మూడు వేల మంది కవుల్ని యీ గ్రంథం ద్వారా ఆయన పరిచయం చేస్తున్నారు. ఏడు వందలకు పైగా కవితల్ని అనువదించి, దేశంలోని భిన్న భాషాజాతుల అస్తిత్వాన్ని గుర్తించి గౌరవిస్తూనే, వాటిమధ్య ఐక్యత కోసం ఒక వారధిని నిర్మిస్తున్నారు. ప్రాంతం, జాతి, భాష యేదైనా దేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకొని దాన్ని కాపాడుకోడానికి, కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకూ, భిన్నకాలాల్లో వెల్లివిరిసిన భారతీయ కవిత్వం దోహదపడుతుందనీ, వైవిధ్యమే యీ దేశపు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అనీ 'అదే నేల' గ్రంథం మరోసారి నిరూపిస్తుంది. '

సన్మానసభ తేదీ, సమయం మున్నగు వివరాలను సెప్టెంబరు నెల 'అమ్మనుడి'లో ప్రకటించగలము.

–సంపాదకుడు, అమ్మనుడి
9848016136




ఆస్ట్రేలియా బడుల్లో

తెలుగుకు జై

» ఐచ్ఛిక అంశంగా చేర్చిన ప్రభుత్వం

మెల్‌బోర్న్, జూలై 17: తెలుగు భాషకు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి బడుల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో పన్నెండో తరగతి వరకు ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఇకపై తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలగనుంది. ఈ ప్రకటన యావత్ ప్రపంచంలోని తెలుగు వారికి ఆనందాన్ని కలిగిస్తోంది. ఆస్ట్రేలియాలో ఇప్పటి వరకు హిందీ, పంజాబీ, తమిళ భాషలకే అక్కడి ప్రభుత్వ గుర్తింపు లభించింది. తాజాగా ఆ జాబితాలో నాలుగో భాషగా తెలుగు చేరింది. దీంతో ఆస్ట్రేలియాలోని వివిధ రాష్ట్రాల్లోని తెలుగు వారికి ప్రయోజనం కలగనుంది. తాజా ఆదేశాలతో తెలుగు భాషను ఆప్షనల్‌గా ఎంపిక చేసుకొన్న వారికి ఉత్తీర్ణతలో ఐదు పాయింట్లు అదనంగా ఇవ్వనున్నారు. ఇకపై శాశ్వత నివాసం కోసం తెలుగు భాష ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆస్ట్రేలియా ప్రభుత్వ ప్రకటన పట్ల స్థానిక తెలుగు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. తెలుగు సమాఖ్య సభ్యులు, తెలుగుమల్లి, భువన విజయం వంటి సాంస్కృతిక సంస్థలు ఏళ్లుగా చేస్తున్న కృషికి దక్కిన ఫలితం ఇది.



సంపుటి : 6 సంచిక : 3
అమ్మనుడి
ఆగస్టు 2020

సంపాదక హృదయం

మాతృభాషలతో దోబూచులాట, సంస్కృతం హిందీలకు మురిపాల మూట

ఎట్టకేలకు కొత్త జాతీయ విద్యావిధానానికి కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. కస్తూరిరంగన్ కమిటీ తుది నివేదికను ఇచ్చి ఏడాది గడచిపోయింది. ప్రభుత్వ ఆలోచనలకు విరుద్ధం కాని నివేదిక వచ్చినా, దేశంలో దీనిని బహిరంగ చర్చకు ఉంచి ఎన్నడూ లేని స్థాయిలో వచ్చిన లక్షకుపైగా స్పందనలను పరిశీలించి, దేశ శ్రేయస్సును, అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన విప్లవాత్మక విధానాన్ని ఇప్పుడు మంత్రిమండలి ఆమోదించిందని మానవ వనరుల శాఖామంత్రి రమేష్ పోఖ్రియాల్ ప్రకటించారు.

ముందుగా మనం అభినందంచదగ్గ అంశం ఇప్పటిదాకా వున్న 'మానవవనరుల'నే మాటను తొలగించి విద్యా మంత్రిత్వ శాఖగా దానిని తిరిగి మార్చాలన్న నిర్ణయాన్ని! ప్రపంచీకరణ నేపథ్యంలో మొదలైన ఆధిపత్యభావజాలం ఆర్థిక రంగంతోపాటు విద్యారంగాన్నీ కుళ్లబొడిచింది. పక్కదారులను పట్టించింది. చివరకు అన్ని రకాల రాజకీయ భావజాలాలు గలవారినీ నైతికంగా లొంగదీసుకొని దాసులను చేసుకొంది. స్వదేశీ స్వాభిమానాలు, ఏకాత్మమానవవాద దర్శనం తమ ఆదర్శాలని చెప్పే నేటి దేశపాలక వర్గాలు కూడా ఆ భావజాలానికి లొంగిపోయారు. దాని ప్రభావం ఇప్పుడు వచ్చిన కొత్త జాతీయ విద్యావిధానంపైన కూడా పడింది.

భారతదేశంలోని భాషాజాతుల మౌలిక లక్షణాల వైవిధ్యాన్ని గుర్తించి వాటన్నిటి సమాహారంగా భారతదేశాన్ని గుర్తించడానికి మనసొప్పని శక్తులు నేటి పాలకవర్గంలో కీలకంగా ఉన్నాయి. అందువల్ల భారతీయభాషలను సంస్కృతీకరించాలనే పాత వాదన ఇప్పుడు సడిచేయకుండా పైకి వచ్చి, కొత్త విద్యావిధానాన్ని ప్రభావితం చేస్తున్నది. వారు– వేలాది సంవత్సరాల చరిత్ర కలిగిన మాతృభాషలను జాతీయ భాషలుగా గుర్తించడానికి తిరస్కరిస్తున్నారు. అయితే దీన్ని స్పష్టంగా బయటకు చెప్పడానికి ఆ శక్తులు సిద్ధపడవు.

ఇది ఇలా ఉండగా, మరొక వైపు స్వాభిమానం లేని, పరాయీకరణ చెందిన, దేశాన్నీ సమాజాన్నీ నష్టపరచడానికైనా సంకోచించని గత ప్రభుత్వాల స్వార్థపరవిధానాల ఫలితంగా ఇప్పుడు రాజకీయాలు ప్రజలకు, దేశ హితానికీ చేటుచేసే శక్తులతో నిండిపోయాయి. ఇలాంటివారికి స్వభాష, సంస్కృతి– వాటి మానవీయ, శాస్త్రీయ విలువలు అర్థంకావు. తాత్కాలిక అవసరాలే ముఖ్యం. ఎన్నికలలో గెలిచి అధికారంలోకి రావడమే ముఖ్యం. సామాన్య ప్రజల అమాయకత్వాన్ని, అవసరాలను అవకాశంగా తీసుకొని పరిపాలిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో నైతికత గురించీ, దేశం గురించీ, సాంస్కృతిక విలువల గురించీ మాట్లాడేవారు రాజకీయరంగంలోని శక్తులకు కళ్లెం వేయాలి. కాని, దురదృష్టవశాత్తు వీరు తమ మనస్సులను విశాలం చేసుకోలేకపోతున్నారు. ఆలోచనలను కుంచింపజేసుకొంటున్నారు. మాతృభాషలను ప్రోత్సహిస్తున్నామంటూనే, స్పష్టతలేని, నిలకడలేని ధోరణిని జాతీయ విద్యావిధానంలో ప్రదర్శించారు.

మాతృభాషలో బోధనను 5వ తరగతి వరకు తప్పనిసరి చేస్తున్నామంటూనే, దానికి కట్టుబడని విధానాలను ప్రకటించారు. ఇచ్చినట్లే ఇచ్చి అందకుండా చేస్తున్నారు. హిందీని అనివార్యంగా జాతీయభాషగా ఆచరణలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సంస్కృతానికి ప్రత్యేకమైన గౌరవాన్ని, ఆధిపత్యాన్ని ఆపాదించడానికి పూనుకొంటున్నారు. ఆంగ్లభాషకు మాత్రం ఎటువంటి అపకారం కలుగకుండా, దాని అవకాశాలను ఏమీ కాదనకుండా పచ్చజండాను ఊపడానికి సంకోచించడం లేదు. పాలనలోగాని, విద్యలోగాని ప్రజలభాషలకు పూర్తి అధికారాన్నీ బాధ్యతను కలిగించడానికి సిద్ధపడడంలేదు.

కొత్త విద్యావిధానంలో మంచి అంశాలేమీ లేవని కాదు. అనేకం ఉండవచ్చుగాక ! అయితే మాతృభాషలకు– ప్రత్యేకంగా చూస్తే మన తెలుగుకు– జా.వి.వి–2020 ఏం ఒరగపెడుతోందని మనం సంతోషించాలి?!

సామల రమేష్‌బాబు

తేదీ : 1–8–2020

*ఈ తర్వాతి 4 పుటలలో ఇచ్చిన 'జాతీయ విద్యావిధానం 2020– మంచీ చెడూ' వ్యాసాన్ని చదవండి.

రహ్మానుద్దీన్ షేక్
9493035658

జాతీయ విద్యావిధానం–2020: మంచీ చెడూ

నూతన జాతీయ విద్యా విధానం 2020 జూలై 29వ తేదీన పాత్రికేయుల సమావేశంలో ఒక పవర్‌పాయింట్ ప్రదర్శన ద్వారా మంత్రులు రమేష్ పోఖ్రియాల్ నిషాంక్, ప్రకాష్ జవదేకర్ ప్రవేశపెట్టారు. ఈ పాత్రికేయ సమావేశానికి ముందే జాతీయ విద్యా విధానం 2020 కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ ద్వారా ఆ రోజే ఆమోదం పొందింది. సమావేశంలో స్థూలంగా నూతన జాతీయ విద్యా విధానంలో ఉండే అంశాలను తెలియపరిచారు. జూలై 30న జాతీయ విద్యా విధానం పూర్తి పాఠాన్ని మంత్రిత్వ శాఖ జాలస్థలంలో ఉంచారు.

ఈ విద్యా విధానం ప్రకటనతో పాటుగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖను ఇకపై విద్యా మంత్రిత్వ శాఖగా పేరు మార్చనున్నట్టు తెలిపారు.

ప్రస్తుతం విడుదలైన విద్యా విధానాన్ని సూచించిన కమిటీకి మాజీ ఇస్రో చీఫ్ కె. కస్తూరిరంగన్ నేతృత్వం వహించారు.

నూతన విద్యా విధానం ద్వారా పెద్ద మార్పులను మంత్రి ప్రకటించారు.

ఇకపై ఉన్నత విద్యా సంస్థలన్నిటినీ ఒకే ఒక్క నియంత్రణ సంస్థ నియంత్రిస్తుంది.

ఎం.ఫిల్ కోర్సును కూడా రద్దు చేస్తున్నట్లు కేంద్ర మంత్రులు ప్రకటించారు.

డిజిటల్ శిక్షణ విధానాన్ని సమూలంగా మార్చే లక్ష్యంతో నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరమ్ (ఎన్ఈటీఎఫ్)ను ఏర్పాటు చేస్తారు.

“తొలి దశలో ఎనిమిది ప్రాంతీయ భాషల్లో ఇ–కోర్సులు ప్రారంభిస్తాం. వర్చువల్ ల్యాబ్స్ అభివృద్ధి చేస్తాం” అని ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి అమిత్ ఖరే చెప్పారు.

ఈ నవీన విద్యా విధానం 34 ఏళ్ళ పాతదైన విద్యా విధానానికి స్వస్తి చెప్పి ప్రపంచ విద్యావిధానాలకు ధీటుగా భారతదేశ విద్యను మెరుగు పరచనుందని మంత్రులు తెలిపారు.

ఈ విద్యావిధానంలోని ముఖ్యమైన అంశాలు

బడి స్థాయిలో ప్రస్తుతం ఉన్న గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (మొత్తం బడికి వెళ్ళాల్సిన జనాభాలో, బడికి వెళ్ళని వారికీ, బడిలో ప్రవేశం పొందే వారికీ మధ్య ఉన్న నిష్పత్తి)ని ప్రస్తుతం ఉన్న 80 నుండి 100 శాతానికి 2030 నాటికి చేరుకోవాలని లక్ష్యం పెట్టుకుంది.

ప్రస్తుతం ఏవో కారణాల వలన పాఠశాల విద్యకు దూరమైన 2 కోట్ల మంది బడికి వెళ్ళని పిల్లలను తిరిగి బడిలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఈ విధానం చెబుతోంది.


ప్రస్తుతమున్న 10+2 విధానానికి స్వస్తి చెప్పి కొత్తగా 5+3+3+4 విధానానికి తెర తీయనుంది. ఇంతకు ముందు విద్యా హక్కు చట్టం కింద 6 నుండి 14 ఏళ్ళ వయసు పిల్లలకు ఉచిత–నిర్బంధ విద్య ఇవ్వాలన్న చట్టాలు ఇకపై కింది వయసును 6 బదులు 3 గా పరిగణించనున్నాయి. పై వయసు 14 లేదా 18 గా మారవచ్చు.

ఇంతకు ముందు ప్రాథమిక విద్య(తరగతి 1 నుండి 5)కు ముందున్న విద్యను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నా, కొత్త విద్యా విధానం ద్వారా దానిని నిర్బంధంగా అమలు పరిచే అవకాశం ఉంది. ఒకటో తరగతికి ముందున్న మూడేళ్ళ విద్యను ప్రీ–స్కూల్, బాలవాటిక లేదా అంగన్‌వాడీ వ్యవస్థ ద్వారా పరిపుష్టం చేస్తారు. ఒకటి, రెండు తరగతులు కూడా కలుపుకొని విద్యలో మొదటి ఐదేళ్ళను ఒక విభాగంగా, ప్రాథమిక స్థాయి విద్యగా పరిగణించనున్నారు. 3 నుంచి 8 సంవత్సరాల వయసు గల పిల్లలు ఈ విభాగం వారు.

తరువాతి స్థాయిలో మూడు–నాలుగు–ఐదు తరగతులు ఉంటాయి. వీటిని పునాది స్థాయి విద్యగా నిర్వచించారు. 8 నుండి 11 ఏళ్ళ మధ్య ఉన్న వయసు వారిని ఈ విభాగం కింద లెక్కవేసారు. 6 నుండి 8వ తరగతి వరకూ, అనగా 11 నుండి 14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులను మధ్యమ స్థాయిగా, 9 నుండి 12 తరగతి విద్యార్థులను, 14 నుండి 18 మధ్య వయసు గలవారిని సెకండరీ స్థాయి విద్యార్థులుగా కొత్త విధానంలో పరిగణిస్తారు.

ఇది ఆంధ్రప్రదేశ్–తెలంగాణాల్లో ఉన్న ఇంటర్ విధానాన్ని, కర్నాటకలోని పియుసీ విద్యావిధానాన్ని, ఇతరత్రా ఉన్న జూనియర్ కళాశాల విధానాన్ని మానివేసి, ఆ తరగతులను పాఠశాల విద్యలో భాగంగా అందించేలా తెస్తున్న మార్పు.

ఇంతకు ముందు 3–6 సంవత్సరాల పిల్లల విద్యను బడి విద్యగా గుర్తించని ప్రభుత్వం ఇప్పటి నుండి ఆ వయస్సుల విద్యను కూడా అధికారికంగా గుర్తించింది. ఈ వయస్సులో పిల్లల మెదడు 95%



అభివృద్ధి చెందుతుందన్న విషయం పరిశోధనల ద్వారా, అనేక అధ్యయనాల ద్వారా తెలుస్తోంది.

స్థూలంగా చెప్పాలంటే అంతకు ముందున్న 10+2 విధానానికి మూడేళ్ళ అంగన్‌వాడీ సంవత్సరాలను కలుపుకొని, పదవ తరగతి స్థాయిలో జరిగే పరీక్షలను రెండవ, ఐదవ, ఎనిమిదవ తరగతుల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

ఇప్పటికే ప్రి-స్కూల్, అంగన్‌వాడీ వ్యవస్థల గురించిన అవసరమున్నా, అవి అందుబాటులో లేని ప్రాంతాల్లో అవి కొత్తగా ఏర్పడతాయి.

పాఠశాల విద్యలో ఈ విధానం ద్వారా కనీస భాషా నైపుణ్యం, లెక్కల నైపుణ్యం పిల్లలలో చేకూరే విధంగా పాఠ్యప్రణాళికలు రూపొందిస్తారు. ఇది చదువు, ఇవి ఆటపాటలు, ఇది సంగీతం, ఇవి పోటీలు అన్న వ్యత్యాసం లేకుండా అన్ని కళలను, చదువులతో సమానంగా పాఠ్యాంశాలుగా పరిగణిస్తారు.

ఆరవ తరగతి నుంచి వోకేషనల్(వృత్తివిద్య) పాఠ్యక్రమాన్ని ప్రవేశపెడతారు. ఆరవ తరగతి ఆపై విద్యార్థులు కరెంటుపని, చెక్కపని, కంప్యూటర్ డేటా ఎంట్రీ పని ఇలా ఏదో ఒక పనికి సంబంధించిన అవగాహనను పెంచుకునేలా పది రోజుల ఇంటర్న్‌షిప్ (ఆ పని చేసే వ్యక్తికి సహాయకుడిగా పని చేయడం) చేయాలి. ఆరవ తరగతి నుండి విద్యార్థులు కోడింగ్ లాంటి ఉద్యోగావసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలి.

ఐదవ తరగతి వరకు, ఆపై కుదిరితే ఎనిమిదవ తరగతి వరకు విద్య మాతృభాషలో లేదా ప్రాంతీయ భాషలో ఉండాలి. ఏ భాషనూ విద్యార్థులపై రుద్దకూడదు.

విద్యార్థుల ప్రతిభకు కొలమానంగా ఉండే మూల్యాంకనాల పత్రం(ప్రోగ్రెస్ రిపోర్ట్) ఇకపై 360 డిగ్రీల సమగ్ర మూల్యాంకనంగా ఉంటుంది. విద్యార్థి తనకు తాను నేర్చుకున్న విషయాలపై మార్కులు వేసుకుంటాడు, అతని సహవిద్యార్థులలో ఒకరు అతనిని మూల్యాంకనం చేస్తారు, ఆఖరుగా ఉపాధ్యాయుల మూల్యాంకనం ఉంటుంది. మూల్యాంకనానికి కేవలం చదువే కాకుండా, మానసిక అభివృద్ధి. ఆటలు, ఇతర నైపుణ్యాలు కూడా చోటు చేసుకుంటాయి. బోర్డు పరీక్షలు విద్యార్థి సముపార్జించిన జ్ఞానాన్ని పరీక్షించే విధంగా తీర్చిదిద్ది, మూస తరహా పరీక్షలకు స్వస్తి చెబుతారు. పిల్లల రిపోర్ట్ కార్డులలో కేవలం వివిధ సబ్జెక్టులలో వచ్చిన మార్కులు మాత్రమే కాకుండా వారి ఇతర నైపుణ్యాలకు కూడా మార్కులు ఇస్తారు. మార్కులు కూడా అంకెలలో కాకుండా గ్రేడింగ్ విధానంలో లేదా పర్సెంటైల్ విధానంలో ఇస్తారు.

2021 నుండి జాతీయ స్థాయిలో ఉపాధ్యాయుల నైపుణ్యాలను మెరుగు పరిచే పాఠ్యప్రణాళికలను రూపొందించడానికి ఒక చట్ట రూపంగా NCFTE (నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) 2021 వస్తుంది. 2030 నాటికి పాఠశాలలో చదువు చెప్పాలంటే 4 ఏళ్ళ సమగ్ర బీ.ఎడ్ చదివిన వారికే అవకాశం ఉంటుంది.

పిల్లలు తమకు నచ్చిన కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. అన్ని కోర్సులను రెండు భాషలలో అందిస్తారు. డిజిటల్ విద్యా విధానాన్ని అభివృద్ధి చేసేందుకు నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరమ్ స్థాపిస్తారు. ఎనిమిది ప్రాంతీయ భాషలలో ఇ-కోర్సులు. వర్చువల్ ల్యాబ్స్ అభివృద్ధి చేపడతారు.

అన్ని పాఠశాలల్లో సంస్కృత భాషను ముఖ్య భాషగా ప్రవేశపెడతారు. సంస్కృత విద్యాలయాలు కూడా విభిన్న తరహా కోర్సులు అందించే విద్యా సంస్థలుగా రూపాంతరం చెందుతాయి.

ఇక ఉన్నత విద్యకు సంబంధించి పెద్ద మార్పులే ప్రతిపాదనకు వచ్చాయని అనుకోవాలి. 2035 నాటికి స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్)ని ఇప్పుడున్న 26 శాతం నుంచి 50 శాతానికి తీసుకెళ్లడం ఈ విధానం లక్ష్యం. అనగా ఇంటర్ తర్వాత ప్రస్తుతం ప్రతి 100 మంది పిల్లల్లో కేవలం 26 మంది మాత్రమే డిగ్రీ స్థాయి విద్యలో చేరుతున్నారు, రాబోయే 15 ఏళ్ళలో ప్రతి వంద మందిలో కనీసం 50 మంది డిగ్రీ స్థాయిలో చేరేలా ఈ విధానం పని చేస్తుంది. ఇందుకోసం కొత్తగా మూడున్నర కోట్ల డిగ్రీ స్థాయి అవకాశాలను నెలకొల్పనున్నారు.

తరువాతి అంశం చాలా ముఖ్యమైనది. కొత్త విధానం ద్వారా విద్యార్థులు ప్రస్తుతం ఉన్న సంప్రదాయ కోర్సుల్లోలాగా కాకుండా, తమకు నచ్చిన అంశాలను ఎంపిక చేసుకుని చదువుకోవచ్చు. ఉదాహరణకు మెకానికల్ ఇంజనీరింగ్ తోపాటు సంగీతం, ఎంబీయే చేస్తూ కంప్యూటర్ సైన్స్ ఇలా నచ్చిన అంశాలలో నైపుణ్యం సాధించవచ్చు.

దీనికి తోడు మరొక ముఖ్యమైన అంశం, విద్యార్థి డిగ్రీ కోర్సుల్లో ఎప్పుడైనా చేరవచ్చు, ఎప్పుడైనా విరమించుకోవచ్చు. ఒకసారి మధ్యలో ఆపేసిన డిగ్రీ కోర్సును ఎక్కడ ఆపేసారో అక్కడ నుండే తిరిగి చదవవచ్చు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం.

అనేక కారణాల వలన డిగ్రీ సకాలంలో పూర్తి చేయలేని వారికి ఇది ఒక వరం లాంటిది.

అన్ని డిగ్రీ కోర్సులను ప్రపంచ స్థాయికి తగ్గట్టు నాలుగేళ్ళలో పూర్తి చేసుకునేలా, సంప్రదాయంగా మూడేళ్ళలో పూర్తి చేసుకునేలా, రెండు విధాలా అందిస్తారు.

మొదటి సంవత్సరం డిగ్రీ పూర్తి చేసాక, ఏదో కారణం వలన చదువు మానేయాల్సి వస్తే, ఒక నిర్దిష్ట కాలంలోపు తిరిగి రెండవ ఏడాది డిగ్రీలో చేరవచ్చు. ఇలా మల్టిపుల్ ఎంట్రీ, మల్టిపుల్ ఎగ్జిట్ విధానం ఈ విద్యావిధానం ద్వారా వస్తున్న మంచి మార్పు.

ప్రతి కోర్సుకూ కొన్ని నిర్దిష్టమైన సంఖ్యలో క్రెడిట్లు ఉంటాయి. డిగ్రీ పట్టా పొందేందుకు ఆ క్రెడిట్లను సంపాదించుకుంటే చాలు. ప్రస్తుతం ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో ఈ క్రెడిట్ విధానం పూర్తి స్థాయిలో, ఇతర డిగ్రీ కోర్సుల్లో పరోక్షంగా ఉంది. ఐఐటీలు, ఐఐఎంలకు ధీటుగా మేరు (బహువిషయక విద్యా, పరిశోధనా విశ్వవిద్యాలయాలు) సంస్థలు నెలకొల్పుతారు. ఇవి ప్రపంచ స్థాయి విద్యను మల్టీడిసిప్లినరీ విధానంలో దేశంలో అందించే ఆదర్శ విశ్వవిద్యాలయాలుగా నిలుస్తాయి.

పరిశోధనారంగానికి ఊతమిచ్చేలా, బలమైన అధ్యయన పద్ధతులను విద్యా వ్యవస్థలో ప్రవేశపెట్టి పెంపొందించేలా ఒక ఉన్నత స్థాయి సంస్థ – జాతీయ పరిశోధనా ప్రతిష్ఠానము (నేషనల్ రీసర్చ్ ఫౌండేషన్) ఏర్పాటు చేస్తారు.

హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఇసిఐ) అనే సంస్థ ఉన్నత విద్యకు సంబంధించిన ఏకైక సంస్థగా ఏర్పాటు

చేస్తారు. ప్రస్తుతం ఉన్న యూజీసీ, ఏఐసీటీఈ లాంటి అన్ని ఉన్నత విద్యా సంబంధ సంస్థలు ఈ పెద్ద సంస్థలో విలీనం అయిపోతాయి. ఇందుకు న్యాయవిద్య, వైద్యవిద్య మినహాయింపులు. ఈ హెచ్ఇసిఐ లో నాలుగు విభాగాలు ఉంటాయి. 1.ఉన్నత విద్యను క్రమబద్ధీకరించేందుకు నేషనల్ హైయర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ కౌన్సిల్, 2. విద్యా ప్రమాణాలను, నాణ్యతను, రోజువారీ పనితనాన్ని పర్యవేక్షించే జెనరల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్, 3. ఉన్నత విద్యకు సంబంధించిన నిధులను, డబ్బు లావాదేవీలను చూసుకునే హైయర్ ఎడ్యుకేషన్ గ్రాంట్స్ కౌన్సిల్, 4. గుర్తింపునిచ్చి, మూల్యాంకనం చేసే నేషనల్ అక్రెడిటేషన్ కౌన్సిల్.

ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలకు అన్నిటికీ ఒకే విధమైన నియమ నిబంధనలు ఉంటాయి. ఒకే స్థాయి కొలమానాలతో ఆయా కళాశాలల నాణ్యతను కొలుస్తారు.

విచిత్రమైన విషయం ఏమిటంటే, ఇంతకు ముందు న్యాక్ పేరుతో ఉన్న ఈ మూల్యాంకన సంస్థలోని సిబ్బంది ప్రతీ కళాశాలను వ్యక్తిగతంగా సందర్శించి, అక్కడి యాజమాన్యంతో, ఉపాధ్యాయులతో, ఆచార్యులతో, సిబ్బందితో, విద్యార్థులతో, తల్లిదండ్రులతో మాట్లాడి మూల్యాంకనం చేసేవారు. కొత్త విధానంలో ఈ మొత్తం విభాగం అదృశ్యంగా పని చేస్తుంది, అంటే ఈ విభాగంలో సిబ్బంది ఉండరు. మూల్యాంకనం, గుర్తింపు కొన్ని కొలమానాల ఆధారంగా కాగితాల మీద, వలగూడులో జరిగిపోతుంది.

రాబోయే 15 ఏళ్ళలో విడతల వారీగా అన్ని కళాశాలలకు అనుబంధ కళాశాలలుగా ఉన్న గుర్తింపును రద్దు చేస్తూ వస్తారు. ఒక కళాశాల అయితే, డిగ్రీలను అందించే స్వయంప్రతిపత్తి గల సంస్థగా ఉంటుంది. లేదా ఏదో ఒక విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న కళాశాలగా ఉంటుంది.

మరొక గమనించాల్సిన విషయం ఏమిటంటే, ప్రపంచంలో శ్రేష్ఠమైన 100 విశ్వవిద్యాలయాలుగా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు భారతదేశంలో తమ శాఖా కళాశాలలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఒకవేళ నిజంగానే అభివృద్ధి చెందిన దేశాల కళాశాలలు ఇక్కడ ఏర్పాటు అయితే, దేశీయ కళాశాలలకు అది చావుదెబ్బే. డబ్బు వెచ్చించగల వారికి ఒక పక్క ఉన్నతమైన కళాశాలలో ఉన్నత విద్య అందుతూ ఉంటే, మరో పక్క దేశీయ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందటం కష్టమవుతుంది. ఉద్యోగాల ఎంపికలో కూడా ఆ ఉన్నత ప్రైవేట్ విదేశీ కళాశాలల్లో చదివిన అభ్యర్థులతో పోల్చుకుంటే దేశీయ కళాశాల విద్యార్థులు కచ్చితంగా వెనుకంజలో ఉంటారు.

ఈ విద్యా విధానంలో ఉన్న ఇతర అంశాలలో ప్రధానమైనవి :

నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరం అనే స్వయంప్రతిపత్తి గల సంస్థ ఏర్పడి వివిధ విశ్వవిద్యాలయాలకు, కళాశాలలకు వారధిగా ఉండి, పరిశోధనలను, అధ్యయనాలను, పరిపాలన సంబంధిత విషయాలను, మూల్యాంకన పద్ధతులను, కొత్త నైపుణ్యాలను, ప్రణాళికలను పంచుకునే విధంగా పని చేస్తుంది. ఆడవారి విద్యను పెంపొందించేందుకు జెండర్ ఇంక్లూజన్ ఫండ్ (లింగభేదాన్ని రూపుమాపే నిధి) ఏర్పాటు చేస్తారు. విద్యా విధానంలోని లాభాలను పొందలేకపోతున్న అల్పసంఖ్యాక భాషల వారికీ, జనజాతుల వారికీ చేయూతను అందించేలా ప్రత్యేక విద్యా మండళ్ళు (స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్లు) ఏర్పాటు చేస్తారు.

ఈ కొత్త విధానం బహుభాషా తత్వాన్ని పాఠశాల స్థాయిలో, ఉన్నతవిద్యా స్థాయిలో పెంపొందించేలా రూపొందించబడింది. బహుభాషల్లో వనరులు ఏర్పరచటానికి జాతీయ అనువాద, నిరూపణ సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ & ఇంటర్ప్రిటేషన్)ను మొదలుపెడతారు. పాళీ, ప్రాకృత, పారశీక భాషలకు జాతీయ స్థాయి అధ్యయన సంస్థలు ఏర్పాటు చేస్తారు.

× × ×

స్వాతంత్ర్యం వచ్చినప్పటి భారతదేశంలో నిరక్షరాస్యత పెద్ద సమస్య. అందుకు సమాధానంగా అప్పటి ప్రభుత్వం సమాన విద్యావ్యవస్థ వైపు మొగ్గు చూపుతూ దేశవ్యాప్తంగా ఒకే విధంగా విద్యనందించాలని విశ్వవిద్యాలయ విద్యా కమిషను, ప్రాథమికోన్నత విద్యా కమిషను, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషను, కొఠారీ కమిషన్ అని వివిధ దశలలో విద్యను ఆధునికం చేసేలా అడుగులు వేసింది. 1961లో ఏర్పాటైన ఎన్.సి.ఇ.ఆర్.టి. ద్వారా విద్యా విధానాలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై అమలు చేయటం మొదలు పెట్టింది. ఆ విధంగా అనేక విధానాల ప్రకటనలు, వాటి అమలును ఇన్నేళ్ళూ చూస్తూ వచ్చాము. చివరిసారిగా 1986లో పీవీ నరసింహారావు మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్నప్పటి విద్యా విధానమే నేటికీ అమలులో ఉంది. ఈ 34 ఏళ్ళ సుదీర్ఘ కాలయాపన తరువాత 21వ శతాబ్దపు అవసరాలను తీర్చే పరమౌషధిగా చెబుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 ని ప్రకటించింది. దేశ భవితవ్యం విద్యార్థులు, ఆ విద్యార్థులకు సరైన జ్ఞానాన్ని ఇచ్చేది విద్య. అంత ప్రముఖమైన విషయానికి అభివృద్ధి చెందిన దేశాలలో వారి స్థూల జాతీయోత్పత్తిలో పది శాతానికి తక్కువ కాకుండా ఖర్చు చేస్తుంటే, మన దేశంలో 3 నుంచి 4.5 శాతం ఖర్చు పెడుతున్నారు. ఇకపై ఆరు శాతం ఖర్చు చేయాలని విద్యా విధానంలో ప్రకటించుకోవడం ఆలోచించాల్సిన విషయం. ఈ విద్యా విధానం ద్వారా పెను మార్పులు తేనున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం, అమలు విషయంలో ఏం చేస్తుందోనన్న విషయం గమనార్హం. ఈ విద్యావిధానం ప్రకటన, దానికి సంబంధించిన అంశాలను ప్రజలకు చేరవేసిన పద్ధతి, పంచిపెట్టిన పత్రాలు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయి.

ఈ విద్యావిధానం ఎన్నో విధాల పెద్ద మార్పులకు నాంది అవుతుంది. ఆరవ తరగతిలో వృత్తి విద్యా అవగాహన ప్రవేశపెట్టడం, చదవబోయే విషయాల ఎంపికలో విద్యార్థి ఇష్టాయిష్టాలకు పెద్దపీట వేయడం, డిగ్రీ స్థాయి విద్యలో మొదటి ఏడాది ప్రమాణపత్రం, రెండవ ఏడాది డిప్లొమా, మూడవ ఏడాది జాతీయ స్థాయి డిగ్రీ, నాలుగవ ఏడాది ప్రపంచ స్థాయి డిగ్రీ పూర్తి చేసే వీలును కల్పిస్తూ, విద్యార్థి ఎప్పుడైనా ఒక స్థాయిలో చదువు ఆపేసి, మళ్ళీ ఎక్కడ ఆపారో అక్కడ నుండి చదువును కొనసాగించే అవకాశాన్ని ఇవ్వడం – ఇలాంటి అంశాల ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం చేకూరడమే

కాక, ప్రపంచస్థాయిలో భారతీయ విద్యా ప్రమాణాలకు కొత్త గుర్తింపు వస్తుంది. ఆడపిల్లల విద్య కోసం ప్రత్యేక నిధి, ప్రత్యేక విద్యా మండళ్ళు, జాతీయ పరిశోధనా సంస్థ మొదలగు అంశాలు మెచ్చుకోదగ్గవి.

అయితే అనేక లోపాలు మనకు ఈ విధానంలో కన్పిస్తున్నాయి. ఐదో తరగతి వరకూ మాతృభాషా మాధ్యమం అన్నారు, మళ్ళీ ఆ వాక్యానికి ముందు కుదిరినంతలో (wherever possible) అని చేర్చారు. ఇది అనవసరపు వ్యాఖ్యానాలకు దారి తీస్తోంది. ఆంగ్ల మాధ్యమాన్ని రుద్దడానికి సిద్ధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చిన్న లొసుగును తీసుకొని మాతృభాషా విద్యకు దూరం చేస్తుంది. బహుభాషా వ్యవస్థలో, లేదా విద్యార్థి ఒక భాష మాట్లాడే ప్రాంతం నుంచి మరొక భాష మాట్లాడే ప్రాంతానికి మారవలసి వచ్చినపుడు ఏం చేయాలి అన్న విషయం ఈ విధానపత్రం స్పష్టం చేయలేదు. త్రిభాషా సూత్రాన్ని అమలు పరచడానికే ఈ విధానం సిఫారసు చేసింది, అందులో హిందీ ప్రధానంగా ఉండాలని, ప్రాంతీయ/ఇంటిభాష ఉండాలని అంటూనే సంస్కృత భాషను కూడా ప్రవేశ పెడతామంటుంది. ఆరవ తరగతి స్థాయిలో విద్యార్థి అంతకు ముందు ప్రవేశపెట్టిన మూడు భాషలను మార్చుకోవచ్చు అని సంకేతం ఇస్తూ, రెండు భాషలు కచ్చితంగా భారతీయ భాషలు అని చెప్పింది. త్రిభాషా సూత్రంలో భాషల ఎంపిక రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తూనే ఎంపిక విద్యార్థి ఇష్టప్రకారం జరగాలని చెప్పింది. ఇంత అయోమయంగా ఈ విషయాన్ని చెప్పడం వలన జరిగే లాభనష్టాలను బహుశా విధానాన్ని రూపొందించినవారు పరిగణించలేదేమో అని అనిపిస్తోంది. 2 నుంచి 8 ఏళ్ళ లోపు విద్యార్థులు ఎక్కువ భాషలను నేర్చుకుంటారు అని, అన్ని భాషలను విద్యార్థికి పరిచయం చేయాలని చెబుతున్నారు. బాగుంది, కానీ క్షేత్రస్థాయిలో ఉన్న సాధకబాధకాలేమిటి? సినిమా, రంగస్థలం, కథనం, కవిత్వం, సంగీతం ద్వారా బహుభాషలను నేర్పించాలనే సంకల్పం చేశారు కానీ, ఆయా భాషలన్నిటిలో ఈ వనరులను రూపొందించాలని, సమాన స్థాయిలో అన్ని భాషలకు ఈ వనరులు ఉండాలని ఆలోచన చేసినట్టు కనిపించడం లేదు. సెకండరీ స్థాయిలో ఆంగ్లంతో పాటుగా కొరియన్, జాపనీస్, థాయి, ఫ్రెంచ్, జెర్మన్, స్పానిష్, పోర్చుగీస్, రష్యన్ లాంటి ప్రపంచ భాషలను చదువుకునే అవకాశం కల్పిస్తామని అన్నారు. ప్రపంచ స్థాయి ఉద్యోగాలకు ఇది దారి వేస్తుంది. కానీ ఇందుకు ఆయా భాషలను నేర్పే అనుసంధాన భాషగా విద్యార్థి మాతృభాష ఉంటేనే మెరుగైన పద్ధతిలో ప్రపంచ భాషలను నేర్పవచ్చు. అలా కాకుండా ఆంగ్లం లేదా హిందీ అనుసంధాన భాషగా ఉంటే, విద్యార్థి మొదట అంగ్లం లేదా హిందీ భాషల మీద పట్టు సాధిస్తే గానీ ఆ ప్రపంచ భాషను నేర్చుకోలేడు!

6 నుంచి 12వ తరగతులలో విద్యార్థి భారతదేశంలో ప్రాచీన భాషలుగా గుర్తింపు పొందిన భాషలను కనీసం రెండు సంవత్సరాలు అధ్యయనం చేయాలి అని చెప్పడం ద్వారా భాషా రాజకీయాలకు, భాషల మధ్య అనవసరపు పోటీకి, అసమానతలకు అవకాశం ఏర్పడుతుంది. ఎందుకంటే ప్రాచీన భాషల అధ్యయనం పేరిట ఆ భాషల ప్రస్తుత సాహిత్యం చదివించేందుకు అవకాశాలు ఎక్కువ, అలాంటి సందర్భంలో ఏ భాషైనా సమానమే కదా మరి!

అంతర్జాలంలో ఇప్పటికే అధిక సాహిత్యాన్ని కలిగి ఉన్న భాషలు ఇతర భాషలను కిందకు నెట్టేసి ఆధిపత్యం చేసేందుకు అవకాశాలు మెండు. సరిసమానంగా ప్రాచీన, ఆర్వాచీన అన్న భేదం లేకుండా భాషలలో సాహిత్యం, వనరులు అభివృద్ధి చేసి అందిస్తే విద్యార్థులు ఎలాంటి అసమానతకు అవకాశమివ్వకుండా అన్ని భాషలలోని మంచి విషయాలను నేర్చుకోవచ్చు.


ఈ విద్యావిధానం సంస్కృత భాషకు అనవసరమైన ప్రాధాన్యతను ఇస్తున్నది. సంస్కృత వాఙ్మయంలో గ్రీకు, లాటిన్ భాషల సంయుక్త సాహిత్యం కన్నా ఎక్కువ సాహిత్యం లభ్యమవుతుంది అని రాసిన వాక్యానికి శాస్త్రీయ ఆధారం లేదు. గ్రీకు, లాటిన్ భాషల్లో ఉన్న సాహిత్యంపై పెద్ద స్థాయిలో గత రెండు శతాబ్దాలలో పాశ్చాత్య దేశాల్లో అధ్యయనం అయింది, వేలల్లో ఉద్గ్రంథాలు వచ్చాయి. సంస్కృతానికి ఆ అవకాశం భారతదేశంలో కలుగలేదు. గణితంలో, తత్వశాస్త్రంలో, వ్యాకరణంలో, సంగీతంలో, రాజకీయంలో, వైద్యంలో, భవననిర్మాణశాస్త్రంలో, లోహశాస్త్రంలో, రంగస్థల సాహిత్యంలో, కవిత్వంలో, కథనంలో వచ్చిన సంస్కృత వాఙ్మయం చాలా పెద్దది అయినప్పటికీ, అందులో ఎంత శాతం ప్రస్తుత, భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందన్న విషయమై విస్తృత పరిశోధనలు ఏవీ జరగలేదు. ఆధునిక భాషలైన ఆంగ్లం, జెర్మన్, కనీసం తెలుగులో గత రెండు శతాబ్దాలలో వచ్చినంత సాహిత్యం సంస్కృతంలో రాలేదన్న విషయం వాస్తవం. ఈ విషయాలన్నీ కాదని, ఒక వైజ్ఞానిక దృక్పథాన్ని వెనక్కు నెట్టి సంస్కృతంలో విజ్ఞాన వ్యవస్థలను ఏర్పాటు చేయాలనుకోవటం విద్యార్థులపై అనవసరపు భారం వేయడమే. సంస్కృతం ద్వారా సంస్కృత భాషను నేర్పించడం సాహసవంతమైన చర్య. ఎలా సాధిస్తారో చూడాలి.

6 నుంచి 8 తరగతుల్లో ప్రతి విద్యార్థి దేశంలో ఉన్న అన్ని భాషలకు సంబంధించిన అవగాహనను పెంచుకునేలా “ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్” పేరుతో ఒక ప్రాజెక్టు లేదా అభ్యాసము చేయాలని నిర్దేశించారు. భారతీయ భాషలన్నీ అకారాది అక్షరక్రమంలో ఉండటం, భాషాపరమైన, వ్యాకరణపరమైన సారూప్యత కలిగి ఉండటం లాంటి ఉమ్మడి సారూప్యతలను గుర్తించి పిల్లలు భారతదేశ ఏకత్వాన్ని గురించి అనుభవపూర్వకంగా తెలుసుకుంటారని ఉద్దేశ్యం. కానీ ప్రతి భాషలో, ప్రతి ఇతర భాష గురించిన కనీస సమాచారం లేనిదే ఇది సాధ్యం కాదు. కేంద్ర ప్రభుత్వం హిందీకి తయారుగా ఈ అంశాలును ఉంచుతుంది. మిగతా భాషల సమాచారం అన్ని భాషలలో పొందుపరిచే బాధ్యత ఆయా రాష్ట్రాలదే అయిపోయి, మళ్ళీ హిందీ ఆధిపత్యం వచ్చే అవకాశం ఎక్కువ.

పాఠ్యపుస్తకాలు కుదిరినంత మేర ద్విభాషా పుస్తకాలుగా

తరువాయి 23వ పుటలో ...

కల్లూరి భాస్కరం
97034 45985



ఆలోచనాశీలి, ఆచరణవాది, సంస్కర్త...ఇంకా మరెన్నో!

పాములపర్తి వెంకట నరసింహారావు- లేదా పీవీ నరసింహారావు- ఇంకా క్లుప్తంగా పీవీ అనే పెద్దాయనను నేను మొదటిసారి కలిసినప్పుడు చెరబండరాజు రాసిన ఒక పాటలోని చరణం గుర్తుకొచ్చింది. ఆయన అప్పటికి మాజీ ప్రధాని అయ్యారు. ఆయన రాసిన 'ది ఇన్‌సైడర్'ను నేను తెలుగు చేయడం ప్రారంభించాను. ఆ సందర్భంలో ఆయనను కలిశాను. మాజీ ప్రధాని కదా, మొదటిసారి కలిసేముందు ఎవరికైనా కాస్త జంకు ఉంటుంది. తీరా ఆయన సంభాషణ ప్రారంభించాక నాలో జంకు పోయింది. చెరబండరాజు పాట చరణం గుర్తు రావడానికి అదీ సందర్భం. "మాలోని మనిషివే, మా మనిషివే నీవు, పొట్టకూటికి నీవు పోలీసువైనావు" అంటాడు ఆ పాటలో చెరబండరాజు. నేను కొద్దోగొప్పో సాహిత్యనేపథ్యంనుంచి వచ్చినవాణ్ణి. ఆయన సంభాషణ ఎత్తుకున్నదీ, కొనసాగించినదీ సాహిత్యం ముచ్చట్లతో. అదీ నాలో జంకు పోవడానికీ, చెరబండరాజు పాట చరణం చటుక్కున గుర్తుకు రావడానికీ కారణం. ఆ చరణాన్ని నేను సవరించుకుని పీవీగారికి అన్వయించుకుంటూ ఇలా అనుకున్నాను: "మాలోని మనిషివే, మా మనిషివే నీవు, (పొరపాటున?) పొలిటీషియనువైనావు".

నేను చెరబండరాజు ప్రస్తావనతో మొదలుపెట్టడంలో ఇంకొకటి కూడా ఉంది. నేను శ్రీశ్రీ, దిగంబరకవులు, విప్లవకవులు, అస్తిత్వవాదుల తరానికి చెందినవాణ్ణి. స్వాతంత్ర్యం కల్పించిన ఆశలు భ్రమలుగా తేలిపోవడం మా తరానికి కొంచెం ముందునుంచే మొదలైంది. పీవీగారు స్వాతంత్ర్యోద్యమతరానికి, స్వప్నాలకు, ఆదర్శాలకు చెందిన వ్యక్తి. కనుక మా మా మధ్య 'మీటింగ్ పాయింట్' ఏమైనా ఉంటుందా అన్నది మొదలే కలిగిన సందేహం. పీవీగారికి తనకంటే పెద్ద అయిన ఏ సాహిత్యవేత్తనో కలిసిన ఇలాంటి అనుభవమే ఎదురై ఉంటే ఆయనకు ఏ విశ్వనాథసత్యనారాయణో గుర్తుకొచ్చేవారేమో! ఇది మా మధ్యనున్న తరం అంతరాన్ని తెలుపుతుంది. ఇలాంటి తేడాల మధ్య నేను ఆయన 'ఇన్‌సైడర్' ను అనువదించాను. ఆ క్రమంలో ఆయనను అనేకసార్లు కలిశాను. ఆయన ఆలోచనలను, ఆయన వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించాను. రెండు తరాల మధ్య తేడా మరీ అంతా గీత గీసినట్టు, కత్తితో కోసినట్టు ఉండదు. ముందు తరం తన తర్వాతి తరం వైపు ఎన్నో కొన్ని అడుగులు వేస్తుంది. తర్వాతి తరం కూడా ముందు తరంవైపు ఎన్నో కొన్ని అడుగులు వేస్తుంది. కనుక అటునుంచి ఇటు, ఇటునుంచి అటు పడిన అడుగుల జాడలు ఈ వ్యాసంలో తప్పనిసరిగా తొంగిచూస్తూ ఉంటాయి.

×××

పీవీగారు (అవిభక్త) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ శాఖలు నిర్వహించిన మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వయసు రీత్యా, పరిణతి రీత్యా ఆయనను నిశితంగా చూసి అంచనా వేసే అవకాశం నాకు కలగలేదు. 1991లో ఆయన ప్రధానమంత్రి అయిన తర్వాతే ఆ అవకాశం కలిగింది. ఆ సమయంలో దేశంలో ఏర్పడిన ఆర్థికసంక్షోభం నుంచి గట్టెక్కించడానికి ఆయా సంస్కరణల రూపంలో ఆయన తీసుకున్న మౌలిక, సాహసిక చర్యలు ఒక జర్నలిస్టుగా నన్ను సహజంగానే ఆకర్షించి, ఆయనపై ఆసక్తి కలిగించాయి. ప్రధానమంత్రిగా ఆయన అయిదేళ్ళ పాలననూ ఒక జర్నలిస్టుగానే పరిశీలించాను. తను మాజీప్రధాని అయిన తర్వాత ఆయన వెలువరించిన 'ది ఇన్‌సైడర్' నుంచి ఒక ఆంగ్లపత్రిక ప్రచురించిన కత్తిరింపులు చూసినప్పుడు కూడా, 'ఇది తెలుగులోకి వస్తే బాగుంటుందే' నని ఒక జర్నలిస్టుగానే అనుకున్నాను. నేను పనిచేస్తున్న ఆంధ్రప్రభ యాజమాన్యం 'ది ఇన్ సైడర్' తెలుగులోకి అనువదింపజేసి ధారావాహికగా ప్రచురించాలని నిర్ణయించినప్పుడు, సంపాదకులు వి. వాసుదేవదీక్షితులు గారు ఆ బాధ్యత నాకు అప్పగించినప్పుడు, 'పాఠకులకు ఇది ఎంతవరకు నచ్చుతుంది, ఏ మేరకు సంచలనాలు రేపి పత్రిక సర్క్యులేషన్ కు తోడ్పడుతుం'దని- ఒక జర్నలిస్టుగానే ఆలోచించాను.

అంటే అనువాదంలోకి దిగే ముందు పుస్తకం మీద కానీ, పుస్తకంలోంచి తొంగిచూస్తున్న పీవీగారి గురించి కానీ ఇంతకు మించి గొప్ప ఊహలు, అంచనాలు ఏమీ లేవు. తీరా అనువాదం మొదలుపెట్టాక; ఓ రెండు అధ్యాయాలు ఆయన చూసి సరే అని, నాతో నేరుగా ఉత్తరప్రత్యుత్తరాలు, సంభాషణ ప్రారంభించాక -- పుస్తకాన్నే కాక, ఆయనను కూడా కాస్త లోతుగా చూసే వెసులుబాటు కలుగుతూ వచ్చింది. ఆయనతో సమావేశాలు ఆ ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్ళాయి. తెల్లని పంచె, లాల్చీ, కండువాలతో తెలుగుదనం ఉట్టిపడేలా కనిపించే ఈ వామనమూర్తిలోని ఆలోచనల ఆజానుబాహువును పోల్చుకోవడం; ఆయనలో నాకు అంతవరకు తెలియని లోతులను, కోణాలను గమనించడం ప్రారంభించాను.

రాష్ట్రమంత్రి నుంచి దేశప్రధానమంత్రివరకు ఎదిగి సుదీర్ఘ రాజకీయ, పదవీజీవితాన్ని చూసిన ఈ పెద్దమనిషికి, అలాంటివారిలో సహజంగా ఉండే ప్రొటోకాల్ పట్టింపులేవీ లేవు. అట్టడుగు స్థాయిలో

పనిచేసే వ్యక్తితో నేరుగా సంబంధం, సంభాషణ పెట్టుకోగలరు! ఇదీ ఆయన వ్యక్తిత్వం గురించి నా తొలి ఎరుక.

×××

ఆంధ్రప్రభ సంపాదకులతోనూ, ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు ద్రోణంరాజు సత్యనారాయణగారితోనూ కలసి మొదటిసారి కలిసినప్పుడు పరిచయాలూ, కుశలప్రశ్నలూ అయ్యాక ; "ఇక మా ఇద్దరినీ వదిలేయండి. మేము అనువాదం గురించి మాట్లాడుకుంటా" మంటూ నేరుగా నాతో సంభాషణ ప్రారంభించారు. విశ్వనాథ సత్యనారాయణగారి 'వేయిపడగలు' నవలను తను 'సహస్రఫణ్' పేరుతో హిందీలోకి అనువదించడం గురించి చెప్పుకొచ్చారు. ప్రచురణకర్తలు పుస్తకం మరీ పెద్దదిగా ఉందని, కుదించాలని అన్నారట. తను విశ్వనాథవారితో ఆ మాట అంటే ఆయన ససేమిరా, వల్లకాదు అన్నారట. అప్పుడు ఎలాగో ఒప్పించారట. ఆ విధంగా హిందీ అనువాదంలో మూలం 500 పేజీల మేరకు తగ్గింది.

ఇంకోసారి కలిసినప్పుడు అనువాదవిధానం గురించి తన అభిప్రాయాలు చెప్పుకుంటూ వచ్చారు. వేరే భాషనుంచి తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు అందులో తెలుగుదనం ఉండాలనీ, వీలైనంతవరకు తెలుగు సామెతలను, నుడికారాన్ని వాడాలని అనుకుంటాం. కానీ అది పద్ధతి కాదని పీవీగారు అన్నారు. వేరే భాషలోని వాక్యనిర్మాణశైలిని, నుడికారాన్ని, సామెతలను వీలైనంతవరకు తెలుగులోకి యథాతథంగా తీసుకురావాలట! అప్పుడే తెలుగులో పదసంపద, వ్యక్తీకరణశక్తి పెరుగుతాయని ఆయన వివరణ. తెలుగుదనం తేవడం ముఖ్యమనుకుంటున్న నాకు ఆయన అభిప్రాయం వింతగా అనిపించింది. కానీ ఆయన చెప్పిన కారణం మాత్రం ఆలోచింపజేసింది.

ఆ తర్వాత రాష్ట్రమంత్రిగా, బహుభాషలు తెలిసినవారుగా, సాహితీవేత్తగా నాకు అంతగా తెలియని ఆయన జీవనానుభవాలలోకి కాస్త లోతుగా తొంగి చూసినప్పుడు; అనువాదం గురించే కాక, భాషగురించి కూడా ఆయనకు నాకంటే కూడా ఎక్కువ అనుభవం, అవగాహన, క్రియాశీలత ఉన్నట్టు బోధపడింది. పాత్రికేయమిత్రులు టి. ఉదయవర్లు గారు రాసిన ఒక వ్యాసం నుంచి ఉటంకించుకుంటే, ఒక భాష నుంచి మరొక భాషలోకి అనువాదం చేయడంవల్ల ఆయా భాషా జనాలకు చెందిన సంస్కృతులు కూడా ఇతర భాషాజనాలకు తెలుస్తాయనీ, దీనివల్ల భిన్నత్వంలో ఏకత్వం సాధించవచ్చునని పీవీ భావించేవారు. ఇది శైలి, శిల్పం, నుడికారం, సామెతల యథాతథానువాదం వల్ల కలిగే ప్రయోజనానికి అదనం. దేశాకాల పరిస్థితుల రీత్యా అది ఈనాటి అవసరమనీ, ప్రపంచభాషల్లోని మహా కావ్యాలు అన్నింటినీ రష్యన్ భాషలోకి అనువదించడానికి దోహదం చేసిన పీపుల్స్ పబ్లిషింగ్ హోమ్ పద్ధతి మనకీ అవసరమని, తెలుగు విశ్వవిద్యాలయం లాంటి సంస్థలు పాఠకులు ఉన్నారా లేదా అన్నది పట్టించుకోకుండా గ్రంథాలు ప్రచురించి సంస్కృతిని పరిరక్షించాలని పీవీ అనేవారు.

భాష గురించిన ఆలోచన, ఆచరణ

ఆయనకు రాజకీయ, పరిపాలనాజీవితం ఎంత ఉందో దాదాపు అంతగానూ భాష గురించిన ఆలోచన, ఆచరణ జీవితం ఉన్నాయి. దక్షిణభారత హిందీప్రచార సభలోనే కాక, జాతీయ

ఆయనకు రాజకీయ, పరిపాలనాజీవితం ఎంత ఉందో దాదాపు అంతగానూ భాష గురించిన ఆలోచన, ఆచరణ జీవితం ఉన్నాయి.

స్థాయిహిందీ ప్రచారసంస్థలలో కీలకపదవులు నిర్వహించిన వేమూరి ఆంజనేయశర్మగారు పీవీగారి గురించి కొన్ని విశేషాలను పంచుకున్నారు. దక్షిణభారత హిందీ ప్రచారసభకు ఇందిరాగాంధీ అధ్యక్షులుగా ఉండేవారు. సభ కార్యకలాపాలు సక్రమంగా జరగకపోవడంతో ఇందిరాగాంధీ పీవీని ఉపాధ్యక్షుడిగా నియమించారు. వేమూరి ఆంజనేయశర్మగారు ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. పీవీ సారథ్యంలో హిందీ ప్రచారసభ కార్యకలాపాలు గాడిన పడడమే కాదు, కొత్తపుంతలు తొక్కాయి. **కేవలం హిందీని మాత్రమే కాక, ఇతర భారతీయభాషలను అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పీవీ కొన్ని మౌలిక ఆలోచనలను అమలు చేశారు. ఉదాహరణకు, హిందీ ఎం. ఏ సిలబస్ అప్పటికి సాహిత్యప్రధానంగా ఉండేది. పీవీ దానిని భాషాప్రధానంగా కూడా రూపొందింపజేశారు. సాహిత్యకారులకు లేని ఒక అదనపు చూపు, ఒక అదనపు బాధ్యత పరిపాలనావేత్తగా పీవీగారికి ఉండడం ఇందుకు కారణం. భారతీయభాషల్లో పరిపాలన జరగడానికి వీలుగా ఆయన ఈ ఆలోచన చేశారు.** విచిత్రమేమిటంటే, ఈ మార్పును అమలు చేయడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిష(యూజీసీ)నే కాదు, భారతప్రభుత్వం కూడా మొదట్లో వెనుకాడిందట. పాఠ్యక్రమానికి రూపకల్పన జరిగిన తర్వాత కూడా విశ్వవిద్యాలయాలు తటపటాయిస్తే, పీవీగారే ద. భా. హిం. ప్ర.సం కు చెందిన హైదరాబాద్ పీజీ సెంటర్ లో ఆ పాఠ్యక్రమాన్ని ప్రారంభింపజేశారు. ఆ తర్వాత ఇది దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలకూ విస్తరించింది. **హిందీ సహా భారతీయభాషలను కంప్యూటర్‌కు అనుగుణంగా రూపొందించడంలో కూడా పీవీగారిదే ప్రాముఖపాత్ర** అని ఆంజనేయశర్మగారు అంటారు.

బోధనా పరిపాలనాభాషగా తెలుగు

తెలుగును బోధనాభాషగా, పరిపాలనాభాషగా మలచడంలో పీవీగారు పెద్ద ప్రయత్నం, పెద్ద యుద్ధం చేశారు. ఆ కృషిని బూదరాజు రాధాకృష్ణగారు వివరిస్తూ, తను ఎంతోమంది విద్యామంత్రులను ఎరుగుదుననీ, విద్యాశాఖ కార్యదర్శులను, డైరక్టర్లను, విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులను చాలామందిని చూశానని, పీవీగారికి ఉన్నంత భాషాభిమానం ఇంకెవరిలోనూ చూడలేదని అంటారు. చేతనైన పద్ధతిలో మాతృభాషలో సృజనాత్మక రచనలు చేయడమే భాషాసేవ అని మనలో చాలామంది అనుకుంటారనీ; శాస్త్రగ్రంథ రచన చేసినా, శాస్త్రీయవిషయాలను ప్రస్తావించినా అది భాషాసేవ కిందికి వస్తుందా అని సందేహిస్తారనీ, ఇలాంటి వాతావరణాన్ని గుర్తుంచుకున్నప్పుడు పాములపర్తివారు తెలుగుభాషకు చేసిన సేవ ఎన్ని అవరోధాల మధ్య, ఎంతటి విరుద్ధవాతావరణంలో ఎంత సమర్థంగా సాగిందో నిగ్గుతేలుతుందనీ ఆయన వ్యాఖ్య. ఆయన ప్రకారం, పీవీగారి భాషాసేవలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఎవరికి వారు వ్యక్తిగత వికాసానికే ప్రాధాన్యం

ఇచ్చే భాషారంగంలో, బృందంలో ఒకడిగా పనిచేసే లక్షణాన్ని అలవాటు చేయడం.

తెలుగులో విద్యాబోధన, పరిపాలనా నిర్వహణలకు సంబంధించి పీవీకి ముందున్న చరిత్రను బూదరాజువారు ఏకరవు పెడుతూ, పీవీ దోహదం ఎలాంటిదో ఎత్తి చూపుతారు. ఉదాహరణకు, 1926లో ఆంధ్రవిశ్వకళాపరిషత్తును స్థాపిస్తూ చట్టం తెచ్చినప్పుడే విద్యాబోధన తెలుగులో జరగాలని నిర్దేశించుకున్నారు కానీ అమలు జరగలేదు. 1946-47లో బ్రిటిష్ వాళ్ళు తూర్పు గోదావరిజిల్లాలో ప్రభుత్వం వారి ఉత్తరప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరగాలని ఉత్తరువు ఇచ్చినా అదీ అమలు జరగలేదు. 1950-52 మధ్య కాలంలో నిజాం నవాబు తన అధీనంలోని తూర్పు జిల్లాల్లో అదేవిధమైన ఉత్తరువు ఇచ్చినా అమలు కాలేదు. తెలుగు భాష క్రమంగా అధికారభాష కావాలనే కోరిక 1955లో కానీ తీర్మానరూపం ధరించలేదు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక అప్పటి శాసనసభ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు అధ్యక్షతన 1957లో పరిపాలనకు అవసరమైన పరిభాషను తెలుగులో రూపొందించాలనే సంకల్పం కలిగింది. పీవీ భాగస్వామ్యం అప్పటినుంచీ మొదలు. 1963లో 900 పేజీల పరిపాలనా న్యాయపదకోశం వెలుగు చూసింది. 1953-62 మధ్యకాలంలో తెలుగు టైపింగులో శిక్షణ, పరీక్షణ జరిగాయి. 1962లో తెలుగులో ఉత్తరువులు రాసే ముసాయిదా వెలువడింది. 1966 నాటికి గాని తెలుగును అధికారభాషగా గుర్తించే చట్టం రాలేదు. పీవీ న్యాయశాఖ మంత్రిగా ఉండగానే తెలుగు అనువాదవిభాగం ఏర్పడింది. అంతకుముందు భారతరాజ్యాంగాన్ని 'భారత సంవిధానం' పేరుతో పీవీయే తెలుగులోకి అనువదించారు. ఇంగ్లీషులో ఉన్న చట్టాలను తెలుగులోకి అనువదించడానికి తగిన విధాననిర్దేశం చేస్తూ తెలుగులో శ్వేతపత్రాన్ని శాసనసభలో ప్రవేశ పెట్టే బాధ్యతను న్యాయశాఖమంత్రిగా 1968-69లో పీవీయే నిర్వహించారు. తనకన్నా ముందు చట్టాలను తెలుగులోకి అనువదించిన వారు పద్దిపాట్లను పీవీగారు శ్వేతపత్రంలో ప్రస్తావించారు. అనువాద సాధ్యాసాధ్యాలను చర్చించారు. 1968లో విద్యామంత్రిగా ఇంటర్మీడియట్ స్థాయిలో, ఆ పై స్థాయిలో తెలుగును బోధనామాధ్యమంగా ప్రవేశపెట్టడానికి తెలుగు అకాడెమీని, ఇంటర్మీడియెట్ బోర్డును నెలకొల్పడమే కాక, వాటి రోజువారీ నిర్వహణ తీరును కూడా పర్యవేక్షించారు. తెలుగులో పరిపాలనా నిర్వహణకు తోడ్పడడానికి అధికార భాషా సంఘాన్ని నియమించారు. 1971లో నేషనల్ బుక్ ట్రస్టుతో కలసి అనువాదవిధానాల మీద చర్చాగోష్ఠి నిర్వహించారు. **ఇంత కృషిలోనూ భాషావేత్తల నుంచి పీవీకి తగినంత సహకారం లభించిందా అంటే, లేదంటారు రాధాకృష్ణ. శ్వేతపత్రంలో పీవీ పేర్కొన్న భాషా సిద్ధాంతాలను తప్పన్నారే కానీ, తమకు న్యాయశాస్త్రం పరిచయం లేదన్న సంగతిని గుర్తించలేదు.** న్యాయపరిపాలన దృష్టితో పీవీ చేసిన ప్రసంగాలను వారు అర్థం చేసుకున్నట్టులేదు. న్యాయనిర్వహణ సమస్యలు తెలియవు. **దాదాపు 21 శాస్త్రాల్లో పరిభాషను సేకరించి, కల్పించి పాఠ్యగ్రంథాల్లో ప్రయోగించాలని తెలుగు అకాడెమీ నిర్ణయించినప్పుడు, ఆ నిర్ణయం రచయితల స్వాతంత్ర్యాన్ని హరిస్తుందనీ, ఎవరి పరిభాషను వారు వాడనివ్వాలని వాదించిన భాషావేత్తలు ఉన్నారు.**

అధికారభాషపై శాసనసభకు పీవీ సమర్పించిన శ్వేతపత్రం లోతైన పరిశోధనను, పాండిత్యాన్ని పట్టి చూపుతుందని మరో ప్రముఖభాషాశాస్త్రవేత్త భద్రిరాజు కృష్ణమూర్తి అంటారు. శాతవాహనుల కాలం నుంచీ శాసనాలలో తెలుగు వాడకాన్ని అది ప్రస్తావించింది. రకరకాల పన్నులను, భూసంబంధాలను సూచించే తెలుగు పదాలను శాసనాలనుంచి పీవీ అందులో విస్తారంగా ఉటంకించారు. ఇంటర్మీడియట్ స్థాయి నుంచీ పాఠ్యపుస్తకాల్లో ఆధునికమైన తెలుగు వాడాలా, లేక గ్రాంథికం వాడాలా అన్న వివాదం తలెత్తినప్పుడు ఆధునికమైన తెలుగునే వాడాలని చెబుతూ పీవీ ఆ వివాదాన్ని పరిష్కరించడమే కాక; కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ మాండలికాలనుంచి కూడా పదాలను తీసుకోవాలని సూచించారట.

అనువాదవిధానం గురించి పీవీగారు నాతో మాట్లాడినప్పుడు, అనువాదంలో ఆయన నాకంటె ఎంత అనుభవజ్ఞులో, భాష విషయంలో ఎన్ని దక్కా మొక్కీలు తిన్నారో నాకు అప్పటికి పెద్దగా తెలియదు. **పీవీగారితో నాకు కలిగిన ఆ కాస్త పరిచయంతో ఆయనలో నాకు ప్రధానంగా కనిపించింది ఒక ఆలోచనాశీలి, ముందుచూపు దండిగా ఉన్న ఒక దార్శనికుడు. ఇంకా చెప్పాలంటే పీవీ ఆలోచనల శతావధాని. ఆయన ఏక కాలంలో అనేక విషయాల మీద అనేక ఆలోచనలు, అనేకమందితో చేయగలరు. వాటికి నెలల తరబడి కొనసాగే ఒక 'సీరియల్' స్వభావం ఉంటుంది.** ఒకసారి అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు అమలు చేస్తున్న 'ఐడియా'ల గురించి, వాటిపై తన కున్న సందేహాల గురించి, వాటి నివృత్తికి తను ప్రయత్నించడం గురించి నాతో చెప్పుకుంటూ వచ్చారు. ఈ ఒక్క విషయం మీదే నాతో ఆయన సంభాషణ, మధ్య మధ్య పదిహేను, ఇరవై రోజుల విరామంతో రెండు నెలలకు పైగా 'సీరియల్' గా సాగింది. ప్రతిసారీ, ఇంతకుముందు సంభాషణ ఎక్కడ ఆగిందో సరిగ్గా అక్కడినుంచి ఎత్తుకునేవారు. ఆయనలో సమగ్రదృష్టి కలిగిన ఆలోచనాశీలిని పట్టి చూపే ఇలాంటి ఉదాహరణలను ఎన్నైనా ఇవ్వవచ్చు. అమ్మనుడిని ఆదరించడం, తెలుగులోనే బోధన జరగడం, పరిపాలనలో తెలుగును అమలు చేయడం, ఇంగ్లీష్ మాటలు లేకుండా తెలుగులోనే మాట్లాడడం లాంటి విషయాలను మనలో చాలామంది ఉద్వేగస్థాయిలో నొక్కి చెబుతూ ఉంటారు. ఆచరణకోణం నుంచి కూడా వాటిని చూసి ఆలోచించేవారు తక్కువ. పీవీగారి ఆలోచనాశైలిలోని ప్రత్యేకత అదే. **తెలుగును బోధనామాధ్యమంగానూ, అధికారభాషగానూ అమలు చేయడానికి అంత కృషి చేసిన ఆయన, వాటిని అంటిపెట్టుకుని వచ్చే సమస్యల గురించీ ఆలోచించారు. ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్నవారికి ఉద్యోగాలలో ఉన్నన్ని విస్తృత అవకాశాలు తెలుగు మాధ్యమంలో చదువుకున్నవారికి ఉంటాయా అన్న సందేహాన్నికూడా ఆయనే లేవనెత్తి దానికి పరిష్కారం కనుగొనాలంటారు. ఆవిధంగా బోధన (instruction), పరిపాలన (administration) లకు ఉద్యోగానియామకాలు (recruitment)ను కూడా ఆయన జోడించారు.** ఆచరణ సమస్యలు ఉంటాయి కనుకనే, **"భాషావిధానాన్ని ఏవో ఒకటి రెండు రాష్ట్రాలలో మాత్రమే అమలుచేయలేం. జాతీయవిధానం అవసరం. అఖిలభారతస్థాయిలో విధానాన్ని**

అమలుచేస్తే తప్ప మనం విజయం సాధించలేం" అంటారు ఒక ప్రసంగంలో. బోధన, పరిపాలన, ఉద్యోగనియామకాలే కాకుండా భాషకు సంబంధించి ఒక స్థాయి, లేదా అంతస్తు(స్టేటస్) అనేది కూడా ఒకటి ఉంటుందని, అది ఉన్నప్పుడు భాషకు తనంత తానే ఒక శక్తి వస్తుందని, తెలుగుకు ఇతర భాషలతో సమానమైన అలాంటి అంతస్తును కల్పించగలిగినప్పుడు భాషావిధానం అమలులో అది ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుందని ఆయన అంటారు. ఇలా ఆలోచనా శీలితో పోటీ పడే ఆచరణశీలి కూడా కావడం పీవీ ప్రత్యేకతలలో ఒకటి. కోర్టులో డిక్రీ పొందిన తర్వాతే అసలు కష్టాలు మొదలవుతాయనీ, అలాగే విధాననిర్ణయం తీసుకున్న తర్వాతే అమలు ఎలా అన్న అసలు సమస్య మొదలవుతుందనీ, మనలో చాలామంది దీనికి తలకిందులుగా భావిస్తారని ఆయన అంటారు. **కేంద్రంలో మానవవనరుల అభివృద్ధి శాఖామంత్రి కావడానికి ముందే జాతీయవిద్యావిధానం రూపకల్పనలో కీలకపాత్ర పోషించినదీ, ఆ తర్వాత మానవవనరుల మంత్రిగా నవోదయపాఠశాలల ఏర్పాటు రూపంలో నాణ్యమైన విద్యను అందుబాటులో తెచ్చినదీ ఆయనే.** అంతకుముందు సర్వేల్ పాఠశాలల ఏర్పాటు ఆయన ఆలోచనే. నవోదయపాఠశాలల్లానే ఇవి కూడా పెద్దగా ఆర్థికస్తోమత లేని విద్యార్థులకు భవిష్యజీవితంలో ఉన్నతస్థాయిని అందుకోడానికి తోడ్పడే విద్యను అందించాయి.

×××

ప్రజాస్వామ్యపు ఆధ్యాత్మిక రూపాన్ని దర్శించారు

కాసు బ్రహ్మానందరెడ్డి తన మంత్రివర్గసహచరుడైన పీవీని బృహస్పతి అని పిలిచేవారట. 'లోపలి మనిషి'లో ముఖ్యమంత్రి చౌదరి, మంత్రి ఆనంద్ ను అలాగే పరిగణించేవాడు. ఆలోచనాశీలి అనే మాటకు ముందు 'మౌలిక' అనే విశేషణాన్ని జోడించుకుంటే తప్ప పీవీ గురించిన చిత్రణ పూర్తి కాదు. **ఆయన ఏ మంత్రిత్వశాఖలో ఉన్నా మౌలిక ఆలోచనలు చేశారు, వాటిని అమలు చేశారు. ఏడు, పది తరగతులు మినహా మిగతా తరగతుల్లో తప్పనిసరి ఉత్తీర్ణతను(డిటెన్షన్ పద్ధతిని) రద్దు చేసిన సాహసి పీవీగారే నంటారు** నాటి ప్రముఖ పత్రికా సంపాదకులు కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం. నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో స్టేట్ మంత్రిగా తనకు జైళ్ల శాఖ అప్పగించినప్పుడు జైలు సంస్కరణలకు ఆయన ఎలాంటి ప్రయత్నాలు చేశారో స్వాతంత్ర్య సమరయోధుడు ఎం. ఎల్. నరసింహారావు రాస్తారు. **విదేశాలలో జైళ్ల సంస్కరణ విధానాన్ని పీవీ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఇతర రాష్ట్రాలలోని జైళ్ల పరిస్థితిని, కేంద్రప్రభుత్వ విధానాన్ని బాగా పరిశీలించి రాష్టంలో జైళ్ల సంస్కరణ చర్యలకు పూనుకున్నారు.** రాష్ట్రంలోనే మొదటిసారిగా ఆ విషయమై ఒక సదస్సును నిర్వహించారు (ఎందులోనైనా కొత్త ఆలోచనల అమలుకు సంకల్పించినప్పుడు సదస్సులు ఏర్పాటు చేసి, నిపుణుల అభిప్రాయాలను ఆహ్వానించడం పీవీ మొదటి నుంచి చివరి వరకు అనుసరించిన ప్రజాస్వామిక విధానం). ఆ సదస్సులో వచ్చిన సూచనల ప్రకారం, 1965లో మొదటిసారి అనంతపురం వద్ద ఆరు బయలు జైలును ఏర్పాటు చేశారు. బాల నేరస్థులకు, మహిళా ఖైదీలకు ఎన్నో సౌకర్యాలు కల్పించారు. **ఆ తర్వాత వైద్యఆరోగ్య మంత్రిగా, విడివిడిగా ఉన్న ఆ రెండు శాఖలనూ విలీనం చేశారు. ప్రభుత్వ వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్‌ను నిషేధిస్తూ బిల్లు ప్రవేశపెట్టారు. రాజకీయరంగంలో పీవీ చేసిన మౌలిక ఆలోచనలు ఇంకో ముఖ్యమైన అధ్యాయం.** అంతవరకు పెద్దగా రాజకీయ ప్రాతినిధ్యం లేని ఆయా సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించి కొత్త సమీకరణలను నిర్మించడం 'సోషల్ ఇంజనీరింగ్' పేరుతో ఇటీవలి కాలంలో ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చింది. రాష్ట్రంలో 1972 ఎన్నికలలోనే ఇలాంటి 'ఇంజనీరింగ్' ను అమలు చేసిన కీర్తి పీవీకి దక్కుతుంది. ఆ ఎన్నికలలో ఆయన వెనుకబడిన తరగతులకు, మహిళలకు, మైనారిటీలకు ఎక్కువ సీట్లు కేటాయించారు. ఆయన ముఖ్యమంత్రి అయినప్పటినుంచే 'బలహీనవర్గాలు' అనే మాట ప్రాచుర్యంలోకి వచ్చిందంటారు పాత్రికేయకురువృద్ధులు తుర్లపాటి కుటుంబరావు. పీవీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కూడా, రాష్ట్రంలో అప్పటికి రాజకీయప్రాబల్యం విశేషంగా ఉన్న సామాజికవర్గాలకు అదనంగా మరో సామాజికవర్గాన్ని కూడా బరిలోకి దింపి తద్వారా రాజకీయ సమతూకాన్ని తేవడానికి ఆలోచన చేయడం నాకు తెలుసు.

×××

భారతదేశ చరిత్రలో, రాష్ట్ర చరిత్రలో కొందరు సాంఘిక, మతసంస్కర్తలుగా ప్రసిద్ధులైనట్టుగా; రాజకీయ, పరిపాలనారంగంలో వారితో సమానమైన గుర్తింపును రేపటి తరాలు పీవీగారికి మరింతగా ఇవ్వవచ్చు. **ఆయన రాజకీయ, పరిపాలనా జీవితంలో అతిముఖ్య సంస్కరణలుగా రెండు ప్రధానంగా పైకి తేలతాయి. ఒకటి, ముఖ్యమంత్రిగా ఆయన తలపెట్టిన భూసంస్కరణలు; రెండు, కేంద్రమంత్రిగా ఆర్థికసంస్కరణలు. నిజం చెప్పాలంటే, దేశం మొత్తం మీద భూసంస్కరణలపై పేటెంట్ పీవీగారిదే.** భూపోరాటాలలో ఎంతో అనుభవం ఉన్న కమ్యూనిస్టులు కూడా భూసంస్కరణలపై పీవీగారి మార్గదర్శనం కోరుకున్నారంటే దానిపై ఆయన ఆరాట, అధ్యయనాల లోతు అర్థమవుతుంది. అప్పట్లో కేరళ ముఖ్యమంత్రిగా ఉన్న అచ్యుత మీనన్ కూడా భూసంస్కరణలపై తన సూచనలు, సలహాలు కోరారని పీవీ స్వయంగా నాతో అన్నమాట.

మొదటే చెప్పినట్టు భిన్నతరానికి చెందిన నేను పీవీని సానుకూల దృష్టినుంచి అర్థం చేసుకునే దిశగా బలమైన అడుగులు వేసింది; భూమి గురించి, భూసంస్కరణల గురించి 'ఇన్‌సైడర్' లో ఆయన రాసినది చదువుతున్నప్పుడే. అంతకన్నాముందు నన్ను ఆకర్షించిన ఘట్టం ఇంకొకటి ఉంది.... అది, 'లోపలిమనిషి'లో ఆనంద్ మొదటిసారి మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత, 'అసలు అధికారం ఎందుకు, తన మీద దాని ప్రభావం ఎలా ఉంటుం'దని ప్రశ్నించుకుని ఆత్మవిమర్శ చేసుకోవడం. ఇవి చాలా అవసరమైన, మౌలికమైన ప్రశ్నలు. ఈ ప్రశ్నలు ముందుకు తెచ్చిన మరో రాజకీయనాయకుణ్ణి నేను అంతవరకు చూడలేదు. శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు, రకరకాల కోరికలతో, విజ్ఞాపనలతో తన దగ్గరికి వచ్చే ఆర్తుల మధ్య గడుపుతున్నకొద్దీ తనొక వ్యక్తినన్న భావననుంచి బయటపడి పూర్తిగా విభిన్నమైన జీవిగా పరివర్తన చెందినట్టు అతనికి(ఆనంద్ కి) అనిపిస్తుంది. తన వ్యక్తిగత అస్తిత్వానికి ఇప్పుడు ప్రాముఖ్యం లేదనీ, తన ఆనందవిషాదాలు, తన బంధుమిత్రులు,

తన ఇష్టాయిష్టాలు–అన్నీ అంతకంటె ఎంతో విస్తృతమైన ఆవరణలో లయమైపోయాయనీ, అది విశ్వజనీనమైన మానవాళి అస్తిత్వం మొత్తాన్ని తనలో పొదవుకున్న ఆవరణమనీ ఊహ చేస్తాడు. ఈ అతీతస్థితిలో ప్రజాస్వామ్యపు ఆధ్యాత్మికరూపాన్నిఅతడు దర్శిస్తాడు! శాసనసభ్యుడిగా తనొక లక్షమందికి ప్రాతినిధ్యం వహిస్తే, ఇప్పుడు మంత్రిగా కొన్ని కోట్లమంది ప్రజల శ్రేయస్సుకు బాధ్యత వహించవలసివస్తుందని, ప్రాతినిధ్యం నుంచి బాధ్యతకు పరివర్తన దానికదే పెద్ద మార్పని అనుకుంటాడు. **"మంత్రికీ, మామూలు మనిషికీ మధ్య వ్యత్యాసమేమిటి? స్వార్థపరార్థాల క్రమాన్ని తలకిందులు చేయలేనప్పుడు మంత్రి చేతిలో అదనంగా అధికారమనేది ఎందుకుండాలి, అందుకు ఎలాంటి కారణమూ లే"**దని ఆనంద్ నిర్ధారణకు వస్తాడు.

అధికారం గురించిన ఈ వివేచనే 'లోపలి మనిషి'లో మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఆనంద్ వ్యవహరణలో అడుగడుగునా ప్రతిఫలిస్తుంది. తీవ్ర ఆక్షేపణలను, విమర్శలను, శత్రుత్వాలను, చివరికి పదవీభద్రతను ఎదురొడ్డి ఆనంద్ భూసంస్కరణల అమలుకు పూనుకునేలా చేసింది. అధికారం గురించి తర్కించుకున్నట్టే భూమి గురించి, భూసంస్కరణల గురించి ఆనంద్ సుదీర్ఘంగా తర్కించుకుంటాడు. సాహిత్యపరంగానూ లోతైన, గాఢమైన అభివ్యక్తిని తెచ్చుకున్న ఘట్టాలలో అది కూడా ఒకటి. అతని ఆలోచనలు ఇలా సాగుతాయి:

"భూమి అంటే అధికారం. గ్రామజీవనంలో అదే సర్వస్వం. గ్రామీణచైతన్యంలో భూమి సర్వశక్తిమంతం, సర్వవ్యాప్తం, సర్వసాక్షి. భూమి ఎవరూ ఢీకొనలేని సర్వోన్నతశక్తి, ఎవరూ నిరాకరించలేని మహా సత్యం, ఎవరూ విచ్ఛిన్నం చేయలేని జటిల నిర్మాణం. శతాబ్దాలుగా ఇది మళ్ళీ మళ్ళీ రుజువవుతూనే ఉన్న నిజం.

"భారతదేశంలో భూమికథ హింసతో రక్తపాతంతో, కన్నీటి మరకలతో నిండి అనంతంగా విస్తరించింది. ఆధికారికపత్రాలు, ముఖ్యంగా భూమి సమస్య గురించి నిపుణులు రాసిన గ్రంథాలు లోతుగా అధ్యయనం చేసి తెలుసుకున్న ఎన్నో కీలకాంశాలతో ఆనంద్ మెదడు కిక్కిరిసిపోయింది. వాటిలో ఒకటి, పందొమ్మిదో శతాబ్దంలో బ్రిటిష్ పాలకుల ప్రోత్సాహంతో ఒక వ్యవస్థగా ఎదిగిన భూస్వామ్యం పుట్టుకకు సంబంధించినది....ఆ రోజుల్లో బందిపోటు, రాజు, భూస్వామి వీరందరూ ఒకే వ్యక్తి ధరించే మూడురూపాలుగా పరిణమించిన ఆశ్చర్యకర సన్నివేశం విశేషంగా చెప్పుకోదగినది.... "భూమి, తన మీద జీవించే ప్రతి ఒకరికీ సొంతం; చెట్టు తన మీద గూడు కట్టుకున్న ప్రతి పిట్టకీ సొంతం; అలాగే నీరు...అప్రయత్నంగా, అవ్యాజంగా కలిగే సృష్టికర్త చలవతో తనలోకి ఎగిరి దూకుతూ, ఈదుతూ, జారుతూ, పిల్లిమొగ్గలు వేస్తూ స్వేచ్ఛగా సంచరించే ప్రతి చేపపిల్లకీ సొంతం. ప్రతిదీ ప్రతి ఒకరికీ చెందుతుంది. 'చెందడం' అన్నదే సర్వత్రా వ్యాపించిన స్వాభావికస్థితి. అక్కడ ఎటువంటి రికార్డులూ లేవు, రిజిస్ట్రేషన్లు లేవు, ఎవరికీ ప్రత్యేకమైన స్వామ్యం లేదు, ఎవరికీ వ్యక్తిగతమైన హక్కు లేదు. ఇటువంటి అద్భుతమైన సుందరమైన వ్యవస్థనుంచి నేటి వ్యవస్థకు చేరుకోవడంలో అభ్యుదయం అనదగినదేమీ లేదని ఆనంద్ విచారంగా అనుకున్నాడు...

భూమి గురించి ఇలా తలపోస్తున్నప్పుడే ఆనంద్ కు గతించిన తండ్రి గుర్తుకొస్తాడు. అతని ఆలోచనలు తండ్రి అవసానదశవైపు మళ్లుతాయి. 'లోపలి మనిషి'లో ఎంతో ఆర్ద్రతతోపాటు గాంభీర్యాన్ని సంతరించుకున్న విశిష్టఘట్టాలలో ఇది ఒకటి. ఈ చిత్రణలో వెనుకటికాలపు దాంపత్యసరళిని, తండ్రీ–కొడుకుల బంధాన్ని పీవీ అద్భుతంగా చిత్రీకరిస్తారు:

"తన అనారోగ్యం విషమిస్తోందని బహుశా నాన్నకి తెలుసు. కానీ అప్పుడే లా పరీక్షకు కూర్చోబోతున్న తనకు పరీక్షకు వెళ్లలేని పరిస్థితి కలిగించకూడదనుకున్నాడు. పరీక్ష పూర్తి కాగానే ఇంటికి రమ్మని చిన్న ఉత్తరం రాసి ఊరుకున్నాడు. ఆఖరిపరీక్ష కూడా రాసి ఇంటికొచ్చి నాన్న పరిస్థితిని చూసిన మీదట కానీ ఆయన తన క్షేమం కోసం ఎంత ప్రమాదాన్ని స్వీకరించాడో అతనికి అర్థం కాలేదు. గంట గంటకీ పరిస్థితి క్షీణిస్తున్నా అదృష్టవశాత్తూ నాన్న స్పృహలోనే ఉన్నాడు. 'నువ్వు వచ్చావు, చాలా సంతోషం' అన్నాడు భావగర్భితంగా. .. "నాన్న త్వరత్వరగా మాట్లాడుతున్నాడు. ఆ మాటల్లో కూడా ఆశ్చర్యం గొలిపేంత స్పష్టత ఉట్టిపడుతోంది. తనకు మిగిలిన ఆ కాస్త సమయంలోనే చెప్పదలచుకున్నవన్నీ చెప్పాలన్న తహతహతో కాబోలు, అన్న మాట మళ్ళీ అనకుండా చెప్పుకుంటూ వెడుతున్నాడు. ఆనంద్ ఒక్కసారిగా ఘొల్లుమనేసరికి నాన్న కోపంగా అతనివైపు చూసి కనుబొమలు ముడిచి, క్షీణస్వరంతో అన్నాడు...'చూడు నాయనా, మనకు లక్ష్మి ఏనాడూ లేదు, ఉన్నదల్లా ధైర్యలక్ష్మి మాత్రమే. ఆమెను దూరం చేసుకోకు, లేకపోతే బతకడానికి నీకు మరే ఆధారమూ ఉండదు...'

"ఓ వైపున నాన్న అమ్మను చూసి కంటతడి పెడుతూనే, పెద్దగా శోకాలు పెడుతున్న అమ్మపై అంతిమక్షణాలలో కూడా కేకలు వేయబోవడం ఆనంద్ కు జ్ఞాపకమొచ్చింది. భూదేవంత ఓరిమితో ఆయన సంతానాన్ని కని పెంచి, ఆయన కోపతాపాలను గుర్తెరిగి మసలుకుంటూ పల్లెత్తు మాట అనకుండా నలభై ఏళ్ళు కాపురం చేసిందామె. అందుకు కన్నీళ్లతో కృతజ్ఞతలు చెప్పుకున్నాడు కాబోలు. ఆ కృతజ్ఞతను ఆయన మాటల్లో వ్యక్తం చేయాలనుకోలేదు. అనుభూతి చెందడమే కానీ మాటల్లో వాళ్ళు ఏనాడూ ఏదీ వ్యక్తం చేయరు. వాళ్ళ జీవనసరళి అలాంటిది. ఒకరి మీద ఒకరికి ఎంతో అపేక్ష. కానీ దానిని ఏనాడూ ప్రకటించి ఎరుగరు.

"చివరిసారిగా నాన్న రామనామస్మరణ ప్రారంభించారు, తన చుట్టూ ఉన్నవారిని కూడా రామనామం జపించమని సైగ చేశారు. ఆ పెదవుల మీద ధ్వనించే నామస్మరణ ఒక్కొక్క ఆవృత్తి గడిచిన కొద్దీ క్షీణించి...మరింత క్షీణించి...చివరికి ఆ పెదవులపై నిశ్శబ్దస్పందనగా పరిణమించింది. మెల్లగా...ఇంకా మెల్లగా...ఆ కదలిక కూడా ఆగిపోయింది... అయిపోయింది...అంతా అయిపోయింది...

×××

తరాల అంతరం ఉన్న పీవీగారితో 'లోపలి మనిషి' అనువాదకుడిగా ఏదో ఒక స్థాయిలో నేను 'కనెక్ట్' కావడం చాలా ముఖ్యం. లేకపోతే అనువాదం కేవలం అనువాదం కోసమే అన్నట్టు చాలా యాంత్రికంగా మారుతుంది. అదృష్టం కొద్దీ అలా 'కనెక్టు' అయ్యే అవకాశం పైన చెప్పుకున్న ఘట్టాల రూపంలో చాలా

తొందరగానే వచ్చింది. ఉండి ఉండి తర్వాత కూడా వస్తూనే ఉంది. నెహ్రూ అస్తమయంపై ఆనంద్ తలపోత అలాంటి మరో ఘట్టం. 'లోపలి మనిషి'లోని ఆనంద్ లో పీవీని దర్శించగలిగినప్పుడు, నెహ్రూ ప్రభావవర్షంలో ఆయన నిలువునా ఎలా తడిసిపోయారో ఈ ఘట్టం వెల్లడిస్తుంది. ఆయన మరణవార్త ఆయనలో కలిగించిన దుఃఖోద్వేగపు అభివ్యక్తి కూడా గొప్ప ప్రవాహగుణాన్ని తెచ్చుకుని వరద కడుతుంది. ఆ రోజు మధ్యాహ్నం ఆనంద్ ఒక జాయింట్ సెలెక్ట్ కమిటీ సమావేశంలో ఉన్నప్పుడు ఆ దుర్వార్త తెలుస్తుంది. అరచేతుల మధ్య తల ఉంచుకుని ఆనంద్ చాలాసేపు అలాగే కూర్చుండిపోయాడు. ఎన్నో సంవత్సరాల క్రితం తండ్రి మరణించినప్పుడు కూడా కలగనంత దుఃఖం ఇప్పుడతన్ని ముంచెత్తింది. జవాహర్లాల్ లోని ఆకర్షణీయ పార్శ్వాలు ఒకొటొకటిగా అతని కళ్ళముందు కదిలిపోసాగాయి. గుజరాత్ ప్రాంతంలోని హరిపురాలో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సదస్సుకు వెళ్లినప్పటి తన అనుభవాన్ని పీవీ (ఆనంద్ ముఖతా) చెప్పుకుంటూవచ్చారు. అంత జనసందోహాన్ని తను ఎప్పుడూ చూడలేదు. జనసమ్మర్దంలో చిక్కుకుని ముందుకు వెళ్లలేకపోయాడు, వెనక్కి రాలేకపోయాడు. ఊపిరాడక చనిపోతానేమేనని కూడా అనుకున్నాడు. ఆ తోపులాటలో తన ప్రయత్నం లేకుండానే సభాస్థలికి చేరుకున్నాడు. అంతవరకూ కలిగిన అసౌకర్యాన్ని మరచిపోయి అక్కడున్న ఇతర గ్రామీణులల్లానే జాతీయనాయకుల్ని ఒక్కొక్కరినే గుర్తుపట్టడంలో మునిగిపోయాడు... జవహర్లాల్, బోస్, పటేల్, ఆజాద్, పట్టాభిసీతారామయ్య, గఫార్ ఖాన్(అందరికంటే ఎత్తుగా)....ముంచెత్తిన భావావేశంతో ఒక్కొక్కసారి ఆగుతూ, ఒక్కొక్కసారి ఝరీవేగంతో ముందుకు దూకుతూ నిజాయితీ ఉట్టిపడే నెహ్రూ అభిభాషణను మొదటిసారి విన్నాడు. ఆ తర్వాత త్రిపుర ప్లీనరీకి వెళ్లినప్పుడు, పూణేలో ఒక విద్యార్థుల సమావేశానికి వెళ్లినప్పుడు నెహ్రూలోని శీఘ్రకోపాన్ని చూసిన సంగతిని ఎంతో మురిపెంగా ఆనంద్ గుర్తుచేసుకున్నాడు. త్రిపురలో బహిరంగసభలో ఆయన మాట్లాడుతున్నప్పుడు ఒక విమానం పెద్దశబ్దంతో చుట్టూ తిరుగుతూ, శ్రోతల ఏకాగ్రతకు భంగం కలిగించింది. జవహర్లాల్ ఆగ్రహంతో ఊగిపోతూ, ఈ సమీపంలోకి ఏ విమానం రావడానికి వీల్లేదని గట్టిగా కేకపెట్టారు. ఆయన ఆదేశాన్ని పాటించేది ఎవరా అనుకుంటూ ఆనంద్ ఆశ్చర్యపోతుంటే, నిజంగానే ఆ విమానం మళ్ళీ ఆ దరిదాపులకు రాలేదు. పూణే సమావేశంలో నెహ్రూ సభాస్థలికి రాగానే విద్యార్థులు పండిట్ జీ జిందాబాద్ అంటూ నినాదాలు ప్రారంభించేసరికి నెహ్రూవారిపై కోపంతో విరుచుకుపడ్డారు. యుద్ధంతో ధ్వంసమైన ఒక దేశాన్ని అప్పుడప్పుడే చూసివచ్చిన ఆయనలో ఆ జ్ఞాపకాలు ఇంకా పచ్చి పచ్చిగా ఉన్నాయి. బయటి ప్రపంచంలో ఏ జరుగుతోందో పట్టని బాధ్యతారాహిత్యం విద్యార్థుల ప్రవర్తనలో కనిపించడమే ఆయన కోపానికి కారణం.

మృతప్రాయమైన జాతీయోత్పత్తి అంకెల కంటే, జాతి గౌరవానికే ప్రాముఖ్యం ఇచ్చుకున్న ఆ సందర్భంలో నెహ్రూ అంతర్జాతీయంగా దేశం ప్రతిష్ఠను ఇనుమడింపజేయడం గురించి ఆనంద్ తలపోశాడు. ఒక్కమాటలో చెప్పాలంటే అతని భావనలో జవహర్లాల్ ఒక వినూత్నభావప్రపంచానికి రూపకల్పన చేసి అందించాడు! ఒక రంగంలో కాదు, ఆలోచనకీ, ఆచరణకీ సంబంధించిన అనేక రంగాలలో ఆయన దేశానికి మార్గదర్శనం చేశాడు! దేనిని తాకితే దానిని ఉజ్వలింపచేశాడు! అదే సమయంలో, నెహ్రూలేని భారతదేశం భవిష్యత్తు గురించి కలవరపడిన ఆనంద్, గాంధీకి తను వారసుడైనట్టుగా తనకు తగిన వారసుని నెహ్రూ అందించకపోవడాని తప్పు పట్టాడు.

భూసంస్కరణల అమలు నెహ్రూ ఆదేశమే. ఆనంద్ మంత్రిగా, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా భూసంస్కరణలను తలకెత్తుకున్నది కేవలం నెహ్రూ అనుయాయిగానూ, అభిమానిగానే కాదు; నక్సల్బరీ ఉద్యమం విసిరిన సవాలుకు జవాబుగా కూడా! 'లోపలి మనిషి'లో నక్సల్‌బరీ ఉద్యమం గురించిన పరిచయాన్నీ, దాని గురించి ముఖ్యమంత్రికి, ఆనంద్ కు మధ్య జరిగిన చర్చనూ పీవీ ఎంతో విపులంగా, నాటకీయంగా చిత్రించుకుంటూ వెడతారు. ముఖ్యమంత్రి భూసంస్కరణలను వెక్కిరిస్తే ఆనంద్ సమర్థిస్తాడు. నా ఉద్దేశంలో– నక్సల్ బరీ ఉద్యమమూ, దానిని ఎదుర్కోవడానికి మనం ఆచరణలో ఏమైనా చేయగలమా అని, ఆనంద్ ముఖతా పీవీ ప్రశ్నించుకోవడం, భూసంస్కరణల అమలుకు పూనుకోవడమే 752 పేజీల 'లోపలి మనిషి'లో ప్రధాన ఇతివృత్తం. ఆవిధంగా స్వాతంత్రోద్యమ తరాన్ని దాటి పీవీ మా తరం దగ్గరికి వచ్చేశారు, అలా మా తరానికి ఆయనకూ మధ్య ఒక 'మీటింగ్ పాయింట్' ఏర్పడింది.

భూసంస్కరణల అమలు క్రమంలో ఎదురైన ప్రతిఘటన కారణంగా ఆనంద్ ముఖ్యమంత్రిత్వం కోల్పోవడం, ఆ తర్వాత కేంద్రరాజకీయాల్లోకి వెళ్ళడంతో 'లోపలి మనిషి' ముగుస్తుంది. తాను ప్రధానమంత్రి అయ్యేవరకూ సాగిన ఆ ప్రస్థానం మరో కథ. అందులో ఆయన అనుభవాలు ఎలాంటివి, ఆయన చేసిందేమిటి, చేయనిదేమిటి, సాఫల్యాలేమిటి, వైఫల్యాలేమిటన్న విషయంలో మనలో ఎవరి అంచనాలు వారికి ఉండడం సహజమే. 'లోపలి మనిషి' తొలిభాగంలో ఉన్నట్టు ఇలాంటి అన్నింటి వెనుక తనదైన సమన్వయం, సూత్రబద్ధత లాంటివి ఏవైనా ఉంటే వాటిని ఆయన మాత్రమే చెప్పగలరు. నిజానికి 'ది ఇన్‌సైడర్' రెండో భాగాన్ని కూడా ఆయన రాయడం ప్రారంభించి 650 పేజీల వరకు రాసి అసంపూర్ణంగానే వదలివెళ్లారు. అది పూర్తయి ఉంటే పీవీ రాజకీయ, పరిపాలనావ్యక్తిత్వం మరింత స్పష్టంగా సమగ్రంగా మనకు బోధపడి ఉండేది.

ఇప్పుడు పీవీ శతజయంతి వేళ, ఆయన ఈ దేశానికి ఏమిచ్చారని ప్రశ్నించుకుంటే దానికి బహుశా నా ఉద్దేశంలో జవాబు ఇలా ఉంటుంది: అధికారం దేనికి అనే ప్రశ్నవేసుకుని ఎవరికివారు ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరాన్ని ఆయన ప్రస్ఫుటంగా ముందుకు తెచ్చారు. లోతైన ఆలోచనతో, దార్శనికతతో ఆచరణను ఎలా మేళవించాలో చెప్పారు. రాజకీయాలూ, పరిపాలనా కేవలం చేయడమే కాదు; వాటిని అవసరమైనప్పుడల్లా సంస్కరించుకోవలసిన ఆవశ్యకతను బోధించారు.

–రచయిత సీనియర్ పాత్రికేయుడు

గోవిందరాజు చక్రధర్
98498 70250

భాషాసాహిత్య సంస్కృతుల గురించి రంగనాయకమ్మగారితో....



నిర్భీతికీ నిర్మొహమాటానికీ నిలువెత్తు సంతకం రంగనాయకమ్మ గారు. నమ్మిన సిద్ధాంతాలకే అంకితమై ఎనిమిది పదుల వయసులోనూ రచనావ్యాసంగమే జీవితమై తెలుగు పాఠకులను తన రచనల ద్వారా నిరంతరం ప్రభావితం చేస్తున్న రచయిత్రి ఆమె. 1960 దశకంలో రంగనాయకమ్మ కలం నుంచి వెలువడిన 'బలిపీఠం' ,'స్వీట్‌హోమ్' వంటి నవలలూ మార్క్సిస్టు దృక్పథంతో రాసిన 'రామాయణ విషవృక్షం' సంచలనం కలిగించాయి. ఆలోచింప చేశాయి. చర్చలకుదారితీశాయి.

ఇంగ్లీషు మీడియం చదువులకోసం ప్రభుత్వ తాపత్రయమంతా ఓట్ల ఎత్తుగడేనని 'అమ్మనుడి'కిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు రంగనాయకమ్మ గారు. ఉపాధికీ భాషకూ సంబంధమేలేదనీ, సంబంధంఉంటే ఇంగ్లీషు మాట్లాడే దేశాల్లో నిరుద్యోగం ఎందుకు ఉందో ఆలోచించాలన్నారు. – సంపాదకుడు

***చక్రధర్ :** ఒకానొక సామాజిక పరిస్థితుల్లో రాసిన 'రామాయణం' వంటి కావ్యాలను ఇప్పటి కొలమానాలతో చూడవచ్చా?*

రంగనాయకమ్మ: చూడవచ్చా కాదు. చూడాలి. 'బానిసత్వం' గురించి ఇప్పుడెందుకు మాట్లాడుతున్నాం? మానవ సమాజంలో గత కాలం ఎలాంటిదో చూడాలి. 'రామాయణాన్ని' ఇప్పటి విలువలతో విమర్శించడం జరగలేదు. అప్పటి విలువల తోనే. దశరథుడికి 'సత్య వ్రతం' వుండాలి, కథ ప్రకారం. అతడు దాన్ని పాటించ లేదనేది కథ లోనే వుంది. రాముడు 'పితృవాక్య పాలకుడు' అని కథలో చెప్పారు. కానీ, ఆ కొడుకు, ఆ రకంగా నడవక పోవడం కూడా కథ లోనే వుంది. ఇటువంటి వెయ్యి కల్పనలతో వుంటుంది ఆ కథ. వాటిని బైటికి చూపించడం అంటే, ఇప్పటి విలువలతో చెప్పడం కాదు.

***చక్ర:** ప్రతి జాతికీ ఒక సంస్కృతి, సాహిత్య మూలాలు, ఉంటాయి కదా? భారతీయ మూలాలను కాపాడుకోవడం మీకు ఆక్షేపణీయం ఎందుకు కావాలి?*

రంగ: సంస్కృతులూ, సాహిత్యాలూ, అని ఎత్తారంటే, అవి వున్న సమాజాల్ని వర్గ సమాజాలు గానే చూడాలి. చదువూ,రాతా, రాజ్య పాలనా, ఆస్తీ, అన్నీ వచ్చేశాయంటే, అది ఆదిమ సమాజం కాదు. వర్గ భేదాలతో నిండిన దోపిడీ సమాజమే. దోపిడీ సమాజంలో వుండే సంస్కృతి ఎలా వుంటుంది? ఎవరు ఏర్పరుస్తారు దాన్ని? – అది దోపిడీ సమాజం కాబట్టి, అక్కడి సంస్కృతి అంతా, దోపిడీ వర్గానికే, ఆ వర్గ ప్రయోజనాలకే, అనుకూలంగా వుంటుంది. అక్కడ స్త్రీల మీద ఎలాంటి పురుషాధిక్యం వుంటుందంటే, భర్త లేకపోతే, ఆ భార్యని చంపెయ్యాలి. ఆ భార్య, ఆ భర్తకి, స్వర్గంలో కూడా సేవలు చేస్తూ వుండాలి. తమ్ముళ్ళు, అన్నలకు, సేవలు చేస్తూ వుండాలి. స్త్రీని ఏ పర పురుషుడు చూసినా, ఆమెని అగ్ని జ్వాలల్లో నించో బెట్టాలి. సంస్కృతి ఇదే. వర్గ సమాజాల్లో సంస్కృతి అంతా, వర్గ సంస్కృతే. ఈ నాటి సమాజం కూడా వర్గ సమాజమే కాబట్టి, ఈ నాటి సంస్కృతి కూడా వర్గ సంస్కృతే. రెండేళ్ళ ఆడ పిల్ల దొరికితే, అరవై యేళ్ళ పురుషుడు, ఆ చంటి పిల్లని నాశనం చేసి, హత్య కూడా చెయ్యగలడు. ఇది వైరుధ్యాలు గల వర్గ సమాజం కాబట్టి, స్త్రీల వేపు నించి కూడా తప్పుడు సంస్కృతే సాగుతూ వుంటుంది. ఒక నాడు, అత్త పెత్తనం గొప్ప సంస్కృతి అయితే, ఈ నాడు కోడలి పెత్తనం మరింత గొప్ప సంస్కృతి. ఇద్దరూ స్త్రీలే. అయినా, అది అధికారాల్లో తేడా. ఏ వర్గ సంస్కృతి లోనూ, న్యాయాలూ, సంస్కారాలూ, వుండవు. ఒక మాటే చెప్పుకోవాలి. ఏ దేశంలో అయినా, వర్గ సమాజాల సంస్కృతి, వర్గ సంస్కృతే. 'సాహిత్యం' సంగతి తీసుకుంటే, ఆ నాడైనా, ఈ నాడైనా, ప్రతీ సాహిత్యం లోనూ, ప్రతీ కళ లోనూ, దేవుళ్ళనీ, పరిపాలకుల్నీ, కీర్తించడాలే. చిత్ర కళా, శిల్ప కళా, నాట్య కళా, అన్నీ దేవుళ్ళ కోసం, రాజుల కోసమే. ఇదంతా, దోపిడీ వర్గాల సంస్కృతులే. అటువంటి అక్రమపు

సంస్కృతుల్ని కాపాడుకోకూడదు. వాటిని వదిలించు కోవడమే నేర్చుకోవాలి, నేర్పాలి! ఒక్క ఉదాహరణ చూడండి! ఒక భారతీయుల పండగ పేరు 'వినాయక చవితి!' ఈ దేవుడు ప్రతీ ఏటా చచ్చి పోతూనే వుంటాడు. ఆ విగ్రహాలతో, నీళ్ళ మడుగులూ, చెరువులూ, నదులూ, కలుషితం అయిపోతూ వుంటాయి. అంతలో దుర్గా పూజ! అదీ నదుల్లోనే! ఏటా ఏటా ఇదే సంస్కృతి. దీన్ని అలాగే నిలబెట్టాలంటున్నారు మీరు. వర్గాలు లేని సమాజంలో అయితే, నీటిని కలుషితం చేయకూడదనే సంస్కృతి మొదలవుతుంది. కానీ, దోపిడీ సంస్కృతిలో వేల లక్షల జనం, నదుల్లో స్నానాలూ, పూజలూ, స్వర్గంలో పెద్ద వాళ్ళు వున్నారని, వాళ్ళ కోసం అక్కడికి పంపాలని ఎన్నిటినో నదుల్లో కలపడం! – ఇలా చెప్పుకోలేము; చెప్పినవి చాలు.

చక్ర: ***చైనా, రష్యాలకూ సాంస్కృతిక మూలాలు, సాహిత్యం, కళారూపాలు ఉన్నాయి కదా? వాటినీ కాలదన్నుకోమని చెప్పగలమా?***

రంగ: రష్యా, చైనాల సంస్కృతులైనా, దోపిడీ వర్గ సంస్కృతులే. 'అవి తప్పు' అని అక్కడి శ్రామిక వర్గాలకు కూడా తెలీదు. యజమాని వర్గానికి ఆ సంస్కృతి కావాలి. వాటిని కాలదన్నుకోమని చెప్పగలరా? – అన్నారు. ఒక మంచి విషయాన్ని పోగొట్టుకుంటే, అది 'కాలదన్నుకోవడం' అవుతుంది. చెడ్డ దాన్ని వదిలేసినప్పుడు, అది కాలదన్నుకోడం అవదు. చెడ్డదాని విషయంలో "కాలదన్నుకోవడం" మాట వాడకూడదు. చెడ్డదాన్ని తిరస్కరించడమే.

చక్ర: ***ఏ జాతి మనుగడకైనా భాషే ఆలంబన. మాతృభాషలను దెబ్బ తీసి బతుకుల్ని మార్చేసే ప్రయత్నాల వల్ల కలిగే హాని ఏమిటి?***

రంగ: ఒక 'జాతి' అంతా మాతృభాషని పోగొట్టుకోవడం జరగదు. ఆ హానిలో ఎక్కువ – తక్కువలు, ఆ జాతిలో వున్న వ్యక్తులకు జరిగేవే. జాతిలో వ్యక్తులకు, ఆ జాతితో సంబంధాలు సహజంగా నిలిచి వున్నాయా, లేదా – అనే దాన్ని బట్టి, 'మాతృభాష' నిలిచిందా, లేదా – అనేది వుంటుంది. నాలుగేళ్ళ పసి వయసు లోనే మాతృభాషని వదిలేసి, మిగతా జీవితం అంతా పరాయి భాషతో గడిపే పరిస్థితి వుండవచ్చు. అలా గాక, పెద్ద వయసు వరకూ మాతృభాషతో సాగి, పెద్ద వయసులోనే పరాయి భాషని పడితే, దాని వల్ల మాతృ భాష దూరం అవదు. **అసలు 'చదువు' అనేది, మాతృ భాషలో ప్రారంభమై, ఆ భాషతోనే చాలా కాలం సాగకపోతే, అది 'చదువు' అవదు. మాతృభాషతో పాటే, పరాయి భాషల్ని తేలికగా నేర్చుకోవడం అసాధ్యం కాదు. ఆంధ్ర రాష్ట్రాల్లో, ఇంగ్లీషు భాషలోకి పసి పిల్లల్ని దించే ఎత్తుగడ, కేవలం ఓట్ల ఎత్తుగడ! పేద శ్రామిక జనాల అమాయకత్వం, ఇంగ్లీషు చదువు వల్ల తమ పిల్లలు డాక్టర్ల వంటి పెద్ద వుద్యోగులై పోతారనే ఆశలు!**

చక్ర: ***భాషకూ ఉపాధికి అంత గాఢమైన లింకు ఉందా? ఇంగ్లీషు చదువులతోనే ఉపాధి అవకాశాలున్నాయా? ఏ ఉపాధికైనా స్కిల్ ముఖ్యం కదా? దీనిపై మీ అభిప్రాయం?***

రంగ: ఇంగ్లీషు చదువుల తోనే ఉపాధి అవకాశాలున్నాయని భావించే వాళ్ళు, ఇంగ్లీషు మాట్లాడే అమెరికా, బ్రిటనూ, కెనడా, వంటి దేశాల్లో నిరుద్యోగం ఎందుకుందో చెప్పాలి. తెలుగు రాష్ట్రాల్లో గానీ, దేశం లోని ఇతర రాష్ట్రాలలో గానీ మాతృభాషలోనే వ్యవహారాలు నడిపినా కూడా, ఆ భాషలో చదివిన వారికి కూడా నిరుద్యోగ సమస్య వుంది. ఉద్యోగాలుండడానికీ చదువు సాగే భాషకీ సంబంధం లేదు. అలాగే నైపుణ్యాలు వున్న వారిలో కూడా నిరుద్యోగ సమస్య వుంది. ఉద్యోగావకాశాలకీ, ఆర్థిక విధానాలకీ సంబంధం వుంటుంది గానీ, భాషలతోనో నైపుణ్యాలతోనో కాదు. ప్రపంచంలో అనేక భాషలున్నాయి. ఒక్కో దేశానికి ఒక్కో భాష అనుకున్నా, అన్ని దేశాలకీ ఉమ్మడిగా వున్న లక్షణం నిరుద్యోగం అనేది వుండడం. ఆ నిరుద్యోగానికి కారణం పెట్టుబడిదారీ విధానం. పెట్టుబడిదారీ విధానానికి పూర్వం ధనిక–పేద తేడాలూ, శ్రమ దోపిడీ అనేవి వున్నా, ఈ కాలంలో వున్నట్టు ఆ కాలాల్లో నిరుద్యోగం లేదు. ఆ కాలాల్లో బానిసలుగానూ, కౌలు రైతులుగానూ బతికి తీరాలి. ఇది నిరుద్యోగం అవదు. ఇది కేవలం పెట్టుబడిదారీ విధానంలోనే పుట్టుకొచ్చింది. బానిస సమాజంలో ప్రతీ బానిసకీ పని వుంటుంది. భూస్వామ్య సమాజంలో ప్రతీ కౌలు రైతుకీ పని వుంటుంది. పెట్టుబడిదారీ విధానంలో ప్రతీ కార్మికుడికీ పని దొరకదు.

చక్ర: ***ఒక జాతి నిర్మాణంలో, వ్యక్తిత్వ వికాసంలో, సాహిత్యం, కళల ప్రభావం ఏమిటి?***

రంగ: ఏ 'జాతి'లో అయినా, 'సాహిత్యపు' ప్రభావమూ, 'కళల' ప్రభావమూ, ఏమిటి? ఏ జాతిలో అయినా, శత్రు వర్గ భేదాలు వుంటాయి. అలా వున్న సమాజంలో సాహిత్యాలూ, కళలూ అన్నీ, అక్కడ వున్న దోపిడీ వర్గం వాళ్ళు పాటించే విషయాలు గానే వుంటాయి. చిత్ర కళనీ, శిల్ప కళనీ, తీసుకోండి! ఏ చిత్రాలు అయినా, ఏ శిల్పాలు అయినా, ఆ నాటి పరిపాలకులైన చక్రవర్తుల్ని చిత్రించేవిగానే వుంటాయి. అవి కాకపోతే, దేవుళ్ళవీ! సాహిత్యంలో విషయాలన్నీ కూడా రాజుల వీరత్వాల్ని వర్ణించేవే. నిజానికి రాజుల వీరత్వాలేమీ వుండవు. ఆ వీరత్వాలన్నీ సైనికులవే. ఆ సైనికులు శ్రామిక వర్గంలో వాళ్ళే. శ్రామిక వర్గ ప్రజలకు కూడా దేవుళ్ళ నమ్మకాలెన్నో వున్నా, ఆ సాహిత్యం అంతా దోపిడీ వర్గ సృష్టే. ఆ నమ్మకాలు దోపిడీ వర్గానికి వుండవని కాదు. ఒక వేళ శ్రామిక వర్గంలో ఏ ఆలోచనా పరుడైనా, దేవుళ్ళ కథల మీద, తమ తర్కంతో విమర్శలు చేస్తే, వాళ్ళకి పాత కాలంలో ఘోర శిక్షలే. అనేక వేల సంవత్సరాల కాలం సాగింది. ఈ నాటికీ దేవుళ్ళ విషయంలో, హేతుబద్ధమైన దృష్టి లేదు. ఆ దృష్టిని పాత కాలంలో కన్నా గాఢంగా నిలబెట్టటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. 'శివుడు' అనే వాడు దేవుడనీ, పసి పిల్లాణ్ణి నరికేసి ఆ పిల్లాడికి ఏనుగు తలని అతికించాడనే కథని చూపించి, దేవుళ్ళ ద్వారా ఏ మహిమలు అయినా, సైన్సుల వంటివే – అని ఈ నాటి పాలకులు వాదిస్తున్నారు. ఈ నాడు, శ్రామిక జనంలో నాస్తిక భావాలు పెరుగుతున్నాయేమో – అనే భయంతో, ఈ నాటి పాలకులు దేవుళ్ళ గుళ్ళనీ, పాత మూర్ఖపు కథల్నీ, చిన్న పిల్లల పాఠాల్లోకి తీవ్రంగా చొప్పిస్తున్నారు. ఏ జాతిలో అయినా 'శత్రు వర్గాలు' వున్నప్పుడు, అక్కడి సాహిత్యాలూ, కళలూ, శ్రామిక వర్గ జనాన్ని మూర్ఖుల్ని చెయ్యడానికే తప్ప, ఇంకెందుకూ పనికి రావు. మన జాతి కదా, మన సంస్కృతి కదా – అని భావించడం అంటే, ఆ వాదన చేసే వాళ్ళకి, హేతుబద్ధ దృష్టి లేకపోవడమే ప్రధాన కారణం. అందుకే, 'దేవుళ్ళు అబద్ధం' అని తెలుసుకోరు; 'శ్రమ దోపిడీ, పెద్ద మోసం' – అనీ తెలుసుకోరు.

ఈ కాలంలో, ఈ విషయాలు తేలిగ్గా తెలుసు కోవచ్చు. అసలు, ఏ జాతి అయినా, 'మా జాతి, మీ జాతి' అనే తేడాలు కూడా ఈనాడు అవసరం లేదు. 'జాతి' అనేది, 'కులం' లాంటిది కాకపోయినా, మానవులందరూ ఒకటే – అనే భావాలతో బ్రతకడానికి, జాతుల తేడాలు కూడా అక్కర లేదు.

చక్ర: తెలంగాణ ఉద్యమంలో ఆట–పాట అద్భుత పాత్ర పోషించింది. తెలంగాణ కళారూపాల ప్రాచుర్యానికి తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఎంతో కొంత కృషి సాగుతోంది. పక్కనున్న ఆంధ్ర ప్రదేశ్ లో కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాన్ని గానీ, నాజర్ బుర్ర కథ వంటి జానపద కళా రూపాలను గానీ, బతికించుకోవటానికి, ప్రోత్సహించటానికి, ప్రయత్నాలు ఏమీ చేయడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఈ వ్యత్యాసాన్ని ఎలా చూడాలి?

రంగ: ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్ని రకాల పనులు జరగాలో అన్ని రకాల పనులూ జరిగాయి. అందుకే తెలంగాణా మాండలికాల్లో పాటలూ, ధూం ధాంలూ వగైరా కార్యక్రమాలు జరిగాయి. "ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణా ప్రాంతానికి అన్యాయం జరిగింది; వేరే రాష్ట్రం ఏర్పడితే తెలంగాణా ప్రజలకు లాభం!" అనే వాదనను ముందుకు తీసికెళ్ళడానికి ఆ ఆటా–పాటా, వంటా–వార్పూ లాంటివి జరిగాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణా సాహిత్య అకాడెమీ అని ఒకదాన్ని పెట్టారు. సహజంగా పాలక పార్టీకి సన్నిహితంగా వున్న వాళ్ళకే పదవులు దొరికాయి. 'తెలంగాణా లలిత కళా అకాడెమీ' పెట్టాలని ఒక డిమాండు వుంది గానీ, ఇంకా ఏమీ నిర్ణయించినట్టు లేదు. సారక్కా–సమ్మక్కా జాతరలూ, బోనాలూ, బతుకమ్మలూ – వీటి మీద బాగా ఖర్చు పెట్టి తెలంగాణాని ఘన కీర్తిగా చెప్పుకుని, ఓట్లు దండుకుంటున్నారు. తెలంగాణాలో అయినా, ఆంధ్రాలో అయినా, కళా రూపాలనేవి వేటి ప్రత్యేకతలు వాటికి వున్నా, వాటి లోని విషయం పరమ అభివృద్ధి నిరోధకమైనది. ప్రకృతికి సంబంధించి దేవుళ్ళూ, దేవతలూ, మహిమలూ వంటి మానవాతీత శక్తుల ఆరాధనే! ప్రశంసలే! చక్రవర్తుల్నీ, రాజుల్నీ, గొప్ప జెయ్యడాలే. జనాల్ని మూఢత్వంలో వుంచడానికి తప్ప అవి ఎందుకూ పనికిరావు.

తెలంగాణా కొత్తగా ఏర్పడింది కాబట్టి, తెలంగాణా కోసం ఏదేదో చేస్తున్నామని చెప్పుకోవడానికి చేసే హడావుడి అదంతా! ఆంధ్రా అన్నది తెలంగాణాలా కొత్త రాష్ట్రమేమీ కాదు. అక్కడ జరిగేదంతా రాజధాని గురించిన హడావిడే! కూచిపూడి వంటి వాటికి ఆంధ్ర ప్రభుత్వం చేసేది తక్కువనుకున్నా, ప్రైవేటు సంస్థలు చాలానే వున్నాయి, ఆంధ్రాలోనే గాక, చెన్నైలో కూడా! అయినా, సినిమాలూ, టీవీలూ వచ్చాక, జానపద కళా రూపాలకి ప్రాచుర్యం తగ్గినా, ఒక్కోసారి వెరైటీ కోసం సినిమాల్లోనూ, టీవీల్లోనూ, వాటికి చోటు దొరుకుతూనే వుంది.

చక్ర: పుస్తకాలు చదవడం తగ్గిపోయి, స్మార్ట్ ఫోనే సమస్తం అయిపోవడం వల్ల ఈ నాటి యువత ఏం కోల్పోతోంది? వీరు రేపు ఎలా ఉండబోతున్నారు?

రంగ: పుస్తకాలు, సమాజంలో వున్న నిజమైన విషయాల్ని చెప్ప గలిగితేనే, వాటి వల్ల మంచి ప్రయోజనాలు వుంటాయి. అబద్ధాలే చెప్తే, "పుస్తకం" అనేది గొప్పదేమీ అవదు. 'స్మార్ట్ ఫోన్'కి కూడా అదే వర్తిస్తుంది. ఆ ఫోన్ కార్యక్రమాల్లో 'చెడ్డ' లేకపోతే, ఆ ఫోను ఎంతో మంచిదే. అయితే, మంచి–చెడ్డల్ని ఎవరు నిర్ణయిస్తారు – అంటారా? సమాజంలో వున్న మానవ సంబంధాలు 'చెడ్డ'గా వున్నాయి. వీటిని మార్క్సు, 'ఫాల్టీ సోషల్ రెలేషన్స్' (తప్పుడు సామాజిక సంబంధాలు) అన్నాడు. అతడు, ఆ సంబంధాల్ని అర్థం చేసుకున్నాడు కాబట్టి అలా అన్నాడు. పాత కాలం లో, 'బానిసలూ – యజమానులూ' అనే సంబంధాల్ని బట్టబయలుగా చూస్తున్న వాళ్ళు, వాటిని 'తప్పుడు సంబంధాలు' అనుకున్నారా? 'ఇవి ఇంతే, సహజం' అనుకున్నారు. చాలా కాలం బానిసలే అలా అనుకున్నారు. ఇప్పుడు, 'భూస్వాములకూ – కౌలు రైతులకూ' వుండే సంబంధాల్ని చూస్తూ వున్నాం; 'పెట్టుబడిదారులకూ – కార్మికులకూ' వున్న సంబంధాల్ని కూడా కళ్ళ ముందు చూస్తూ వున్నాం. వీటిని, 'తప్పుడు సంబంధాలు' అనుకుంటున్నామా? 'ఇవి ఇంతే, ఇవి సహజం!' అనుకోవడం లేదా?

అయితే, 'పుస్తకాలు' అనే వాటిల్లో కొన్ని, మంచి విషయాల్ని చెప్పేవిగా వుంటే; కొన్ని పుస్తకాలు, చెడ్డ విషయాలనే సమర్థించే వాటిగా వుంటాయి. దీన్ని ఇంకా వివరంగా చర్చించుకోవాలి. అసలు, ఉత్పత్తి సంబంధాల్లో మంచి చెడ్డల గురించి, ఏ విషయాలూ తెలియని పాఠకులు, ఒక మంచి భావాలు గల పుస్తకం చదివి, కొంచెం మంచి వేపు మారవచ్చు. లేదా, చెడ్డ భావాలతో వున్న పుస్తకం చదివి, చెడ్డ వేపు మారవచ్చు. మంచి భావాలు గల పాఠకులే, చెత్త భావాలు గల పుస్తకం చదివి, మంచిని వదిలేసి, చెత్త వేపు మారతారా? చెత్త భావాలు గల పాఠకులు మంచి వేపు మారతారా? – ఇటువంటి ప్రశ్నలు అనేకం వుండవచ్చు గానీ, పుస్తకాల్లో వున్న 'మంచి' అనేది, తర్కం ముందు ఓటమి లేకుండా నిలబడాలి. చెత్త భావాల పుస్తకం, అలా నిలబడలేదు. తర్కం ముందు అది, ప్రతీ పేజీ లోనూ ఓడిపోతుంది. పాఠకులకు పుస్తకాల వల్ల జరిగే ప్రభావాలు, ఆ పుస్తకాల్లో వున్న భావాల్ని బట్టి వుంటాయి. పాఠకులు, ఒక పుస్తకం చదవక ముందు, ఎలా వున్నారో, చదివిన తర్వాత ఎలా వున్నారో, అది చూడాలి. గతం కన్నా 'మంచి' వేపు మారారా; 'చెడ్డ' వేపు మారారా? – ఇవీ, పుస్తకాల వల్ల పాఠకుల భావాల్లో జరిగే మంచి చెడ్డలు. స్మార్ట్ ఫోన్ అయినా, పుస్తకాల్లాంటిదే. ఆ ఫోన్‌లో 'మంచి' వుంటే, మంచినీ; 'చెడ్డ' వుంటే చెడ్డనీ; తీసుకోవచ్చు. కానీ, మంచిని కోరేవాళ్ళు, చెడ్డని తీసుకోరు. అలాగే, 'చెడ్డ'కి అలవాటు పడ్డవాళ్ళు, 'మంచి' వేపు చూడరు. పుస్తకాలు ఇచ్చే రకరకాల ప్రభావాలనే, ఫోన్లు కూడా ఇస్తాయి. కాకపోతే, ఫోను చేసే బోధనలు అతి త్వరగా చేరతాయి. ఫోనులో మంచి విషయాలే వుంటే, అవి పుస్తకాల కన్నా ఎక్కువ శక్తి గలవే అవుతాయి. ఇప్పటి ఫోనులన్నీ పూర్తిగా 'లాభాల' కోసం తయారు చేసి, అమ్మకాలు చేసే వాళ్ళ ద్వారా జరుగుతున్నాయి. ఇదే, ఫోన్ల వల్ల, పుస్తకాల కన్నా ఎక్కువ ప్రమాదం. సమాజంలో వున్న నిజాల్ని తెలుసుకోకపోతే, పుస్తకం అయినా, ఫోన్ అయినా, రెండూ ఒకే రకం ఫలితాల్ని ఇస్తాయి. **'ఈ యువత రేపు ఎలా వుండబోతున్నారు?' – అన్నారు మీరు. వారి సాహిత్యాలూ, ఉద్యమాలూ ఏం కోరుతున్నాయో, అవి, ఏం చెపుతున్నాయో, ఆ భావాల్ని బట్టే, వారు ఎప్పుడూ వుండబోతున్నారు.**

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషాసాహిత్య సంపద 3

(జులై నెల సంచిక తరువాయి)

సకల చరాచర ప్రాణికోటిలో సంపూర్ణ భావవ్యక్తీకరణ భాష ద్వారానే జరుగుతుందనేది జగమెరిగిన సత్యం. మానవుడు మాత్రమే మాట్లాడగలిగే స్వరాకృతి గల వాడన్నది లోకవిదితం. మానవ జీవన పరిణామక్రమంలో ధ్వనులతోనూ, సౌంజ్ఞలతోనూ భావవ్యక్తీకరణ చేశాడనేది కూడా స్తవముకాని వాస్తవం. పశుపక్ష్యాదులతో సంచరించిన ఆదిమానవుడు జంతువుల, పక్షుల అరుపులను ధ్వనులను అనుకరించి ఉంటాడన్నది సత్యదూరం కాదు. ఆటవిక దశలోని మానవుడు తన నిరంతర జీవనయానంలో చేసిన భావ వ్యక్తీకరణకు ధ్వని ప్రధాన సంకేతం. ఆనాటి ధ్వనిరూప పరిణామ క్రమమే భాషకు మూలమనే భాషాశాస్త్రవేత్తల సిద్ధాంతం. విశ్వవ్యాప్తంగా అంగీకరిస్తున్న సత్యంకూడా. ఇక్కడో విషయంకూడా ప్రస్తావించాలి. మోద విషాదుల్లో మానవుడు కూనిరాగాలు, భాషలేని ధ్వనులతో ఆలపించి ఉంటాడన్నది కూడా అంగీకరించవలసిన విషయం. అందువల్ల ప్రాక్తన మానవుడి హావభావాలు ధ్వనులద్వారా ప్రారంభమై, కాలక్రమంలో భాషగా రూపొంది ఉండవచ్చన్నది భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం. అంటే మానవజాతికి ఉన్న అపారమైన శక్తి భాష. భాషలేని మానవసమాజం లేదా భాషను మాట్లాడగల ఇతర జీవరాశికూడా లేదన్నది వాస్తవమే. మానవ ముఖాకృతిలోగాని, స్వరాకృతిలోగాని వివిధ ధ్వనులు చేయగల శక్తి, స్పష్టంగా అనుకరించి అనుసరించగల ముఖయంత్ర నిర్మాణాకృతి సహజసిద్ధంగా ఏర్పడింది. ఐతే మనకు పరిచయం లేని అవగాహనలేని భాషను బాల్యంలో తల్లిదండ్రుల ద్వారా, అనువంశీకుల, సమీపస్థులద్వారా నేర్చుకొని సమాజంలో జీవనయానం కొనసాగిస్తున్నాడనేది మనకు తెలిసిందే. భాషకు మానవ జీవనానికి అవినాభావ సంబంధం ఉంది. భాష వల్లే నిత్యం మానవుడు తన దైనందిన కార్యక్రమాలన్నీ సక్రమంగా సజావుగా సంపూర్ణంగా కొనసాగిస్తాడు. అందువల్ల భాష సంపూర్ణభావ వ్యక్తీరణకు మార్గం. ఒకవ్యక్తికి మరోవ్యక్తికి భాష మాత్రమే అనుసంధానిస్తుంది. ఇక్కడే పశుపక్ష్యాదుల స్వర, ధ్వని సంకేతాలను కూడా రేఖామాత్రంగా స్పృశించాలి. పక్షులు తమ భావవ్యక్తీకరణ కూడా వివిధ ధ్వనుల అరుపుల కూతలద్వారా సంకేతాలు తెలియజేస్తాయి. ఆపదలోనూ ఆనందంలోనూ వాటి ధ్వనిసంకేతాలవల్ల మిగిలిన ఆజాతి పక్షులు గుమిగూడతాయన్నది నిత్యం మనం గమనించేదే. పశువులు కూడా అంతే. ఐతే పశుపక్ష్యాదులు కేవలం ధ్వని సంకేతాలవల్ల తమ భావం వ్యక్తం చేసుకుంటూ తమ ఉనికిని కాపాడుకుంటాయి. మనిషి మాత్రం తన ధ్వనులను మాటల రూపంలో ప్రయోగించి పదాలుగా వాక్యాలుగా ఉపయోగించి జీవనాన్ని కొనసాగిస్తాడు. ఈ ధ్వని సంకేతాలు అక్షరరూపం దాల్చడానికి ఎన్నోవేల యేళ్లు పట్టి ఉండవచ్చు. ప్రపంచంలోని వివిధ భాషల పరిణామ క్రమంలో వర్ణాత్మక వ్యవస్థ (phonological system)వ్యాకరణ వ్యవస్థఖీ Grammatical System అనే ద్వివిధ నిర్మాణ క్రమంలో భాషనిర్మాణం ఉంటుంది. ప్రపంచంలోని భాషలు ప్రస్తుతం 6500 ఉన్నాయి. ఇందులో ఖమీర్ (Khmer) భాషలో 74 అక్షరాలు ఉన్నాయి. ఇది కంబోడియా ప్రాంతానికి చెందిన భాష. అలాగే అతితక్కువ అక్షరాలున్న రొటోకస్ (Rotokas) భాషలో 12 మాత్రమే అక్షరాలున్నాయి. ఇది పాపాన్యూగయయానాలోని బోగన్ విల్లి ప్రాంతంలోని ఒక ద్వీపంలో ఉంది. ఇందులో అనునాసిక అక్షరాలు ఎక్కువ. రోటాకస్ భాష మాట్లాడే ప్రజలు 4320. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాష ఇంగ్లీషు ఐతే అతితక్కువ మాట్లాడే భాష బుసు(Bussu) ఈ బుసు భాష కేవలం 8 మంది మాత్రమే మాట్లాడుతారు. 2005వ సంవత్సరం గణాంకాల ప్రకారం 5గురు మాత్రమే ఉన్నారని అంచనా. బుసు వాసులు మధ్య ఆఫ్రికా ప్రాంతంలోని కామరూన్ అటవీ ప్రాంతంలోని ఒక తెగగా గుర్తించారు.

ప్రారంభదశలో మానవుడు తన మనోభావాలను బొమ్మలరూపంలో చిత్రీకరించాడు. అది ఆనాటి సంకేతాలకు సూచిక. ప్రమాదాలు, క్రూరమృగాలు, విషసర్పాలు మొదలైన వాటి, ప్రమాదాలు ఏర్పడే ప్రదేశాలను బొమ్మలతో గుర్తించి సాటి మానవులకు సూచికగా ఏర్పరచినట్లు తెలుస్తుంది. దాన్నే చిత్ర లిపిగా పేర్కొంటారు. నేటికీ చైనాభాష చిత్రాలతో కూడిన అక్షరాలు ఈ లిపినే సూచిస్తుంది. అనంతరం రెల్లు పక్షుల ఈకలు అడవిపంది ముల్లులాంటి ఈకలు మొదలైన వాటితో అక్షరాలు రాసేవారు. ఘంటం అనబడే ఉక్కు కలాలు ఆరవ శతాబ్ది తర్వాతే మనకు సాక్షాత్కరిస్తాయి. రాయడానికి మసి, మొక్కల నుంచి స్రవించిన జిగురు, రకరకాల మొక్కల ఆకుల నుంచి స్రవించిన జిగురు, రకరకాల మొక్కల ఆకులు, పండ్ల, బెరడు రసాలు సిరాగా మార్చుకుని రాసిన దాఖలాలు ఉన్నాయి. పాత వస్త్రాలను జనుము, గోగులాంటి పట్టలను కాల్చి కాగితం చేసే పద్ధతి క్రీస్తు శకం ఎనిమిదో శతాబ్ది నుంచి ఉపయోగంలోకి వచ్చింది. తాళపత్ర గ్రంధాల ఉనికి ఆవాసం ఆసియాఖండమంతటా విస్తరించింది. చైనాలో క్రీ.శ 2 వ శతాబ్ది కాలానికే కిజిల్ (Kizil) గుహల్లో లభించిన సంస్కృత తాళపత్ర గ్రంధాలు అతి ప్రాచీనమైనవి. సంస్కృతంలోనే శైవమత గ్రంధాలు క్రీ.శ 5వ శతాబ్దికి చెందినవి నేపాల్‌లో లభించిన వాటిని ప్రస్తుతం కేంబ్రిడ్జి గ్రంథాలమంలొ కొన్ని ప్రతులన్నాయి. వాస్తవంలో తాళపత్ర రచనలు ప్రపంచదేశాల్లో ఆసియాలోని ప్రాంతాలయిన ఇండియా, థాయ్‌లాండ్, ఇండొనేసియా, కాంబోడియా, లావోస్ తదితర ప్రాంతాల్లో లభించాయి. ఒక ఆధారాన్ని బట్టి 6 వేల సంవత్సరాల కాలం నాటికే తాళపత్ర గ్రంథాలున్నాయని అంటారు. ఈ రచనలకు సంబంధించిన విరాలు ప్రాచీన సంస్కృత – పాలీ – బౌద్ధమత

గ్రంథాలు సదరన్ మిసిసిపి విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో రూం.నెం. 305లో లభిస్తాయి.

మానవ భాష ప్రారంభమైన వేల వత్సరాల చరిత్ర కాలగర్భంలో కలసి పోయింది. లభించినవి ఆయా ప్రాచీన గ్రంథాలయాలో నిక్షిప్తం అయినా భాషాశాస్త్ర విత్తలయిన వీట్నే, జఫర్సన్ లాంటి వాళ్ళే భాష ప్రారంభమయిన కాలంకాని, భాషా నిర్మిత ప్రాంతం కానీ ఏదీ ఒక నిర్ణీత నిర్ధారణ కాలేదు. లభించిన ఆధారాలమేర భాష, అక్షరాలు, పరిణామక్రమం, రచనావిధానం కొంతవరకు మనకు సహాయపడుతుంది. అదికూడా క్రీస్తుశక ప్రారంభంనాటి వివరాలకన్నా నాలుగైదువందల వత్సరాల తరువాత ఒక ఆధారం కొంతవరకు లభిస్తుంది. ఈ వివరాలు ప్రాథమికంగా తిరుమల రామచంద్ర మన లిపి పుట్టుపూర్వోత్తరాలు, టి. జాన్ రత్నం 'బైబిలు గ్రంథ చరిత్ర, జోసయా రామాంజులు బైబిలు దొరికిన విధములాంటి పుస్తకాలలో కొన్ని ప్రాథమిక ఆధారాలు లభిస్తాయి. అదీ కొంత విహంగావలోకనం మాత్రమే. ఆంగ్లంలో ఎన్నో గ్రంథాలు పుంఖానుపుంఖాలు లభిస్తాయి. ఉదాహరణకు Block Band, GL Trager, leorand Bloomfield, Byron, Thomes Burrow, Naam Chamsky, John Plant, Ethan Pettus మరెన్నో రచయితల గ్రంథాలు లభిస్తాయి. ఏవైనా ఆదిమజాతి జీవన పరిణామక్రమం, ఆనాటి జీవనవిధానం, భాష పరిణామం వికాసం అన్నీ కొంత Anthro Pological Survey మరికొంత ఊహాసిద్ధమైనవిగా (Hypothetical) చెప్పవచ్చు. సంపూర్ణ సాధికారికంగా నిర్ధారించడానికి ఏదీ సరయిన ఆధారాలు లభించవు. దొరికిన వాటిల్లో కొన్నిటిని బేరీజు వేసి ఆ కాల స్థితిని బట్టి ఊహించవీలుంది. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో మరేదయినా ఇదమిత్థమైన ఆధారాలు లభిస్తే అంగీకరించి ఆనందించవచ్చు.

చారిత్రక ఆధారాలను బట్టి– నేటికీ పూర్వ రచనాగ్రంథాలు ఎన్నో రకాలుగా లభిస్తున్నాయి. వాటిల్లో పశువుల చర్మాలపై రాసిన గ్రంథరచనలున్నాయి. వీటిని వెల్లం (vollum) అంటారు. లేత దూడల చర్మాలు, కొన్ని పశువుల చర్మాల లోపలి పొరలను సేకరించి వాటిని శుద్ధిచేసి ఆయా రకాలైన చెట్లు ఆకులు బెరడు పండ్లు జిగురుల కషాయాల్లో నిలువచేసి ఆరబెట్టేవారు. ఇవి క్రీస్తుపూర్వం నాలుగువేల ఏళ్లనాటివని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈజిప్టుదేశ వాసులు వెల్లం అనబడే పశుచర్మంపై రాసిన పుస్తకాలను తయారుచేశారని చారిత్రక ఆధారాలు. హెబ్రీ భాషలో రచించిన ధర్మశాస్త్ర గ్రంథం వెల్లంపైనే రాసినట్లు టాల్ముడ్ (Talmud) అనే యూదుల ప్రామాణిక గ్రంథం తెలియజేస్తుంది. దీనితోపాటు తోరా (Tora) అనబడే మోషే పంచగ్రంథాలుకూడా ఉన్నాయి. ఇవి క్రీస్తుపూర్వం మూడువేల వత్సరాల కాలం నాటివని నిర్ధారణ. బైబిలులోని పాతనిబంధనలో ఎజ్రా క్రీపూ 536 ఎస్తేరు క్రీ.పూ510, కీర్తనలు క్రీ.పూ 1000, ఇర్మియా క్రీపూ 557నాటి రచనలని చరిత్ర విద్వాంసుల కథనం. వీటిని పాలస్తీనానుంచి ఈజిప్టుకు కొనిపోయినట్లు తెలుస్తుంది. ఇందులోని కొన్ని భాగాలు యునైటెడ్ థియోలాజికల్ కళాశాల, 17మిల్లర్స్ రోడ్, బెంగుళూరు గ్రంథాలయంలో కూడా ఉండేవి. 1976లో నేను సందర్శించినప్పుడు ఆనాటి గ్రంథాలయాధికారి శ్రీమతి యమ్మాఅడియన్ప (జర్మన్ స్త్రీ. భారతీయుడిని వివాహమాడింది. ఈమె భర్త అడియప్ప మిలటరీలో ఉన్నతోద్యోగి. ఒకనాటి రాష్ట్రపతి గౌ॥ ఫ్రక్రుద్దీన్ అలీ అహ్మద్ (1905–1977 సహధ్యోయి.) కొన్ని వెల్లం గ్రంథాలు, మరికొన్ని Papyrus చుట్టలు చూపింది. ఇతర వివరాలకు ప్రస్తుతం వెల్లం నమూనా గ్రంథాలు ఫ్లిప్‌కార్ట్, అమేజాన్లో కూడా లభిస్తున్నాయి. నేటికీ వెల్లం అనబడే లేత చర్మపు పొరలను భవనాల నమూనాలు తయారుచేసేవాటికి, భవన నిర్మాణ ప్లానులు, బ్లూ ప్రింట్ల తయారీలోనూ వాడుతున్నారు.

ప్రాచీన రచనలు చేసిన గ్రంథాల్లో ముఖ్యమైనవి పేపరస్ (Papyrus). పేపరస్ జన్మస్థానం ఈజిప్టునైలునది ప్రాంతం. ఆంగ్ల రూపమైన పేపర్ (Paper) పేపరస్(Papyrus)అనే పదం నుంచి వచ్చింది. గ్రీకుభాషా పదమైన పేపరోస్(papyros) నుంచే లాటిన్ భాషా పదమైన పేపరస్ నుంచి ఆంగ్లపదం పేపర్ paper ఏర్పడింది. పేపరస్ నైలునది ఒడ్డున తొలిసారిగా కనుగొన్నారు. ఈజిప్టువాసులు ఈ గడ్డిజాతికి చెందిన మొక్కను ఆహారంగా కూడా వాడతారు. పడవల తయారీలో ఈ మొక్కలగుజ్జును వాడేవారు. ఆఫ్రికా, మడగాస్కర్, పరిసరప్రాంతాల్లో బాగా లభిస్తుంది. నేటికీ ఈజిప్ట్ లో పేపరస్‌తో చేసిన కాగితాలపై చిత్రాలు, కాలెండర్లు, బొమ్మలు అమ్ముతారు. పేపరస్‌తో తయారయిన కాగితపు చుట్టల్లో చారిత్రక గాథలు, దేశచరిత్ర, పద్యకావ్యాలు, కల్పనాగాథలు, రెండవ రామ్‌సెస్స్ నగరంలో చేసిన కుట్రకు సంబంధించిన పుస్తకాలు, వృక్షశాస్త్రం, వైద్యశాస్త్రం మొదలయిన గ్రంథాలు దాదాపు 1800 దొరికినట్లు 1753 లో హెర క్యులేనియంలో దొరికిన రాతప్రతులు చాలవరకు చారిత్రక రచనా పరిణామాన్ని, రచనా పరిణామ క్రమాన్ని శాస్త్రీయ రచనల విశ్లేషణను తెలియజేస్తాయి. పేపరస్ గ్రంథాలు చుట్టలరూపంలో ఉంటాయి. ఇవి కొన్ని నేషనల్ లైబ్రరీ కలకత్తాలోనూ, యునైటెడ్ థియొలాజికల్ కాలేజీ, బెంగుళూరులోనూ చూడవచ్చు. పేపరస్ మోడల్ అలంకరణలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లో కూడా లభిస్తున్నాయి.

ప్రపంచంలోనే తొలిముద్రిత గ్రంథం?

ప్రపంచంలోనే తొలి ముద్రిత గ్రంథం జాన్‌గుటెబ్బర్గ్ (1400–1418) ముద్రించిన బైబిలు ప్రతి అని అంటారు. ఇది 1450లో అచ్చయింది. లాటిన్ భాష ప్రతి చలనాత్మక ముద్రాక్షరాలను(movable types) ప్రవేశపెట్టి ముద్రణలో కొత్త పుంతలు సృష్టించాడు. ముద్రణాకళా పితామహుడుగా వ్యవహరిస్తారు. గుటెబ్బర్గ్ ముద్రించిన బైబిలు ప్రతిని 42 పంక్తుల బైబిల్ అనికూడా అంటారు. (42 lines Bible) ప్రతి పుటలోను 42 పంక్తులున్నందువల్ల 42పంక్తుల బైబిల్ అనే పేరు స్థిరపడింది. జర్మన్ దేశవాసి అయిన జాన్‌గుటెబ్బర్గ్ ముద్రించిన లాటిన్ బైబిల్ ప్రతిని వల్గేట్ (Vulgate) అనికూడా అంటారు. ప్రస్తుత బ్రిటీష్ మ్యూజియంలో న్యూయార్క్ సెంట్రల్ లైబ్రరీలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ – మరో రెండు ప్రతులున్నాయని వార్త. గూటెన్ బర్గ్ ముద్రించిన 1450 నాటి బైబిలు ప్రతిఖరీదు నేడు రెండువందల కోట్ల పైమాటే. బైబిలు ఇతర భాషల్లోకి తొలిగా అనువదించి ముద్రించినవాడు మార్టిన్ లూథర్. జర్మన్ దేశవాసి అయిన మార్టిన్ లూథర్ కొత్త నిబంధన 1522లోనూ – పూర్తి బైబిల్ 1534లోనూ ముద్రించి క్రైస్తవ మతంలో విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టాడు. క్రైస్తవమత పెద్దలనబడే పోప్,

బిషప్‌లు తప్ప ఇతరులు చదవకూడదనే నియమాన్ని ఉల్లంఘించి బైబిలును జర్మన్‌లోకి అనువదించి ప్రజాపరం చేశాడు. అనంతరం ప్రపంచభాషల్లోకి ముద్రణ జరిగింది. నేటికి విశ్వవ్యాప్తంగా అనేక భాషల్లో అధికంగా ముద్రణ జరిగిన గ్రంథం కూడా బైబిలు. ఇంతవరకూ ఒక ముద్రణ కథనం అయితే ప్రపంచంలోనే తొలి ముద్రణ జరిగింది బౌద్ధమత గ్రంథమనే ప్రాచారంలో ఉంది. అదికూడా ఒక ప్రతి మాత్రమే బ్రిటీష్ మ్యూజియంలో ఉంది.

వజ్రసూత్రం పూర్వాపరాలు

ప్రపంచంలో తొలి ముద్రిత ఏకైక గ్రంథం వజ్రసూత్ర.అని అంటారు. వజ్రసూత్ర చైనా భాషలో ఉంది. దీన్ని సంస్కృతీకరించి వజ్రచ్ఛేదిక ప్రజ్ఞా పారమితసూత్ర అని నామకరణం చేశారు. చైనాలోని మొగావో గుహల్లో (mogao caves) లభించింది. ఇది చైనా క్యాలెండర్ ప్రకారం జియాన్ టాంగ్ (xiantory) 9వ సంవత్సరం 13వ తేదీ 4వ పౌర్ణమినాడు అంటే క్రీస్తుశకం మే 11వ తేదీ 868లో అచ్చయిందని అంటారు. ఇది జెన్ బౌద్ధానికి చెందిన గ్రంథం. బుద్ధుడు ప్రతినిత్యం శ్రావస్తికి వెళ్ళే మార్గంలో తనకత్యంత ప్రియ శిష్యుడయిన సుభూతికి బోధించిన జీవిత మార్గాలన్నీ ఉన్నాయి. ప్రధానంగా నాలుగు విషయాలు వజ్రసూత్రలో ఉన్నాయి. 1.స్వయంకృత జ్ఞానమార్గాన్వేషణ. 2. అజ్ఞానంలో కొట్టుమిట్టాడే వారికి జ్ఞానబోధ చేయడం, స్వలాభాపేక్ష లేకుండా జ్ఞానబోధే పరమావధిగా జీవించడం. 3.నేను-నా అనే భవబంధాలన్నీ విసర్జించడం. 4. అతిసామాన్య సాధారణ జీవితాన్ని అవలంబించి అనుసరించడం. ఇది ఐదు మీటర్ల పొడవున్న గ్రంథం. గ్రంథపుచుట్టగా చుట్టి ఉంటుంది. చెక్కపెట్టెలో భద్రం చేయబడి ఉంది. బ్రిటీష్ మ్యూజియంలో ఉన్న వరుస సంఖ్య Or 821/P2 లో వజ్రసూత్ర ఉంది. విశ్వవ్యాప్తంగా తొలి ముద్రిత గ్రంథమనే పేర్కొంటున్నా ముద్రణ జరిగిన ప్రదేశంకాని, ముద్రించిన వ్యక్తి పేరుగాని ఏమీ లేవు. కాని ప్రపంచ వ్యాప్తంగా తొలి ముద్రిత గ్రంథంగానే వజ్రసూత్రకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. పరిశోధనకు మంచి అంశంగా స్వీకరించవచ్చు.

భారతదేశంలో తొలి ముద్రణ

భారతదేశంలో తొలి ముద్రణ చేసింది పాశ్చాత్యులే. అదీ దక్షిణ భారతదేశంలోనే. జాన్ డివోబుస్తామంటి అనే స్పెయిన్ దేశీయుడు గోవాలో తొలి ముద్రాక్షరశాలను 1556లో నెలకొల్పాడు. ముద్రణ ప్రారంభించిన సంవత్సరానికి అంటే 1557 నాటికి దౌత్రీనాక్రిస్టా అనే గ్రంథం ముద్రించాడు. జెస్యూట్ ఫాదర్ గా అభిషేకం పొందిన బుస్తామంటె గోవాలో పోర్చుగీస్ కాలనీ ఏర్పాటు చేశాడు. అప్పటికే గోవాలో ఉన్న జెసూట్ ఫాదర్‌కు ముద్రణ అవసరాన్ని గుర్తించి గవర్నర్ జనరల్‌కు విన్నవించారు. ముద్రణలో కొంత అనుభవం ఉన్న బుస్తామంటే భారతదేశంలో గ్రంథ ముద్రణకు సంకల్పించాడు. అదీ తనకు తన పరివారానికి అవసరమైన పోర్చుగీసు కాలని ఏర్పాటు చేసుకుని ముద్రణకు శ్రీకారం చుట్టాడు. 1556-60 మధ్యకాలంలో నాలుగు పుస్తకాలు ముద్రించాడు. అనంతరం భారతీయ భాషల్లోనే గ్రంథముద్రణ జరిగింది. తొలి ముద్రిత తమిళ గ్రంథం తంపీరన్ వణక్కం అనే 16 పుటల గ్రంథం లిస్బన్‌లో 1554లో ముద్రణ జరిగింది. తొలి నాళ్లలో భారతీయ భాషల్లో జరిగిన ముద్రణలు దాదాపు ఇతరదేశాల్లోనే జరిగాయి. 16వ శతాబ్దం చివరిపాదం 17వ శతాబ్ది తొలి పాతం వరకు భారతదేశంలో ముద్రణా వికాసం బాగా జరిగినట్లు తెలుస్తుంది. ముద్రణా వికాసం అనంతరమే పాఠశాలలు, వైద్యాలయాలు ప్రారంభించారు. గోవాలోనే జెస్యూట్ ఫాదర్లు పాఠశాలను 1556లో ప్రారంభించి విద్యావ్యాప్తికి తోడ్పడ్డారు. పాఠశాలల్లో బోధించడానికి చదువుకోవడానికి కావలసిన ముద్రణ కోసం ప్రారంభంలో అచ్చుయంత్రాలు కావలసి వచ్చాయి. ●

11వ పుట నుండి...

జాతీయ విద్యావిధానం-2020.......

అందించాలని ప్రభుత్వ వైఖరి. ఈ పాఠ్య పుస్తకాల ముద్రణ, పంపిణీలు మళ్ళీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉంటాయి. రెండు భాషల ఎంపిక విద్యార్థికి అనుగుణంగా కాక రాష్ట్ర ప్రభుత్వ ఎంపికగా మారి, హిందీ-ఇంగ్లిష్, హిందీ-ఇంటి భాష, ఇంగ్లిష్-ఇంటి భాష జంటలలో విద్యార్థికి చేరే పుస్తకం పై ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రభావం కచ్చితంగా ఉంటుంది.

ఇందులో తెలుగు భాషకు జరిగే ఒకే ఒక్క మేలు తెలుగు భాష ప్రాచీన భాషలలో ఒకటిగా గుర్తింపు పొందడం వలన జరిగినదే. లేదంటే తెలుగు వెనక్కు నెట్టబడేది.

తెలుగు భాషా సాహిత్యంలో ఉన్న విషయాలపై సరైన గ్రంథాలు మనకు అందుబాటులో లేవు. హిందీలో యుద్ధ ప్రాతిపదికన గత డెబ్బై ఏళ్ళుగా రకరకాల పుస్తకాలను కేంద్రం పూనుకొని ప్రచురించింది. మన పాలకుల అలసత్వం వలన తెలుగులో నిజానికి ఉన్న సాహిత్య సంపద బయటకు రాలేదు. ఇప్పుడు అమలు స్థాయికి వచ్చేసరికి పై అభ్యాసాలలో విద్యార్థులకు ఏ ఒక్క భాష అవగాహన అంశాల పుస్తకాలు రావాలోనన్న నిర్ణయం ఇప్పటికే ప్రచురిత గ్రంథాలు ఉన్న భాష వైపుకు మరలుతుంది. చేజేతులా తెలుగువారు వారికున్న అవకాశాన్ని జారవిడుచుకుంటారు. ఇలా తెలుగుకు జరిగే పెనుప్రమాదం తగ్గాలంటే తెలుగు సాహిత్యం గురించిన ప్రవేశస్థాయి గ్రంథాలు అన్ని భాషల్లో వెలువడాలి. అందుకు తెలుగువారు ప్రతి ఒక్కరు నడుం బిగించాలి. ప్రభుత్వ ప్రమేయంతో సంబంధం లేకుండా తెలుగు భాషకు సంబంధించిన విషయాలను తెలుపుతూ వివిధ భారతీయ భాషల్లో వ్యాసాలు వెలువరించాలి.

తెలుగులో పంచమహాకావ్యాలు ఏవి అని అడిగితే నీళ్ళు నమిలే తెలుగు పంతుళ్ళు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో, తెలుగులో ఎన్ని అక్షరాలు అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేని తెలుగు విద్యార్థులు ఉన్న ప్రస్తుత సమాజంలో ఏ నిర్ణయమైనా తెలుగు మహావృక్షానికి గొడ్డలిపెట్టులా తయారవుతున్నట్టు అనిపిస్తుంది.

ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం

పీవీ
శతజయంతి ప్రత్యేకం

డా. గంధం సుబ్బారావు
7901093537

విద్యారంగంలో తెలుగుకు పట్టంకట్టిన పీవీ



విద్యాశాఖ మంత్రిగా పగ్గాలు చేపట్టగానే పీవీలోని మాతృభాషా మమకారం నిద్రలేచింది. వెంటనే తెలుగు భాషా సముద్ధరణకై రాష్ట్ర విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆయన పట్టుదల, కార్యదీక్ష, దూరదృష్టి, విజ్ఞతల వల్ల రాష్ట్రంలో అనేక విద్యా సంస్కరణలు విజయవంతంగా అమలయ్యాయి.

స్థితప్రజ్ఞుడు, అభినవ చాణక్యుడు, సాహితీవేత్త, మూర్తీభవించిన తెలుగుతనంగా భాసించిన పీవీ నరసింహారావు గారి స్వస్థలం పూర్వ కరీంనగర్ జిల్లాలోని వంగర గ్రామం. ఆయన జన్మించింది 1921 జూన్ 28వ తేదిన. నిజాం ప్రభుత్వంలో ఆ రోజుల్లో పాఠశాలల్లో చదువంతా ఉర్దూ మాధ్యమంలో ఉండేది. తెలుగుకు ఎక్కడా స్థానంలేదు. ఆ విధంగా పీవీ గారి చదువు కూడా ఉర్దూ మీడియంలోనే కొనసాగింది. పాఠ్య ప్రణాళికలో ఉర్దూతో పాటు పర్షియన్ భాష కూడా ఉండేదట. పర్షియన్ బోధించడానికి అధ్యాపకుడొకరు ఉత్తరదేశీయుడు ఉండేవాడట. దక్షిణ భారతీయులకు పర్షియన్ భాష అలవడదు అనే అభిప్రాయం ఆయనకు గాఢంగా ఉండేదట. అయితే పర్షియన్ భాషలో పీవీ గారి ప్రావీణ్యం చూసి అబ్బురపడి, మీరు ఉత్తర దేశం నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారా అని ఈయనను అడిగారట. లేదు – నేను ఇక్కడి వాడినే అని ఈయన బదులిస్తే, ఆ అధ్యాపకుడు సంతృప్తి చెందక నీ పూర్వీకులెవరో ఉత్తర హిందూస్తాన్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడి వుంటారు. అందుకే పర్షియన్ భాష నీకింత బాగా వస్తున్నదని అన్నారట. పీవీ గారి చదువు పరభాషల్లో ఆ విధంగా సాగింది.

అయితే ఈయనకు మాతృభాషా పరిజ్ఞానం ఇంట్లోనే లభించింది. ఇంట్లో అంతా తెలుగే మాట్లాడేవారు. "మాకన్నా ముందుతరం వరకు భాగవతంలోని అనేక పద్యాలు జనుల నాలుకపై నాట్యం చేస్తుండేవి. మా అమ్మగారికి రుక్మిణీ కల్యాణం పూర్తిగా కంఠోపాఠం. ఆమె పెద్దగా చదువుకున్నది కాదు. ఆ మాటకొస్తే, ఇంతకన్నా వేరే ఏం చదువు కావాలి? మా నాన్న గారికి భాగవతంలో వరుసగా దాదాపు రెండువేల పద్యాల దాకా కంఠోపాఠమే. వారు రాత్రిళ్ళు భోజనాల తరువాత చిన్నపిల్లలమైన మమ్మల్ని మీద పడుకోబెట్టుకొని ఆ పద్యాలన్నీ చదువుతూ వుంటే, వినుకలితో మాకు చాలా పద్యాలు కంఠస్తమయ్యేవి. ఇది ఏ ఒక్క ఇంటి విషయమో కాదు. దేశమంతా ఇంతే. ఇంటింటికీ భాగవతం ప్రవహించేది. ఇంతమంది మనస్సులను తీర్చిదిద్దింది భాగవతం" అని పీవీ గారు 14.03.1982న ఓరుగల్లులో జరిగిన పోతన పంచశతి ఉత్సవాల సందర్భంగా జరిగిన సాహితీగోష్ఠిలో చెప్పారు.

పీవీ నరసింహారావు గారు రాజకీయాలలోకి ప్రవేశించిన తరువాత 1957లో మొదటిసారిగా మంథని నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసన సభ్యులుగా ఎన్నికైనారు. 1962లో నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో మొదటిసారిగా మంత్రి అయ్యారు. తొలిసారి మంత్రిగా నరసింహారావు గారు సమాచార పౌరసంబంధాలు, న్యాయ శాఖ, జైళ్ళ శాఖను నిర్వహించారు. 1964లో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి అయ్యారు. 1967లో కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1968లో ఆయనకు విద్యాశాఖ లభించింది.

విద్యాశాఖ మంత్రిగా పగ్గాలు చేపట్టగానే పీవీలోని మాతృభాషా మమకారం నిద్రలేచింది. వెంటనే తెలుగు భాషా సముద్ధరణకై రాష్ట్ర విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆయన పట్టుదల, కార్యదీక్ష, దూరదృష్టి, విజ్ఞతల వల్ల రాష్ట్రంలో అనేక విద్యా సంస్కరణలు విజయవంతంగా అమలయ్యాయి.

11. 1 విధానం రద్దు – 10 . 2 విధానం అమలు:

1969కి ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాలల్లో 11+1 విధానం అమలులో వుండేది. 11వ తరగతిని ఆంధ్ర ప్రాంతంలో ఎస్.ఎస్.ఎల్.సి (సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్) అని, తెలంగాణ ప్రాంతంలో హెచ్.ఎస్.సి (హయ్యర్ సెకండరీ సర్టిఫికెట్) అని వ్యవహరించేవారు. ఆ తరువాత రెండు ప్రాంతాలలో పి.యు.సి (ప్రీ-యూనివర్సిటీ కోర్స్) ఒక సంవత్సరం వుండేది. ఈ హెచ్.ఎస్.సి, ఎస్.ఎస్.ఎల్.సి పరీక్షల్లో చాలా తేడా వుండేది. తెలంగాణాలో హెచ్.ఎస్.సి పరీక్షకు తెలుగు (ఫస్ట్ లాంగ్వేజ్), హిందీ (సెకండ్ లాంగ్వేజ్), ఇంగ్లీష్ (కంపల్సరీ లాంగ్వేజ్) వుండేవి. ఈ మూడు భాషలతో పాటు విజ్ఞాన శాస్త్రం (సైన్స్), గణితం (జనరల్ మాథ్స్), చరిత్ర, భూగోళ శాస్త్రం (Geography) సబ్జెక్టులు వుండేవి. వీటితో పాటు ఒక ఐచ్ఛిక (Optional) సబ్జెక్టును తీసుకోవాలి. ఇందులో గణితం, ఇంగ్లండ్ దేశచరిత్ర, డొమెస్టిక్ సైన్స్ వుండేవి. గణితంలో బీజగణితం (Algebra), రేఖాగణితం (Geometry), త్రికోణమితి (Trigonometry) మొదలైన అంశాలు వుండేవి. పై చదువులలో

వైద్యం, ఇంజనీరింగ్, సైన్స్ కు సంబంధించిన కోర్సులు చదవాలనుకునే వారు ఈ గణితం సబ్జెక్టును ఐచ్ఛికంగా తీసుకునేవారు. సైన్స్, లెక్కలతో సంబంధంలేని ఇతర హ్యూమానిటీస్ కోర్సులు చదవాలనుకునేవారు ఇంగ్లాండ్ దేశచరిత్రను తీసుకునేవారు. డొమెస్టిక్ సైన్స్ అనేది గృహ నిర్వహణకు సంబంధించిన సబ్జెక్టు. ఇది కేవలం ఆడపిల్లలకు మాత్రమే పరిమితమైన సబ్జెక్టు.

హెచ్.ఎస్.సి పరీక్షలో 'లాంగ్వేజెస్' కాక మిగిలిన అన్ని సబ్జెక్టులకు 9, 10, 11 తరగతులలో మూడు సంవత్సరాలు చదివిన అన్ని అంశాలతో కలిపి ప్రశ్నపత్రాలను రూపొందించేవారు. అంటే మూడు సంవత్సరాలకు కలిపి హెచ్.ఎస్.సి లో పరీక్ష వుంటుంది. అయితే 9, 10 తరగతులలో ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం వార్షిక పరీక్ష మామూలే. లాంగ్వేజెస్ కు మాత్రం ఒక్క 11వ తరగతి సిలబస్‌లోనే పరీక్షలుండేవి. ప్రథమ భాషను తెలుగు మాతృ భాష కాకుండా ఉర్దూ, కన్నడ, మరాఠీ మాతృభాషలుగా గల విద్యార్థులు తమ తమ మాతృభాషలను ప్రథమ భాషగా ఎంచుకునే అవకాశం వుండేది. అయితే ఈ సౌకర్యం ఎంపిక చేసిన కొన్ని పాఠశాలలకే పరిమితం. ఆ రోజుల్లో ఈ పరీక్ష పాస్ కావడం బాగా కష్టమైన విషయం. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పదుల సంఖ్యలోనే వుండేది. ద్వితీయ శ్రేణి ఉత్తీర్ణత కూడా వందను మించేది కాదు. తృతీయ శ్రేణిలో పాస్ అయితే చాలనుకునేవారు.

హెచ్.ఎస్.సి పాస్ సర్టిఫికెట్ ను హయ్యర్ సెకండరీ బోర్డు వారు తమ అధికార ముద్ర (సీల్)తో జారీ చేసేవారు. సర్టిఫికెట్స్ మీద హైదరాబాద్ స్థానంలో – "హైదరాబాద్ దక్కన్" అని వుండేది. సర్టిఫికెట్ మంచి దళసరి కాగితం మీద ఇప్పుడు మన దినపత్రికలతో వచ్చే లోకల్ పేపర్ (టాబ్లాయిడ్) సైజులో వుండేది.

ఆ రోజులలో తెలంగాణాలో పెద్ద ఇండ్లకు సింహద్వారానికి ముందు వసారాలో ఇరువైపులా పెద్ద అరుగులుండేవి. ఆ అరుగుల క్రింద గాదెలుండేవి. ఆ గాదెల్లో ధాన్యం పోయడానికి ఒక బస్తామూతి పట్టే చిన్న తలుపులుగల కంత అరుగుల గోడకు వుండేది. అందులోనుంచి ధాన్యం పోస్తే క్రింద ఒక పెద్ద గది అంత ధాన్యపు కొట్టులోకి అవి పడేవి. ధాన్యం తీసుకోడానికి ఇంటిలోపలికి వెళ్ళి, కొద్దిగా మెట్లు దిగి ధాన్యపు కొట్టు తలుపులు తెరిచి, సంచులలో నింపుకుని తెచ్చుకునేవారు. ఆ అరుగుల మధ్య సింహద్వారానికి పైన ఈ హెచ్.ఎస్.సి సర్టిఫికెట్ ను ఫ్రేమ్ కట్టించుకుని పెట్టుకునేవారు. ఆ రోజుల్లో, అంటే 1970కి 5–10 సంవత్సరాల ముందు హెచ్.ఎస్.సి సర్టిఫికెట్ కు అంతటి విలువ వుండేది.

ఆంధ్ర ప్రాంతంలో 11వ తరగతి పరీక్షలను ఎస్.ఎస్.ఎల్.సి అనేవారు. అక్కడి సిలబస్ వేరుగా వుండేది. వీరికి పరీక్షలు 11వ తరగతి ఒక సంవత్సరానికి మాత్రమే వుండేవి. వీరికి 7వ తరగతి నుంచి 11వ తరగతి వరకు మార్కులను ఒక పుస్తకంలో నమోదు చేసేవారు. ఆ పుస్తకం ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్ లో సగం – అదే విధంగా కాన్వాస్ బైండ్ తో వుండేది. అందులో విద్యార్థి పుట్టిన తేది మొదలు అన్ని వివరాలు నమోదు చేసేవారు. దానిని 'ఎస్.ఎస్.ఎల్.సి బుక్' అనేవారు. అక్కడి విద్యార్థులకు చరిత్ర, భూగోళ శాస్త్రం అని కాక సోషల్ స్టడీస్ అనే సబ్జెక్టు వుండేది. ఆంధ్ర – తెలంగాణ కలిసి ఆంధ్రప్రదేశ్ గా ఏర్పడ్డ పది సంవత్సరాల తరువాత కూడా ఈ విధంగా ఒకే రాష్ట్రంలో రెండు రకాల విద్యా విధానాలు అమలులో వుండేవి.

పీవీ నరసింహారావు గారు విద్యాశాఖ మంత్రి అయిన పిమ్మట ఈ విధానాన్ని రద్దు చేసి 1970 నుంచి రాష్ట్రమంతటికీ ఒకే విద్యా విధానం 10+2 పద్ధతిని ప్రవేశపెట్టారు. 11వ తరగతి తరువాత వుండే పి.యు.సి రద్దయింది. పదవ తరగతికి ఎస్.ఎస్.సి పరీక్ష ; ఆ తరువాత రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ విద్యావిధానం అమలులోకి వచ్చింది. ఇంటర్మీడియట్ బోధించడానికి జూనియర్ కళాశాలల అవసరం ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలలను ప్రారంభించారు. ఇందుమూలంగా వేలాది మందికి అధ్యాపక వృత్తిలో ఉద్యోగాలు లభించాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన తెలుగులోనే వుండాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేటు కాలేజీలు వ్యాపార దృక్పథంతో పనిచేస్తున్నందున వాటిని రద్దు చేశారు (వినయ్ సీతాపతి, 'నరసింహుడు', పుట–41).

డిటెన్షన్ రద్దు:

పీవీ గారికి చదువుల పట్ల ఎనలేని మమకారం. ఏ మాత్రం తీరిక చిక్కినా ఏదో ఒక పుస్తకం చదవడం ఆయనకు అలవాటు. విమాన ప్రయాణంలో లభించే 2–3 గంటల వ్యవధిలోనే ఒక మంచి పుస్తకం చదివేసేవారు. చదువు అనేది విజ్ఞానం సముపార్జించడానికి అక్కరకు రావాలని బలంగా విశ్వసించేవారు. అందుకే అన్ని విషయాలకు సమప్రాధాన్యం ఇచ్చేవారు. తన విషయంలోనే కాదు – అందరి విషయంలోనూ ఇలాగే వుండేవారు. అందుకే విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక పాఠశాల విద్యలో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పదవ తరగతికి కామన్ పరీక్షలను ప్రవేశపెట్టారు. తద్వారా పరీక్షలో సామూహికంగా జరిగే "కాపీ" పద్ధతిని అరికట్టేందుకు కృషి చేశారు. పై తరగతులకు వెళ్ళకుండా అడ్డుకునే డిటెన్షన్ విధానం విద్యార్థుల అభ్యున్నతికి గొడ్డలిపెట్టుగా అభివర్ణించేవారాయన. మార్కులు ముఖ్యం కాదని, తెలివి కోసమే విద్య నేర్చుకోవాలని ఆయన అనేవారు. ప్రైవేటు యాజమాన్యాల ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలు వ్యాపార సంస్థలు కాకూడదని, ధనార్జనే ధ్యేయంగా విద్యా సంస్థలు నడపకూడదని ఆయన వక్కాణించేవారు.

తెలుగు అకాడమీ స్థాపన:

రాష్ట్ర విద్యా రంగంలో తెలుగుకు ప్రాధాన్యత లేకపోవడం పీవీ గారిని తీవ్రంగా కలచివేసింది. పి.యు.సి నుంచి అంతా ఆంగ్ల మాధ్యమంలోనే చదవాలి. ఇది గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు చాలా కష్టంగా వుండేది. నిజాం ప్రభుత్వంలో ఉర్దూ మీడియంలో విధిలేక చదివిన వారు భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలుగు అందలమెక్కుతుందని ఆశించారు. వారి ఆశలు అడియాసలే అయినాయి. ప్రభుత్వ కార్యాలయాలలో ఉర్దూ స్థానాన్ని ఇంగ్లీష్ ఆక్రమించుకోవడం పీవీ గారు జీర్ణించుకోలేకపోయారు. ఆనాడు డా. సి. నారాయణరెడ్డి వంటి చాలా మంది తెలంగాణ విద్యావేత్తలు కూడా అలాగే వ్యథ చెందారు. పీవీ గారికి పీజీ వరకు తెలుగు మీడియం తీసుకురావాలని పట్టుదలగా వుండేది. **తనకిష్టమైన విద్యా శాఖ దక్కడంతో ఆయన విద్యా రంగంలో పలు కీలక**

సంస్కరణలు చేపట్టారు. అందులో అత్యంత కీలకమైనది 'తెలుగు అకాడమీ' స్థాపన. మొదట డిగ్రీ వరకు తెలుగును బోధనాభాషగా ప్రవేశపెట్టాలని భావించారు. ఇతర రాష్ట్రాలలో ఆయా భాషల అభివృద్ధికి జరుగుతున్న కృషిని అధ్యయనం చేశారు. అదే సందర్భంలో కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలు, ప్రాంతీయ భాషల అభివృద్ధికి, వాటి ఆధునీకరణకు ప్రతి రాష్ట్రానికి కోటి రూపాయల గ్రాంటును మంజూరు చేసింది. దీనితో ఆంధ్రప్రదేశ్ లో తెలుగు భాషాభివృద్ధికి, సుసంపన్నతకు **1968 ఆగష్టు 6వ తేదీన తెలుగు అకాడమీని హైదరాబాద్ హిమాయత్ నగర్ లో స్థాపించారు. ఈ విషయంలో సుప్రసిద్ధ భాషాశాస్త్రజ్ఞులు డా. భద్రిరాజు కృష్ణమూర్తి గారి సహకారం తీసుకున్నారు. దీనికి పి.వి. గారే చైర్మన్ గా ఆరేళ్ళ పాటు స్వయంగా సారథ్యం వహించారు.**

తెలుగు అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా డా. పి.యస్.ఆర్. అప్పారావు గారిని నియమించారు. ఈయన సుప్రసిద్ధ సాహితీవేత్త, పరిపాలనాదక్షులు. మొదటి, రెండవ ప్రపంచ తెలుగు మహాసభలకు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, మహాసభలు జయప్రదంగా జరగడానికి కృషి చేశారు. అంతర్జాతీయ తెలుగు సంస్థకు వ్యవస్థాపక డైరెక్టర్ గా పనిచేసి, ఆ సంస్థకు గట్టి పునాదులు వేశారు. తెలుగు అకాడమీలో డా. కొత్తపల్లి వీరభద్రరావు, డా. బూదరాజు రాధాకృష్ణ, డా. ముకురాల రామారెడ్డి, డా. ముదిగొండ వీరభద్రశాస్త్రి, డా. అక్కిరాజు రామాపతిరావు, డా. పోరంకి దక్షిణామూర్తి మొదలైన తెలుగు భాషా సాహిత్యాలలో దిగ్గజాల వంటి వారిని నియమించారు. కళాశాలల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ పనిచేస్తున్న ఎందరో తెలుగు భాషా పండితులను, నిష్ణాతులను డెప్యుటేషన్ పై తీసుకుని తెలుగులో పాఠ్య గ్రంథాలను యుద్ధ ప్రాతిపదికన తయారు చేయడానికి ఏర్పాట్లు చేశారు. వీరంతా పీవీ గారు ఇచ్చిన ప్రోత్సాహంతో ఉత్సాహంగా రాత్రింబవళ్ళు, ఆ పనితప్ప వేరే ధ్యాస లేకుండా పనిచేసి, అనుకున్న సమయానికి డిగ్రీ స్థాయి వరకు అన్ని సబ్జెక్టులలో పాఠ్య గ్రంథాలను సిద్ధం చేశారు. పీవీ గారు ఆ తరువాత ఎన్నో సందర్భాలలో డా. పి.యస్.ఆర్ అప్పారావుగారి టీమ్ అద్భుతంగా పనిచేసి అనుకున్న సమయానికి అన్ని కోర్సులకు పుస్తకాలను రూపొందించి, నా లక్ష్యాన్ని నెరవేర్చిందని మెచ్చుకున్నారు.

తెలుగు అకాడమీ తెలుగులో ఇంటర్మీడియట్ స్థాయి నుంచి స్నాతకోత్తర స్థాయి వరకు పాఠ్యగ్రంథాల రూపకల్పనతో పాటు సంప్రదింపు గ్రంథాలు, శాస్త్ర నిఘంటువులు, పారిభాషిక పదకోశాలు ప్రచురించే కార్యక్రమాన్ని కూడా చేపట్టి జయప్రదంగా నిర్వహిస్తున్నది. ఈ విధంగా ఉన్నత స్థాయిలో బోధనా భాషగా తెలుగును స్థిరపరచడానికి అవిరళంగా కృషి చేస్తూనే, తెలుగు అకాడమీ శాస్త్ర నిఘంటువులను, జనరంజక గ్రంథాలను, మోనోగ్రాఫులను, అనువాద గ్రంథాలను, వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన గ్రంథాలను కూడా ప్రచురిస్తున్నది. దీనితో పాటు అధికార భాషగా తెలుగును అమలు చేసే కార్యక్రమంలో భాగంగా తెలుగు మాతృభాష కాని ఐఏఎస్, ఐపిఎస్ వంటి ఉన్నతాధికారులకు తెలుగు చదవడం, వ్రాయడం, మాట్లాడటం నేర్పే కోర్సులను కూడా నిర్వహిస్తున్నది.

ఆనాడు పీవీ గారు ఆ విధంగా నెలకొల్పిన తెలుగు అకాడమీ తెలుగు మాధ్యమంలో చదువుకున్న గ్రామీణ విద్యార్థులకు వరప్రదాయినిగా మారి, వారు పీజీ స్థాయి వరకు విద్యనభ్యసించే అవకాశం లభించింది.

తెలుగు కళాశాల:

ఇంటర్మీడియట్ స్థాయి నుంచి రాష్ట్రంలో అన్ని కళాశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టినా, కొన్ని కళాశాలల్లో, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కళాశాలల అధ్యాపకులు దశాబ్దాల తరబడి ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి అలవాటు పడి, తెలుగులో చెప్పడానికి ఇబ్బంది పడేవారు. అందుచేత వారు తెలుగు మీడియంలో చేరుతామన్న విద్యార్థులను నిరుత్సాహపరచి, ఇంగ్లీష్ మీడియంలో చేరమని ప్రోత్సహించేవారు. విద్యార్థులు అధ్యాపకుల మొహమాటానికి పోయి ఇంగ్లీష్ మీడియంలో చేరి, అక్కడ చెప్పేది అర్థం కాక అవస్థ పడుతుండేవారు. ఈ సమస్యను అధిగమించడానికి, హైదరాబాద్ విద్యానగర్ లో 'వివేకానంద తెలుగు కళాశాల' ను స్థాపించి, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయి విద్యార్థులకు తెలుగులో మాత్రమే విద్యాబోధన చేసే ఏర్పాటు చేశారు పీవీ గారు.

తెలుగు ఉపాధ్యాయులు:

పీవీ నిరంతరం తెలుగు భాష కోసం ఏదైనా మంచి పని చేయాలని తీవ్రంగా తపించేవారు. గొప్ప గొప్ప పదవులు చేపట్టినా దక్కని తృప్తి తెలుగుకు వన్నె తెస్తే దక్కుతుందని భావించేవారు. ఆ దిశగా వేసిన ఒక అడుగు తెలంగాణలో తెలుగు అధ్యాపకులను పుట్టించింది. తెలంగాణ అంతటా ఆ ప్రాంతానికి చెందిన వారే తెలుగులో పాఠాలు చెప్పే స్థాయికి చేరింది. తెలంగాణాలో తెలుగును బోధించడానికి అంతకు పూర్వం ఆంధ్ర ప్రాంతం నుంచి ఉపాధ్యాయులను తెచ్చుకోవలసి వచ్చేది. దీనికి పరిష్కారంగా పీవీ గారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఓరియెంటల్ (BOL, MOL) డిగ్రీ కోర్సులను ఏర్పాటు చేశారని, ఆ డిగ్రీలు చేసే విద్యార్థులందరికీ నెలకు అరవై రూపాయల స్కాలర్ షిప్ కూడా ఇచ్చేవారని దీనితో 4-5 ఏళ్ళలో తెలంగాణ అంతటా తెలంగాణకు చెందిన అధ్యాపకులే తెలుగు బోధించడానికి అందుబాటులోకి వచ్చారని "నమస్తే తెలంగాణ" దినపత్రిక (తేది: 06-07-2020) తెలియజేస్తున్నది.

గురుకుల పాఠశాలలు:

విద్యారంగంలో పీవీ గారు రూపకల్పన చేసిన మరొక మహోన్నత వ్యవస్థ గురుకుల పాఠశాలలు. ఇది మన ప్రాచీన భారతదేశంలోని గురుకుల సంప్రదాయానికి, విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ శాంతి నికేతన్ కు దగ్గరగా వుండే విధానం. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు గురుకుల పాఠశాలలు కల్పవృక్షాలుగా మారాయి. ప్రతిభ వుండి కూడా ఆర్థిక పరిస్థితి బాగా లేక, చదువుకు దూరమై కునారిల్లుతున్న నిర్భాగ్య విద్యార్థులను చేరదీసి, వారికి ఉన్నత ప్రమాణాలతో ఏ ప్రైవేట్ పాఠశాలకు తీసిపోని విధంగా భోజన వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటు అత్యున్నత ప్రామాణిక స్థాయిలో విద్య గరపడం ఈ గురుకులాల లక్ష్యం. వీటి నిర్వహణ కోసం పీవీ గారు ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీని స్థాపించి దానిని సొసైటీస్ యాక్ట్ క్రింద రిజిస్టర్ చేయించారు.

మొట్టమొదటి గురుకుల పాఠశాలను నల్గొండ జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని సర్వాయిల్ అనే

మారుమూల గ్రామంలో 44 ఎకరాల సువిశాలమైన ఆహ్లాదకర ప్రాంగణంలో స్థాపించారు. ఈ విద్యాలయాన్ని పీవీ నరసింహారావు గారు ముఖ్యమంత్రిగా 23 నవంబర్ 1971న ప్రారంభించారు.

1972లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ బిల్లును పాస్ చేసి, గుంటూరు జిల్లా తాడిపత్రిలో ఒక గురుకుల పాఠశాలను, అనంతపురం జిల్లా కొడిగినహళ్ళిలో మరొక గురుకుల పాఠశాలను స్థాపించారు. ఈ గురుకుల పాఠశాలలు గ్రామీణ ప్రాంతంలోని మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తెచ్చాయి. ఈ విద్యాలయాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఐఏఎస్, ఐపిఎస్ వంటి ఉన్నతోద్యోగాలకు ఎంపికైయ్యారు. ఉన్నత చదువులు చదివి విశ్వవిద్యాలయాల ఆచార్యులుగానూ, కళాశాలల ప్రిన్సిపల్స్ గానూ, ప్రజా ప్రతినిధులు గానూ ఎదగడమే కాక, విద్యార్థులంతా ఉత్తమపౌరులుగా రూపొందారు. ఇవి ఎంతో జయప్రదంగా నడుస్తున్నాయి. ఎస్.ఎస్.సి పరీక్షలలో గురుకుల పాఠశాలల విద్యార్థులే టాపర్లుగా నిలిచారు. ఇంకొక ముఖ్యమైన విషయం – ఈ గురుకుల పాఠశాల్లో విద్యాబోధన తెలుగు మాధ్యమంలోనే ఉంటుంది. గురుకుల పాఠశాలలకు కొనసాగింపుగా పీవీ గారు కేంద్రంలో మానవవనరులశాఖ మంత్రిగా పనిచేసినప్పుడు దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాలను స్థాపించారు.

ఈ గురుకుల పాఠశాలలు జయప్రదంగా పనిచేయడం గమనించిన జలగం వెంగళరావు గారి మంత్రివర్గంలో విద్యామంత్రిగా పనిచేసిన మండలి వెంకటకృష్ణారావు గారు 1975లో నాగార్జునసాగర్ లో గురుకుల జూనియర్ కళాశాలను స్థాపించారు. ఈ గురుకుల విద్యాలయాల పనితీరుకు సంతోషించిన ఎన్.టి. రామారావు గారు తాను ముఖ్యమంత్రిగా వున్నప్పుడు 1983వ సంవత్సరంలో జిల్లాకొక గురుకుల పాఠశాలను మంజూరు చేశారు.

తెలుగు లిపి సంస్కరణలు:

ప్రభుత్వకార్యాలయాలలో తెలుగును అధికార భాషగా ప్రవేశపెట్టాలంటే అప్పట్లో ముఖ్యమైన అడ్డంకి తెలుగు టైపు రైటర్ల అలభ్యత. అక్కడక్కడా పాతకాలం నాటి 'చిన్నమాంబ టైప్ రైటర్లు' ఉండేవి. వాటిపై టైపు చేయడం చాలా నిదానంగా సాగేది. అక్షరాల 'విజిబిలిటీ' బాగుండక చదవడం కూడా కష్టంగా ఉండేది.

ఇంగ్లీష్ టైపురైటర్ల కీ బోర్డులకున్న శాస్త్రీయత వీటికి లేదు. అందువల్ల టైపింగ్ వేగంలో తెలుగు టైపు మెషిన్లు ఇంగ్లీష్ టైపు మెషిన్ల కంటే చాలా వెనుకబడి ఉండేవి. ఆ తరువాత రెమింగ్టన్ కంపెనీ వారు తెలుగు 'కీ బోర్డు'ను కొంత ఆధునీకరించి, తెలుగు టైపింగ్ లో వేగాన్ని పెంచారు. అయినా వీటిలో కొన్ని గుణింతాలు, ఒత్తులు, కదలని 'కీ' లుగా ఉండేవి. వాటిని 'డెడ్ కీస్' అనేవారు. అందువల్ల ప్రతి అక్షరం టైపు చేసిన తరువాత టైపురైటర్ 'స్పేస్ బార్' ను నొక్కవలసి వచ్చేది. చిన్నమాంబ టైపురైటర్లలోనూ ఈ సమస్య ఉండేది. అందుచేత ఇంగ్లీష్ – తెలుగు టైపు రైటర్ల టైపు వేగంలో చాలా వ్యత్యాసం ఉండేది.

అప్పటికి తెలుగులో లినో టైపింగ్ లేనేలేదు. ఈ సౌకర్యం మిగతా అన్ని భాషలలోనూ ఉండేది. అందువల్ల తెలుగు పత్రికల ముద్రణను మామూలు 'టైపు కంపోజింగ్' పద్ధతిలోనే చేసేవారు.

ఈ సమస్యలను అధిగమించి ఇంగ్లీష్ టైపు రైటర్లకు దీటుగా తెలుగు టైపు రైటర్లను ఆధునీకరించడానికి, తెలుగులో లినో టైపును రూపొందించడానికి హైదరాబాద్ చంచల్ గూడలోని ప్రభుత్వ ముద్రణాలయం అప్పటి డైరెక్టర్ వణుకూరి నారాయణరావు ఐఏఎస్ గారి ఆధ్వర్యంలో ఒక రీసెర్చ్ సెల్ ను ఏర్పాటు చేశారు. ఈ పనులను పర్యవేక్షించడానికి తెలుగు లిపి సంస్కరణల సంఘాన్ని సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య గారు మొదలైన సభ్యులతో ఏర్పాటు చేశారు. తెలుగు అకాడమీ చైర్మన్‌గా పీవీ నరసింహారావు గారే ఈ కమిటీకి కూడా అధ్యక్షులు. భాషాపరమైన విషయాలలో తెలుగు అకాడమీ సూచనలు, సలహాలు ఇచ్చే విధంగా ఏర్పాటు చేశారు. ఈ రీసెర్చ్ సెల్ లో పరిశోధనాధికారులుగా సాంకేతిక నిపుణులు కే.ఎస్.బి.వి.కే. శివరావు గారిని, కే.వి. నరసింహారావు గారిని నియమించారు. వీరిద్దరూ అత్యంత శ్రద్ధాసక్తులతో లిపి సంస్కరణల సంఘం సభ్యులతోనూ, తెలుగు అకాడమీతోనూ సమన్వయం చేసుకుంటూ తెలుగు 'టైపు' లకు శాస్త్రీయతను, ఆధునీకరణను సంతరించి, అతితక్కువ వ్యవధిలోనే తెలుగు టైపు రైటర్లను ఆధునీకరించారు. ఈ ఆధునిక టైపు రైటర్లలో 'డెడ్ కీ' లు లేవు. అన్నీ 'లైవ్ కీ' లే. దీనితో తెలుగు టైపులో వేగం పెరిగింది. అక్షరాలు అందంగానూ మారాయి. ఈ పరంపరలో ఈ పరిశోధనాధికారులిద్దరూ ఆ తరువాత వచ్చిన ఎలక్ట్రానిక్ టైపు రైటర్లకు, కంప్యూటర్లో తెలుగు టైపింగ్ కు 'కీ' లను రూపొందించారు. తెలుగులో లినో టైపు కూడా వీరి కృషి వల్ల అందుబాటులోకి వచ్చి, వార్తా పత్రికల వారికి వరప్రదాయిని అయింది.

ఈ విధంగా పీవీ నరసింహారావు గారు తెలుగు భాషాభివృద్ధికి అంతకు పూర్వం ఎవరూ చేయని కృషిని చేశారు. దీనిని ఆ తరువాత వచ్చిన వెంగళరావు గారి ప్రభుత్వంలో విద్యాసాంస్కృతిక శాఖ మంత్రి మండలి వెంకటకృష్ణారావు గారు కొనసాగించారు. ఈ కృషి అదే స్ఫూర్తితో కొనసాగివుంటే ఈనాడు తెలుగు భాష పరిస్థితి ఉచ్ఛస్థితిలో ఉండేది.

కవిత

అమ్మ

బిడ్డ కనులు తెరిచిన క్షణం నుండి
కంటి ముందు కనిపించే దేవత అమ్మ !

చెడుని తుంచే ఆయుధంగా మనల్ని తయారు చేసేది అమ్మ !
మంచిని పెంచి జీవితాన్ని అమృతమయంగా చేసేది అమ్మ !

కష్టలు లేకుండా, శిక్షలు పడకుండా
రక్షణగా ఉంటూ, మంచి శిక్షణ ఇచ్చేది అమ్మ !

నిశ్చలత్వం, నిశ్చయతత్వంతో పెంచి
నిజాయితీగా జీవిస్తూ, నిర్మల మనస్కులుగా ఉంచేది అమ్మ !!

అటువంటి బిడ్డల జీవితాల్లో సమస్యలు మాయం
అందరూ సుఖసంతోషాలతో ఉంటారన్నది ఖాయం !!

కోనా జానకి
87127 75874

–వాచస్పతి

పదనిష్పాదనకళ

The joy of coining new words!

తెలుగుభాషలో మనం ఏదైనా రాద్దాం అని మొదలుపెట్టినపుడు, ఎదురయ్యే అతిపెద్ద సమస్య సమయానికి కావాల్సిన పదాలు స్ఫురించకపోవటం. స్ఫురించినా అవి తెలుగు పదాలు కాకుండా, ఇంగ్లీష్వో, ఉర్దూవో, హిందీవో స్ఫురిస్తాయి. ఇందుకు ప్రధాన కారణం ఏదైనా విషయాన్ని వివరించగలిగీ, తెలుగులో ఆ విషయానికి సంబంధించిన పదాన్ని మనంతట మనం సృష్టించకూడదు అని మనకు తెలియకుండానే మనం పెట్టుకున్న ఒక నియమం. ఆ నియమం అశాస్త్రీయమైనది, అవసరం లేని కట్టుబాటు. మనకు అర్థం అయీ, అవతలి వారికి చెప్పినపుడు వారికీ అర్థమయితే ఆ చెప్పే భాష సరిగ్గా పని చేసినట్టు.

అందుకు మాటలు వాడుతున్నామా, సైగలు వాడుతున్నామా అన్నది ప్రశ్న కాదు. అలానే మాటల్లో భాషకూ అలాంటి పరిమితి లేదు. నిఘంటువుల్లో ఉన్న పదాలే వాడాలి, వ్యాకరణకర్తలు ఒప్పుకున్నవే వాడాలి అని గిరిగీసి ఉన్నందు వలనే, సహజంగానే మనం మన భాషలోకి ఆంగ్ల పదాలను తెచ్చి పెట్టుకుంటున్నాము. అలా కాకుండా, తెలుగులో మనకు నచ్చిన పదాలను చేర్చుకునే అవకాశం వచ్చిన రోజున పరభాషా పదాలను యథాతథంగా అరువు తెచ్చుకోము. వాటికి తెలుగు నుడికారాలు అద్ది మన భాషలోకి మన సొబగులతో తెచ్చిపెట్టుకుంటాం.

మరి ఇన్నేళ్ళు లేని అలవాటును కొత్తగా ఎలా అలవరుచుకోవాలి?

ఈ విషయం గురించి ఆలోచన చేసిన వీవెన్, చావా కిరణ్ ఇంకా ఇతర స్నేహితులు కలిసి 2006లో తెలుగుపదం (telugupadam.org) వలగూడుని తెలుగు పదాలు చేర్చేందుకు వేదికగా తయారు చేసారు. ఆ వేదికలో చేర్చే పదాల గురించి చర్చ నిమిత్తం తెలుగుపదం చర్చావేదికను ఏర్పరిచారు. అక్కడ చర్చలు మొదలైన తొలిరోజుల్లో పని చాలా చురుకుగా జరిగింది. ఆంగ్లంలో తరచూ వాడే ఎన్నో పదాలు తెలుగులో సృష్టించబడ్డాయి. కానీ ఒక నియమమూ, నిబంధనా లేకుండా, ఏది సంస్కృత పదమో, ఏ పదం వ్యుత్పత్తి ఏదో తెలీకుండా చర్చలు పక్కదారి పట్టాయి. అలాంటి సమయంలో వాచస్పతి గారు అలాంటి చర్చలను అర్థవంతంగా మరల్చేందుకు పలు వ్యాసాలు వ్రాసారు. ఆ వ్యాసాలు మెల్లిగా 2010–11 నాటికి చావా కిరణ్ సలహా మేరకు పదనిష్పాదన కళ అన్న పుస్తకంగా రూపుదిద్దుకో సాగాయి.

తెలుగులో పదాలు వాడాలనుకునే వారు జోలి పట్టి చర్చా సమూహాల్లో తెలుగుపదాల కోసం యాచించకుండా, వారంత వారే తమ సొంతంగా తెలుగు పదాలు సృష్టించుకునేలా ప్రేరేపిస్తాయి ఈ వ్యాసాలు.

పదేళ్ళ క్రితం వాచస్పతి గారి ఆలోచనలు కాలక్రమంలో మారాయి. అంతకు మునుపు ఒక ప్రత్యేక మాండలికం ప్రామాణికం అన్న భావన నుండి, తెలుగులోని అన్ని తావుల భాషలూ సమానమే, అన్ని తెలుగు తావుల నుడికారాల పదాలతో తెలుగు పరిపుష్టం అవుతుంది అన్న భావనలతో పాత వ్యాసాలకు మరింత మెరుగు అద్దారు.

ఆ మెరుగుపరిచిన కొత్త వ్యాసాలు మీకోసం ఈ నెల నుండి **అమ్మనుడి**లో వెలువడుతాయి. ఈ వ్యాసాలను చదివి, తెలుగు పదాల సాగులో మీరు కూడా కర్షకులై మంచి రాబడిని పొందుతారని ఆశిస్తున్నాము... – సంపాదకుడు

మున్నుడి

ప్రియమైన పాఠకదేవుళ్ళకి అభివాదాలు.

మిత్రులారా! చాలా సంవత్సరాల క్రితం – అంటే 2007 ప్రాంతంలో వీవెన్ గారూ, తదితర మిత్రులూ కలిసి ‘తెలుగుపదం’ అనే గూగుల్ గుంపు నెలకొల్పగా నేను కూడా అందులో ఒక ఆహూత సభ్యుడుగా చేఱాను. అప్పటివఱకూ తెలుగులో సమానార్థకాలు లేని ఆంగ్లపదాలకు వాటిని కల్పించడం ఆ గుంపు ఉద్దేశ్యం. ఈశ్వరానుగ్రహంచేత ఆ గుంపు ఇప్పటికీ దిగ్విజయంగా నడుస్తూనే ఉంది. నేను మాత్రం సుమారు ఐదున్నఁతేళ్ళ పాటు అందులో అత్యంత క్రియాశీలంగా ఉండి తదుపరి అనివార్య కారణాల దృష్ట్యా విరమించుకున్నాను.

నేనా గుంపులో చేఱిన కొత్తల్లో నూతనాంధ్ర పదావిష్కారాల నిమిత్తం దృష్టిలో ఉంచుకోదగ్గ అంశాల గుఱించి కొన్ని వ్యాసాలు వ్రాసి ఆపేశాను. వాటిని చదివిన మఱో మిత్రులూ, తొలి తెలుగు బ్లాగరూ అయిన శ్రీమాన్ చావా కిరణ్ కుమార్ గారు, “అసలు కొత్త తెలుగుపదాల్ని రూపొందించే పద్ధతులూ, విధివిధానాల గుఱించి ప్రత్యేకంగా ఓ విపులగ్రంథాన్నే వెలువఱిస్తే బావుంటుం”దన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. వారిచ్చిన ప్రోత్సాహంతో 2010–11 ప్రాంతంలో ననుకుంటా, ఈ పుస్తకం వ్రాయడం మొదలుపెట్టాను. తీఱిక దొఱికినప్పుడల్లా వ్రాస్తూ, ఏం వ్రాయాలో తోచక అప్పుడప్పుడు మధ్యలో ఆపేస్తూ, అలా ఆపేసినందుకు వారినుండి సుతారమైన, సుతిమెత్తనైన హెచ్చరికలందుకుంటూ, ఆ విధంగా పడుతూ లేస్తూ, ఎలానో మొత్తమ్మీద

2012 అక్టోబర్ నాటికి పూర్తయిందనిపించాను.

నిజానికి పూర్తి కాలేదు. ఎందుకంటే ఇది చాలా పెద్ద ప్రస్తావన (topic). నేను స్పృశించకుండా విడిచిపుచ్చిన అంశాలు ఇంకా చాలానే ఉండి ఉంటాయి. మనకంటే పూర్వమే పలువురు నూతన పదనిష్పాదకులున్నారు. చేయితిరిగిన అనువాదకులూ ఉన్నారు. దిగ్గంతుల్లాంటి వైయాకరణ శిరోమణులూ, ఉద్దండులైన భాషాశాస్త్రవేత్తలూ కూడా ఉన్నారు. అలాగే వారు సంత రించిన హస్తభూషణాలూ ఉన్నాయి. సమస్యల్లా ఏంటంటే–ఎన్నున్నా, భాషని ఈ దృష్టితో– అంటే కొత్తపదాల నిష్పాదన దృష్టితో వీక్షిస్తూ, దాన్ని భాషాసాహిత్యవిద్యలో ఓ ప్రధానమైన ప్రత్యేకశాఖగా మన్నిస్తూ వ్రాసిన పుస్తకం ఒక్కటి కూడా నా కంట పడకపోవడం. ఆ రకంగా ఏ విధమైన ప్రామర్గ దర్శనాలూ, దృష్టాంతాలూ (precedants) లేని దుర్గమమైన బాటలోకి నేనడుగుపెట్టాల్సి రావడం– కాదు కాదు, ఆ బాటని నేనే పునాదుల నుంచి పఱవాల్సి రావడం. అది నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. దీనికసలు 'తెలుగుపదం' అన్న పేరే పెట్టాలని శ్రీ చావాగారి అభిలాష. కానీ ఉదాహరణకి 1983 నుంచి తెలుగుదేశం అన్న పదం ఈ నేలమీద వాడుకలోంచి ఎలా తొలగిపోయిందో గమనించాలి. ఆ విధంగా భాషలో ప్రతి పదమూ దేనికో ఒకదానికి శాశ్వత శీర్షికో, బ్రాండునేమో, ట్రేడుమార్కో అయిపోవడం ఇష్టం లేక నేనే దీనికి పదనిష్పాదన కళ అని పేరుపెట్టాను. ఈ పేరు ఎక్కువమందికి అర్థం కాదని ఆయన అన్నారు. నిజమే కావచ్చు.

ఈ పని నేను కాకుండా ఎవరైనా మహాపండితులు చేపడితే, బహుశా దీనికి తగున్యాయం జఱిగుండేది. నా కించిద్ జ్ఞత మూలాన ఇందులో పెక్కు తభావతులు దొర్లి ఉండొచ్చు. విశేషజ్ఞులూ, సహృదయులూ అయిన పాఠకవరేణ్యుల సూచనల మేరకు వాటిని తదుపరి సంస్కరణల్లో అవశ్యం సరిదిద్దుకుంటానని హామీ ఇస్తున్నాను. దయతో ఈ కృతిని పరిశీలించి ఆశీ ర్వదించాలని వారిని ప్రార్థిస్తున్నాను. ఈ పుస్తకాన్ని చదివినవారు ఇందులోని మార్గదర్శకాల ననుసరించి కనీసం ఒక వెయ్యి ఆంగ్లపదాలకైనా సునిశితమైన సమానార్థకాల్ని కల్పించి వాటిని జనసామాన్యపు వాడుకలోకి తీసుకొస్తే నా కృషి సార్థకమని భావిస్తాను. భవిష్యత్తులో ఈ అంశం మీద ఇంత కంటే మెఱుగైన పుస్తకాలు వెలువడాలని ఆకాంక్షిస్తున్నాను.

పదనిష్పాదన కళ

మొదటి అధ్యాయం

మనం కూడా మన మాతృభాషలో కొత్తపదాల్ని నిష్పాదించవచ్చు !

ఈనాడు వివిధ భాషలలో ఉన్న పదాలు ఎక్కణ్ణుంచి వచ్చాయో ఎవఱికీ తెలీదు. వేదసంస్కృతంలో వాడబడిన పదజాలంలో కనీసం ఒక వెయ్యింటి అర్థం నేటికీ గమ్యమానం కావడం లేదంటున్నారు పరిశోధకులు. కొన్ని భాషలు ఒకే కుటుంబానికి చెందినప్పటికీ వాటిల్లోని పదాలన్నీ ఒకేలా (cognates) లేవు. ఉదాహరణకు తెలుగులో నీరు అనీ, తమిళంలో తణ్ణీర్ అనీ చెప్పబడేదాన్ని మలయాళంలో వెళ్ళమ్ అంటారు. తఱచి చూస్తే ఇది వెల్లువ అనే తెలుగు పదానికి దగ్గఱగా ఉందనిపిస్తుంది. అయితే మిగతా దక్షిణాది భాషలవారంతా నీరు యొక్క రూపాంతరాల్ని వాడుతున్నప్పుడు ఒక్క మలయాళీలకే వెళ్ళమ్ అనాలని ఎందుకు బుద్ధి పుట్టిందనే ప్రశ్నకు మనం సంతృప్తికరమైన సమాధానాన్ని పట్టుకోలేం.

శబ్దార్థాలు (ఒక పదమూ, దాని అర్థమూ) పరస్పరం అవిభాజ్యం (inseparable) అనీ, అనాది అనీ భారతీయ శాబ్దికుల విశ్వాసం. మానవజాతుల్లాగే ఎన్నో భాషలు వాటితో పాటు పుట్టడమూ, కాలక్రమంలో గిట్టడమూ కూడా జఱిగిందని చరిత్ర ద్వారా తెలుసుకుంటున్నాం. అటువంటప్పుడు శబ్దమైనా, దాని అర్థమైనా అనాది ఎలా అవుతాయి ? అని ఒక సందేహం. అలాగే, ఒకే పదానికి విభిన్నభాషలలో విభిన్న అర్థాలుంటాయి. తెలుగులో అత్యంత సాధారణంగా ధ్వనించే ఒక పదం ఇతరులకు అశ్లీలం కావచ్చు. తెలుగు తెలియనప్పుడు ఎంత అప్యాయంగా ఆహ్వానించినా "రండి" అంటే 'వేశ్య' అని ధ్వనించి ఉత్తరాదివారు ముఖాలు మాడ్చుకుంటారు. అలాగే మనకు బూతైనది ఇతరుల చెవులకు అత్యంత సాధారణంగా ధ్వనించవచ్చు. తెలుగులో పాలు అంటే స్తన్యం. Finnish లో అదే మాటకి గడ (చెక్క/లోహపు స్తంభం) అని అర్థమట. అందాకా అవసరం లేదు. మన భాషలోనే కొన్ని పదాలకి నానార్థాలుండడాన్ని గమనిస్తున్నాం. అలాగే ఒకే భాషాపదం ఒక ప్రాంతపు మాండలికంలో సభ్యమై, ఇంకో మాండలికంలో అసభ్యార్థాన్ని కలిగి ఉండడం కూడా కద్దు. ఉదాహరణకి – రాయలసీమలో 'బుడ్డలు' అంటే వేఱుసెనగపప్పులు. మిగతా ప్రాంతాలలో అది ఒక చికిత్సాపేక్షమైన రుగ్మతగా అర్థం చేసుకోబడుతున్నది. అటువంటప్పుడు శబ్దార్థాలు ఏ విధంగా అవిభాజ్యమవుతాయనే ప్రశ్న కూడా ఉదయిస్తుంది. అయితే భారతీయ శాబ్దికులు పూర్తిగా పొఱపడలేదేమో ననిపిస్తుంది, ఇటీవలి అభిప్రాయాల దృష్ట్యా ! మానవజాతి అనేకభాషల్ని మాట్లాడుతున్నప్పటికీ, ఆయా భాషాపదాలలోనూ, నిర్మాణంలోనూ అంతస్సూత్రంగా ఒక ఉమ్మడి అంతర్జాతీయసరళి (common pattern) ఉందంటున్నారు పరిశోధకులు. ఆ ధ్వనుల సరళే మన అందఱికీ ఆయా భావాల్ని స్ఫురింపజేస్తోం దట. ఉదాహరణకు – కొన్నికొన్ని రకాల భావాల్ని వ్యక్తీకరించే పదాలన్నీ – అవి ఏ భాషకు చెందినవైనప్పటికీ – ఒకే విధమైన అక్షరాలతో నిర్మాణమవుతాయంటున్నారు. పదాలకు భావస్ఫోరకత (భావాల్ని స్ఫురింపజేసే లక్షణం) ఉండడానికి కారణం మనం వాటికి చిరకాలంగా అలవాటు పడడమేనని మనం అనుకుంటున్నది

పూర్తిగా నిజం కాకపోవచ్చు.

అంటే దీనర్థం – మనం పదాల్ని ఏ విధమైన శబ్దవ్యాకరణ శిక్షణా, నేపథ్యమూ లేకుండా, ఆ పదాలకి సైతం ఏ విధమైన పూర్వరంగమూ లేకుండా ఊరికే అప్పటికప్పుడు ఆశువుగా గాలిలోంచి సృష్టించినా వాటి నిర్మాణంలోనూ, అర్థస్ఫోరకతలోనూ మనకి తెలియని అదృశ్య సూత్రమేదో పనిచేస్తూనే ఉంటుంది. కాబట్టి ఎవతికి వారు కొత్త పదాల్ని కనిపెట్టడంలో ప్రాథమికంగా తప్పులేదు. ఎందుకంటే, బట్టలు కట్టుకోవడం కూడా తెలియని ఆదిమకాలం నుంచి మానవుడికి భాష తెలుసు, అఱుపుల రూపంలోనో, కేకల రూపంలోనో! ఆనాటికే అతడు దాన్ని కల్పించుకున్నాడు. ఆనాటివారు గుంపులుగా జీవించే వారు కనుక గుంపులుగానే భాషనీ సృష్టించి ఉంటారు. బహుశా ఒకఱన్నదాన్ని ఇంకొకఱు అందిపుచ్చుకుని పలికేవారు. అలా మనిషిని మనిషి అనుకరించేవాడు. పదాన్ని పదం అనుకరించేది. (ఒక పదనిర్మాణాన్ని ఆసరాగా చేసుకొని దాన్ని పోలుస్తూ ఇంకో పదం పుట్టుకొచ్చేది) భాషాభ్యసన సామర్థ్యం పెద్దల్లో కంటే పిన్నల్లో మెండు. అలాగే నాగరికదశలో కంటే అనాగరికదశలోనే నూతనపద నిష్పాదన కూడా సులభం కావచ్చు,

కొత్త పదాల్ని ఎందుకు నిష్పాదించాలి ?

కాబట్టి పదనిష్పాదన సామర్థ్యం అనాదిగా యావన్మానవజాతి ప్రతిభాపాటవాలలోనూ అంతర్నిహితం (in-built), ప్రజనన పాటవం (reproductive capability) లానే ! సాధారణమైన స్వాభావిక పరిస్థితుల్లో దాన్ని ఎవఱూ ఇంకొకతికి పని గట్టుకొని నేర్పే పనిలేదు. అలాగే ఒక జాతి నుంచి ఇంకో జాతి పదాల్ని అరువు దెచ్చుకునే అవసరం కూడా ఏమీ లేదు. అలా అరువు దెచ్చుకున్నందువల్ల ఒనగూడే పక్కా ప్రయోజనం కూడా ఏమీ లేదు. ఎందుకంటే పదాలు వాటికవి ఐకాంతిక సృష్టి (stand-alone creation) కావు. అవి మన స్ఫురణల (ideas) కూ, అభిదర్శనానికీ (perception) ప్రతిబింబాలు. స్ఫురణలు (ideas) కలగడానికి కారణం – చుట్టూ ఉన్న ప్రపంచం పట్ల ఉన్న ఆసక్తి, సృజనశక్తి (creativity), స్పందన శీలత (responsiveness), పరిశీలన. ఒక భాషలో పదాలు తగినన్ని లేవంటే దానర్థం, దాన్ని మాట్లాడే జాతిలో ఈ నాలుగు లక్షణాలూ తగినంతగా లేవని ! మనలో ఈ లక్షణాలు లోపించినప్పుడు మనం ఎన్ని పదాల్ని అడపాదడపా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నా అవి మన చిరకాల శబ్దదారిద్ర్యచరిత్రనే ప్రతిఫలిస్తాయి తప్ప మన భాషను సుసంపన్నం చేయ జాలవు. పైపెచ్చు అవి మన భాష యొక్క సజాతీయతనీ, సహజత్వాన్నీ సంస్కరణదుర్లభంగా కలుషితం కావిస్తాయి. కాబట్టి మనం నిజంగా అలవఱచుకోవలసినవి ఈ లక్షణాలనే గానీ విదేశీ పదాల్ని కాదు.

"ఆంగ్లంలోకి అనేక విదేశీ పదాలు వచ్చిచేతినప్పుడు తెలుగులో ఎందుకు ఉండకూడదు ?" అనే ప్రశ్న వేస్తారు కొంతమంది.

ఆంగ్లానికీ, ఆంధ్రానికీ చాలా తేడా ఉంది. ఆంగ్లం పరిపాలకుల భాష. ఆంధ్రం పరిపాలితుల భాష. ఆంగ్లంలోని విదేశీపదాలు వారు పరిపాలించిన దేశాల నుంచి సంగ్రహించినవి. అవి వారి బహుదేశ పర్యాటకత్వానికి సూచకం. ఆ పదాలతో వారు తమ దేశిపదాల్ని నాశనం చేయలేదు. వారికి నిజంగా అవసరమై తమ భాషలో లేని పరిభావనల (concepts) నీ, వస్తు వర్ణనల్నీ పాలితుల నుంచి సేకరించారు. అది చాలా సహజమైన పరిణామం.

తెలుగుగడ్డ మీద విదేశీ పదాల వెల్లువ సహజ పరిణామమేనా?

మన విదేశీ పదసంపాదనేమో చాలా కృత్రిమం. ఇది వ్యామోహపూరితమైనటువంటిది. రాజకీయాధికార ప్రాబల్యంతో దేశం మీద విధించినటువంటిది. ఈ సంగతి గ్రహించలేక దీని వెనుక చాలా అపార్థాలూ, భయాలూ, మూఢవిశ్వాసాలూ, లోకజ్ఞాన లేమీ చెలామణిలోకి వచ్చాయి. ఇది మన గతకాల బానిసత్వానికి, దాన్నుంచి మార్పునొల్లని వర్తమాన జడత్వానికీ సూచకం. మనం మన ఆంగ్లపద పరిజ్ఞానంతో దేశి పదజాలాన్ని నిష్కారణంగా ధ్వంసించుకుంటున్నాం. "మీకు ఇంగ్లీషు వచ్చా ?" అని ఎవఱూ మన చొక్కా పట్టుకుని నిలదీయకపోయినా, నిలదీసినట్లే భావించి అవతలివాళ్ళ ముందు అసందర్భంగా ఆంగ్ల వావ దూకతా ప్రదర్శన కావించడం మనకొక తరతరాల దురభ్యాసంగా పరిణమించింది. మన భాషలో నిక్షేపంగా మంచినీళ్ళు అనే వాడుక పదం ఉండగా వాటర్ అనేవాళ్ళు పెద్దసంఖ్యలో తయారయ్యారు. ఫలానా ఆమె "నా భార్య/ మా ఆవిడ" అని చెప్పుకోవడానికి సిగ్గుపడి "మా మిసెస్" అని చెప్పుకునేవారే అంతా! ఈ రకంగా మనం తెలుగులో మిశ్రం చేసి వాడే ఆంగ్ల పదజాలంలో ముప్పాతిక ముప్వీసం అనవసరమైనది. అది వృథా విదేశీ పాండిత్యప్రదర్శనే తప్ప దానివల్ల ఈ జాతికీ, భాషకీ నిజంగా ఉపయోగం లేదు. తమ భాషలో ఎన్ని విదేశీ శబ్దాలున్నప్పటికీ ఈ నిరుపయోగమైన పనిని ఇంగ్లీషు వారెన్నడూ చేయలేదు. విదేశీ పదాల మూలాన మౌలిక ఆంగ్లభాషాస్వరూపం ప్రమాదంలో పడలేదు. కానీ తెలుగు పరిస్థితి అలా లేదు. అందుచేత ఇతర విధాలైన పోలికలు లేనప్పుడు ఆంగ్లాన్ని చూసి మనం ధీమాగా వాతలు పెట్టుకోలేం.

విదేశీ పదాలు మన భాషానిర్మాణశైలిలో ఇమడవు. తెలుగు పదాల మధ్య అవి సజాతీయంగా ధ్వనించవు. కోకిలల మధ్య కాకుల్లాగానే ఉంటాయి. వాటిని అనువదించగలమే తప్ప స్వదేశభాషా పరిజ్ఞానంతో విడమర్చి వివరించడం అసాధ్యం. అవి ప్రపంచం పట్ల విదేశీయులకున్న తరతరాల దృక్కోణానికి ప్రతిబింబాలు. అవి వారి సృజనాత్మక శక్తికి సాక్ష్యాలు. అవి ఖచ్చితంగా మన దృక్కోణం కావు. వారి దృక్కోణం వెనుక ఉన్నవి వారి చరిత్రా, వారి సంస్కృతీ! మన దృక్కోణం వెనుక మన చరిత్రా, మన సంస్కృతీ ఉండాలి. అలా ఉండాలంటే మన పదాలు తప్పని సరిగా మనవే అయ్యుండాలి. మనం మాట్లాడే భాష మన జాతి యొక్క సమష్టి సృజనాత్మక శక్తికి దర్పణం కావాలి.

ఆంగ్ల పదజాలపు వెల్లువ చేసిన/ చేస్తూ ఉన్న నష్టం

పదాల్ని ఏ పదానికి ఆ పదం వేఱువేఱుగా దిగుమతి చేసుకోదగ్గ ఐకాంతిక స్వమూర్తులు (stand-alone entities)గా చూడడం పొఱపాటు. నిజంగా అవి ఐకాంతిక స్వమూర్తులే అయితే నిరభ్యంతరంగా కావాల్సినన్ని విదేశీ పదాల్ని దిగుమతి చేసుకోవచ్చు, బస్సు, రైలు, సైకిలు మాదిరి ! కానీ ఎక్కువ సందర్భాల్లో ప్రతి పదానికీ ఒక ధాతువు (మూలపదం), ఒక ఉపసర్గ, ప్రత్యయం, దాన్నుంచి నిష్పన్నమైన పదాలూ మొదలైన విస్తార "పద కుటుంబం" ఒకటుంటుంది. దాన్ని తరతరాల వ్యాకరణ సంప్రదాయాల ఆధారంగా నిర్మిస్తారు. విదేశీపదనిర్మాణాలు వారి వ్యాకరణ

సంప్రదాయాల ననుసరించి ఉంటాయి. వారికి అవి తెలుసు కనుక అంతకు ముందునుంచి తమ భాషలో ఉన్న పదాల నుంచి సరికొత్త పదాలూ (derivatives), ఆ కొత్తపదాల నుంచి ఇంకా కొత్తపదాలూ– అలా అనంతంగా పదకల్పన చేసుకుంటూ వెళ్ళగలుగుతారు. అంటే వాళ్ళు తమ భాషలో తదుపరి నిష్పాదన (Further coinage) కూడా చెయ్యగలరు, అది వాళ్ళ భాష కనుక ! ఇంగ్లీషులో ఉన్న పదాలు అచ్చమైన ఇంగ్లీషు పదాలే అయితే మనం ఇంగ్లీషు ఒక్కటి నేర్చుకుంటే సరిపోతుంది. కానీ దురదృష్టవశాత్తు అలా లేదు. అ భాషలో 70 శాతం లాటిన్, గ్రీకు పదాలు. ముఖ్యంగా శాస్త్ర–సాంకేతిక పరిభావనల (scientific and technological concepts) కి సంబంధించి 90 శాతం అవే.

మనం ఇంగ్లీషులోని సాంకేతిక పదాల్ని దిగుమతి చేసుకోగలమే తప్ప ఆ పదాల్ని వారిలా వికరించి (modify చేసి) తదుపరి నిష్పాదన (Further coinage) చెయ్యగలమా ? అని ఆలోచించాలి. మనం చెయ్యలేమనేది సుస్పష్టం. మనలో అత్యంత మేధావులూ, విద్యావంతులూ అయినవారు కూడా చెయ్యజాలరు. మనకి ఆంగ్లవ్యాకరణం ఒక్కటే వచ్చు. గ్రీక్, లాటిన్ వ్యాకరణాలు రావు. అవి ఇంగ్లీషు మేధావులకే వచ్చు. శాస్త్ర, సాంకేతిక, వైద్యశాస్త్ర పరిభాషలన్నీ గ్రీక్, లాటిన్‌లతో నిండిపోయి ఉన్నాయి. ఆ శాస్త్రాల్లో మనం పరిశోధనకి దిగితే అక్కడ మనం కనుగొనబోయే కొత్త విషయాలకి పేరుపెట్టడం కోసం, తదుపరి నిష్పాదన కోసం తెల్లవారి మొహాల వైపు చకోరపక్షుల్లా చూడడం తప్ప మనమేమీ చెయ్యలేం. కనుక ఆ భాషాపదాల మీద అంతగా ఆధారపడినప్పుడు అది మనకి ఒక అంగ వైకల్యంగా, పరాశ్రయతగా పరిణమిస్తుంది. ఆ విదేశీ పదాల్ని దాటి మన పరిభావనలు (concepts) ఎదిగినప్పుడు ఆ విదేశీభాషలో ఆ భావనలకి వ్యక్తీకరణలు (Expressions) లభించకా, ఆ వ్యక్తీకరణలు చెయ్యడానికి మనకి స్వేచ్ఛ లేకా, గ్రీక్, లాటిన్ వ్యాకరణసంప్రదాయాల పరిజ్ఞానలోపం వల్ల అది సాధ్యపడకా మన మెదళ్ళు స్తంభిస్తాయి. ఇక్కడ సృజనాత్మకత ఇంగ్లీషువారి చేతిలో బందీగా మారిపోతుందనీ, అది వారి పదాలతో పాటు మనదాకా ప్రవహించదనీ గ్రహించాలి.

దీనికి పరిష్కారం ఏంటి ? మన ఆంగ్లమాధ్యమ పాఠశాలల్లో ఇహముందు ప్రతివారికీ ఇంగ్లీషుతో పాటు గ్రీకూ, ల్యాటిన్ కూడా నేర్పించడం మొదలుపెడదామా ? అది హాస్యాస్పదం అవుతుంది. ఎందుకంటే ఎవఱో కొందఱు మేధావులు తప్ప అచ్చమైన ఇంగ్లీషువారే వాటినిప్పుడు నేర్చుకోవడంలేదు. పాపం, ఎన్నని నేర్చుకుంటారు పిల్లలు బళ్ళల్లో ? భాష నుంచి భౌతిక శాస్త్రం దాకా, లైంగిక విద్య నుంచి యోగా దాకా వారి మెదళ్ళని చితక్కొడుతున్నా రిప్పటికే !

దీనికి అసలైన పరిష్కారం ఉన్నది – మనం ఇంకా ఇంకా విదేశీ పదాల ఊఁపిలోనో, ఊఁచ్చులోనో పీకల దాకా దిగబడ్డంలో కాదు. మన వ్యాకరణ సంప్రదాయాల్ని మనం కూలంకషంగా నేర్చుకోవడంలో! మఱుగున పడ్డ దేశీపదాల్ని నూతన జవ సత్త్వాలతో పునరుద్ధరించడంలో! మన దేశీ పదనిర్మాణాల్ని సక్రమంగా అవగాహన చేసుకొని కొత్తపదాల కల్పనకి ఆ సూత్రా ల్ని వినియోగించుకోవడంలో ! అప్పుడు, ఆంగ్లేయులకు తమ భాషలో తదుపరి నిష్పాదన (Further coinage) ఎలా సాధ్యమవుతున్నదో మనవారికీ మన భాషలో అది అలా సాధ్యమవుతుంది.

కానీ మనమేం చేస్తున్నాం ? మనం ఇదేదీ చెయ్యకుండా భాషాపరంగా ఒక సోమరిమార్గాన్ని ఎంచుకున్నాం. అదేంటంటే పదాల్ని ఇంగ్లీషు నుంచి అనంతంగా, యథాతథంగా దించుకోవడం, దించుకోవడం, దించుకోవడం... ఈ దించుకోవడానికి అంతులేదు. ఎందుకంటే మన భావదారిద్ర్యానికి అంతులేదు. దీనివల్ల మన మేధారోగ్యానికి జఱిగిన నష్టం గుఱించి ఎక్కువ మందికి అవగాహన లేదు. మనకి పదాలతో పాటు భావాలు కూడా పుట్టడం మానే శాయి. దానిక్కూడా ఆంగ్లేయుల మొహాల కేసి చూస్తున్నాం. ఏ పరిశోధనైనా వారే చెయ్యాలి. వారే అన్నింటికీ పేర్లు పెట్టాలి. ఆ పేర్లనుంచి ఉద్భవించే కొత్త భావాల క్కూడా వారే పేర్లు పెట్టాలి. మనం పేర్లు పెడితే అది సరైన ఇంగ్లీషు కాదు. మన ఆంగ్ల పదకల్పనలు హాస్యాస్పదం. యు.ఎస్. లోనూ, ఇంగ్లండులోనూ, ఆస్ట్రేలియాలోనూ దేనికి ఏమంటారో, ఎలా పలుకుతారో తెలుసుకుని మనమూ అదే చేయాలి. ఇదీ మన పరిస్థితి.

అంతిమ పిండితార్థం– మన భాషలతో పదాల్లో గానీ, వ్యాకరణంలో గానీ వాక్య నిర్మాణాల్లో గానీ, వాడుకలో గానీ, ఏ విధ మైన పోలికా లేని భాషల నుంచి పదాల్ని అదే పనిగా అప్పుతెచ్చుకోవడం వల్ల మనలో భాషాపరంగానే కాక భావపరంగా కూడా స్వకీయతా, సృజనాత్మక శక్తీ నశించిపోతాయి. అంతిమంగా మన భాషే నశిస్తుంది. ఎందుకంటే ఆ భాషవారు మనకి నేర్పినదాన్ని మించి ఆ భాషలో మనం ముందుకు వెళ్లలేం. మన అభిదర్శనం (perception) ఆ భాషాపదాల చేత అలా పరిమితం కావించబడుతుంది. ఏ భాషనైతే ఎంతకాలం పాటు అభ్యసించినా దాని ప్రయోగం మీదా, Further coinage మీదా మనకి అధికారం ఇవ్వబడదో అటువంటి భాషని పదాల కోసం దేవురించడం కేవలం వృథాప్రయాస.

తెలుగు పదజాలానికి మాధ్యమాలు చేస్తున్నది ఉపకారమా ? అపకారమా ?

తెలుగు మాధ్యమాలు మన వాడుకలకున్న అందాన్నీ, అర్థాన్నీ కూడా ఎలా పనిగట్టుకొని చెడగొడుతున్నాయో స్పష్టంగా తెలియజేసే ఉదాహరణ– ఈమధ్య మనం తఱచుగా చూస్తున్న "న భూతో నభవిష్యత్" . దీని అసలు రూపం– అనగా ఇటీవలి దాకా తమ రచనల్లో రచయితలంతా వాడిన రూపం "న భూతో న భవిష్యతి" అంటే – "జఱగలేదు, జఱగబోదు" అని అర్థం. ఇప్పుడు మాధ్యమాలు వాడుతున్నది "......నభవిష్యత్" – అంటే భవిష్యత్తే లేదు. (No future at all) అని ! ఎందుకిలా చేస్తున్నారు ? అంటే కాలమ్ కక్కుర్తి. (కానీ చూడబోతే ఈ వాడుక విషయంలో పొదుపయ్యేదేమీ లేదు) అలాగే స్తనశల్యపరీక్షని వట్టి శల్యపరీక్షగా క్లుప్తీకరించారు. అదే విధంగా సభంగశ్లేషల్ని (puns) లక్షించి 'తిరుగుబాటు, లొంగు బాటు' మొదలైన పదాల్ని తిరుగుబాట, లొంగుబాట అని మార్చేస్తున్నారు. మాటిమాటికీ అలాగే వాడడం మూలాన, అవ్యుత్ప న్నులైన సాధారణపాఠకులు అవే ప్రామాణిక వ్యాకరణరూపాలేమోనని భ్రమించే పరిస్థితి ఉప్పతిల్లింది. 'సమాధానపత్రాలు' అనే పదంలో

ఒక అక్షరం తగ్గితే పంక్తిబారు జాగా (column space) కలిసొస్తుందని 'జవాబుపత్రా' లనే ఉర్దూ-సంస్కృత మిశ్రమంలోకి దిగారు.

అంతేకాక ముచ్చటైన తెలుగు పదాలన్నింటినీ పక్కన బెట్టి, పెద్దపెద్ద అక్షరాల్లో "టూర్ లో సీయం, గ్రాంటు కి కేబినెట్ నో, రైల్వే సమస్యలకు ఎస్సెమ్మెస్‌తో చెక్" అంటూ తెలుగులిపిలో సర్వం ఆంగ్లమయం చేస్తున్నారు. అదేమని అడిగితే "మార్పు సహజం" అని బుకాయిస్తున్నారు, ఆ వాడుకలు తమ ప్రమేయమేమీ లేకుండానే వాటంతటవే అచ్చుసిరా పూసుకుని పత్రిక ల్లోకి వచ్చి కూర్చున్నట్లు! తెలుగుదినపత్రికలలో ఒక్కొక్కదానికీ ఒక్కో విధమైన రాజకీయపట్టింపులూ, కార్యావళీ ఉన్నాయి. ఒకఅంటే ఒకటికి ససేమిరా సరిపడనంత ఆగర్భ శత్రుత్వాలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒక పత్రిక ఒక ముచ్చటైన తెలుగు వాడుక చేస్తే వారిమీది ద్వేషం కొద్దీ రెండోవారు ఉద్దేశపూర్వకంగా దాన్ని నిర్లక్ష్యం చేసి ఆ పదానికి గల ఆంగ్లసమార్థకాన్నే తమ పత్రికలో కొనసాగిస్తున్నారు. ఈ విధంగా రచనారంగంలో ఉన్నవారికి సైతం భాషాభివృద్ధి కంటే భాషేతర రాజకీయాలే ప్రధానమై కూర్చోవడం శోచనీయం. మఱి వారినుంచి మనం భాషాపరంగా ఎలాంటి మార్గదర్శకత్వమైనా ఆశించగలమా? ఒకప్పుడు ఆశించగలిగేవారమేమో, తెలుగుమాధ్యమంలో చదివి కాకలుతీఱి వచ్చిన మహామహులు ఆ రంగంలో పరిఢవిల్లిన రోజుల్లో! ఇప్పుడో ? సాధ్యం కాదు.

ఏదేమైనా తెలుగును అభివృద్ధి చేయాలంటే తెలుగుమాధ్యమాల భాషని గ్రుడ్డిగా అనుసరించడమూ, దాన్ని ప్రామాణికంగా తీసుకోవడమూ అపేక్షణీయం కాదేమో ! వాటి భాషలో జాతీయతా, సృజనాత్మకతా లోపిస్తున్నాయని గుర్తెఱగాలి. ఆంగ్ల పత్రికలలో దర్శనమిచ్చే భాష స్థాయితో దాన్ని ఎంతమాత్రమూ పోల్చడానికి లేదు. కారణం-మనవారు పాత్రికేయత (journalism) లోనే తప్ప తెలుగుభాషలో సుశిక్షితులు కారు. వారసలు తెలుగు పుస్తకాలు చదువుతున్నారా ? అనేదే అను మానాస్పదం. అదే, ఆంగ్లమాధ్యమాల్లో పనిచేసేవారు ఆ భాషలో సుశిక్షితులనీ, మంచి ప్రామాణిక పరిజ్ఞానం గలవారనీ గమనించాలి.

కొత్త తెలుగు పదాల్ని ఎవఱు నిష్పాదించాలి ?

అనువాదాలకి అవసరమైన సరికొత్త తెలుగు పదజాలాన్ని నిష్పాదించే పని తెలుగు, ఇంగ్లీషు భాషల్ని శ్రద్ధగా అభ్యసించిన సుశిక్షితమైన విద్యావంతవర్గానిదే. ఇతరులు ఈ పనికి సాధారణంగా పూనుకోకూడదు. వారా అభిజ్ఞుల్ని ఆమోదించి, అను సరిస్తే సరిపోతుంది. ఎందుకంటే, ఒక విద్య నభ్యసించినవారికే దాని మీద అభిమానం ఉంటుంది. వారే దానికి అంకితం కాగలరు. వారే ఆ విద్యకి న్యాయం చేయగలరు. ఆ భాషకి మేలు చేయగలరు. వారికే దాని తలా తోకా తెలుస్తుంది. భాషా సంబంధ వృత్తుల్లో ఉన్నప్పటికీ భాషల్ని ప్రత్యేకంగా అభ్యసించడం కోసం తమ జీవితంలో కొంతకాలమైనా ఖర్చుచేయని వారికి వాటిమీద విశేషమైన అభిమానం కలగడం కష్టం. పదాల్ని నిష్పాదించాలంటే హృదయంలో అగాధమైన, అమాయక మైన, నిస్స్వార్థమైన పదప్రేమ కావాలి. పదోత్సాహం కావాలి. కాస్తో కూస్తో లోతైన పరిజ్ఞానం కావాలి. అన్నింటినీ మించి సృజ నాత్మకత కావాలి. ఒక కొత్తపదాన్ని నేర్చుకున్నప్పుడూ, కల్పించినప్పుడూ, దాన్ని ప్రయోగించినప్పుడూ ఒక వందరూపాయలు సంపాదించుకున్నంతగా మనస్సు బ్రహ్మానంద తరంగితం కావాలి. తనువు పులకాంకితం కావాలి. భాష పట్ల ఆ విధంగా దృఢమైన అంకితభావం గలవారు కావాలి. గ్రుడ్డినియమాలూ, వెఱ్ఱిమొఱ్ఱి పక్షపాతాలూ, శాస్త్రాంతర/ విషయాంతర ఆభి ముఖ్యమూ పనికిరావు.

-తరువాయి వచ్చేసంచికలో

కవిత

అందుకే

మేం
అనుబంధాలను పెదవుల లోపలే కుట్టేసుకున్నాం
మేం
మాకు మేముగా విషం తాగే ఒట్టేసుకున్నాం
మేం
ఇళ్లను కలల రాత్రులుగా చేసుకున్నాం
మేం
తెలుగు భాషాసౌధాలను నేలమట్టం చేసుకుంటున్నాం
మేం
శాపగ్రస్తమైన మనసు అద్దంలో చీకటిని చూస్తున్నాం
మేం
అనుకరణ ముసుగేసుకుని అస్తిత్వాన్ని పోగొట్టుకుంటున్నాం
ఏదైనా వినాశనం జరిగేటప్పుడు నొప్పి తెలియదు
దీనికి మందురహస్యమూ మన దగ్గర లేదు
మనందరి మధ్యలోనే అగాధాలు నిద్ర లేస్తున్నాయి
విఫల స్వప్నాలు వేలాడుతూ రాలిపోతున్నాయి
అందుకే ....
గత వైభవాల జ్ఞాపకాల దారుల్లో
గోరింట పూచిన సంస్కృతీ సందర్భాల్లోకి
మరోసారి ప్రయాణిస్తూ ...ప్రమాణం చేస్తూ
తెలుగువాళ్ళమని మరోసారి గుర్తు చేసుకుందాం
పరభాషా మైకంలోంచి తల విదిల్చి బయటపడదాం !

డా. సి. భవానీదేవి
98668 47000

సి.వి.క్రిష్ణయ్య
9963709032

తెలుగు నేర్పడంలో మెలకువలు - 1

మన పిల్లలు పదేళ్లు చదివిన తమ మాతృభాష తెలుగును ధారాళంగా చదవలేకున్నారనీ, తప్పుల్లేకుండా రాయలేకున్నారని అంటున్న మాటలు వింటున్నాం. ఈ మాటల్లో నిజమెంత? ఇదే నిజమైతే ఇందుకు గల కారణాలు ఏమిటి? సులభంగా నేర్పడానికి ఏవైనా కొత్త పద్ధతులు ఉన్నాయా? ఉంటే అవి ఏమిటి?

తెలుగు నేర్పడంలో మెలకువలు తెలుసుకునే ముందు తెలుగు నేర్చుకోలేక పోవడానికి గల కారణాలేమిటో పరిశీలిద్దాం. లోపాలు తెలిస్తే మెళకువలు సగం తెలిసినట్లే.

ఇంగ్లీషు పై మోజు పెరిగిందనీ, తెలుగు నేర్చుకోవడం నమోషి అయిందనీ, టీచర్లకు అంకితభావం లేదనీ, ఇలాంటి ఏవోమనకు తోచిన అభిప్రాయాలు వెల్లడించి ఊరుకుండి పోవడం న్యాయం గాదు. పైపైన కాకుండా లోతుల్లోకి వెళ్లి చూద్దాం. తర్కబద్ధంగా ఆలోచిద్దాం. తెలుగును కాపాడుకొందామనుకునే వాళ్లం అసలైన కారణాలు తెలుసుకొంటేనే మనం వేసే అడుగులు సరైన దారిలో పడతాయి.

నిజమే. చాలామంది అంటున్నట్లు నూటికి యనభై 80 శాతం మంది పిల్లలు ధారాళంగా చదువలేకున్నారు. తప్పుల్లేకుండా రాయలేకొన్నారు. మిగిలిన 20 శాతం మంది విద్యార్థులు కూడా తాము నేర్చుకొన్న తెలుగును బయట వినియోగించుకోలేక పోతున్నారు. వినియోగించుకొనే పద్ధతులు మనం తరగతి గదిలోనేలో నేర్పలేదు.

ఇప్పుడు అసలు విషయానికొద్దాం. తెలుగు సరిగా నేర్చుకో లేకపోవడానికి ప్రధానమైన కారణాలను పరిశీలిద్దాం.

1. మన మాతృభాష తెలుగు గనుక “అయ్యో! మనం మాట్లాడే తెలుగు భాష కూడా నేర్చుకోలేకపోతున్నారే” అని బాధ పడుతున్నాం. అసలు విషయం ఏమిటంటే మన పిల్లల మొత్తం చదువులే దారుణంగా ఉన్నాయి. ఇంగ్లీషు, హిందీ, గణితం, సోషల్, సైన్సు అన్ని సబ్జెక్టుల పరిస్థితీ తెలుగు కంటే దారుణంగా ఉంది. హిందీ అక్షరాలు రాకుండానే పది పాసై పోతున్నారు. పేరుకు ఇంగ్లీష్ మీడియం. నాలుగు వాక్యాలు సొంతగా రాయలేరు. గణితంలో తీసివేతలు భాగహారాలు రానివాళ్లు పదోతరగతిలో సగం మంది ఉంటారంటే నమ్మండి. మాతృభాష చెరువు లాంటిది. చెరువులో నీళ్లుంటేనే వివిధ కాలువల ద్వారా నీళ్లు ప్రవహించి వివిధ సబ్జెక్టుల లాంటి పొలాలు పండుతాయి. తెలుగే రాకపోతే మిగిలిన సబ్జెక్టులు ఎలా వస్తాయి. ఈ విషయం ప్రపంచమంతా కోడైకూస్తున్నా మన ప్రభుత్వాలు, మన మేధావులు, తల్లిదండ్రులు మేలుకోవడం లేదు. తెలుగు రాకపోయినా ఫర్వాలేదు ఇంగ్లీషు వస్తేచాలు అనుకోవడం తెలుగు రాకపోవడానికి మొదటి కారణం. (మనం మాతృభాషా మాధ్యమం కోసం పోరాడుతున్నామంటే అర్థం అర్థవంతమైన పిల్లల చదువులకోసం, వారి వికాసం కోసం పోరాడుతున్నా మని అర్థం. మాతృభాష తెలుగు మీద అభిమానంతో మాత్రమే కాదు, శాస్త్రీయమైన చదువుల కోసమని తెలియజేయాలి. నాసిరకం చదువుల గురించి రుజువులతో సవాళ్లు విసరాలి.)

2. ప్రాథమిక విద్యలో 1,2 తరగతుల ప్రాధాన్యత గుర్తించక పోవడం మరో కారణం. చిన్న పిల్లలే కదా అనుకొంటాం. నేర్పాల్సింది అక్షరాలే గదా అనుకుంటాం. ఓపిక నశించి రిటైర్ కాబోతున్న వృద్ధులైన టీచర్లనీ, పిల్లల సైకాలజీ తెలియని ఎలాంటి అనుభవం లేని వారిని 1,2 తరగతులకు కేటాయిస్తారు. ఒక్క రోజు ఇద్దరు టీచర్లు ఉన్నచోట 1,2 తరగతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి 4,5 మాత్రమే పట్టించుకొంటారు.

3 చదువుల్లో నేర్చుకోవడం, అర్థం చేసుకోవడం రెండు అంశాలుంటాయి. నేర్చుకొనే అంశాలు అభ్యాసం చేసి నేర్చుకోవాలి. అభ్యాసం చేయడం శ్రమతో కూడుకున్నపని. ఆ పసి వయసులో పిల్లలు శ్రమపడలేరు. మనం చెప్పేది అర్థంగాదు. కూర్చుని ఉండలేక విసిగిపోతారు. బడి అన్నా చదువన్నా భయపడిపోతారు. పిల్లల్ని లాలిస్తూ, నవ్విస్తూ, ఆడిస్తూ, పాడిస్తూ ప్రేమతో నేర్పాలి. ఇలా ప్రాథమిక తరగతుల్లో తెలుగు, ఇంగ్లీషు, భాషల్లో చదవడం రాయడం నేర్పాలి. గణితంలో అంకెలు కూడిక తీసివేత గుణకారం భాగహారం నాల్గు ప్రక్రియలు నేర్పాలి. ఇవి బేసిక్స్ - ప్రాథమిక విషయాలు. వీటి ఆధారంగా భవిష్యత్తులో పై తరగతుల్లో పుస్తకాల ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి. ఉన్నత పాఠశాల చదువుల్లో నేర్చుకొనేదా, నికన్నా అర్థం చేసుకోవలసినవి ఎక్కువుగా ఉంటాయి. అక్కడ నేర్చుకొంటున్నారంటే రంతస్థం చేస్తున్నారని అర్థం(ఇది దండగ మారిన పని . ఈ విషయాలు మరో సందర్భంలో వివరిస్తాను). ఈ బేసిక్స్ పిల్లలకు నేర్పడం సైకాలజీ బోధనా కళ రెంటికీ సంబంధించిన ఒక నైపుణ్యం. ఈ నైపుణ్యం చాలా మంది ఉపాధ్యాయులకు లేదు. మన ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాలు సరైన శిక్షణ ఇవ్వలేక పోతున్నాయి.

4. 1,2 తరగతుల్లో భాష రాకపోతే 3,4,5 తరగతుల్లో ఎక్కడో ఒక చోట నేర్పాలి. రాని పిల్లల్ని ఇక పట్టించుకునే నాథుడే ఉండడు. టెక్స్టుబుక్స్, సిలబస్, పరీక్షాలంటూ కళ్ళు మూసుకుని ముందుకు వెళ్ళిపోతూ ఉంటారు. చేతిలో ఆయుధంలేని సైనికుల పరిస్థితి పిల్లలది. మా పిల్లలకు చదవడం, రాయడం రావడంలేదు నేర్పించమని తల్లిదండ్రులు అడుగరు. నేర్చురుంటామని పిల్లలు అడగరు. నేర్పిస్తామని టీచర్లు చెప్పరు. పై తరగతులకు ఎక్కపోవడం ఒక్కటి జారిగితే చాలు. చదువురాకుండానే నీకు వచ్చు అని అబద్ధపు సర్టిఫికేటులిచ్చి పిల్లల్ని మోసం చేసే ఈ విద్యావ్యవస్థను ఏమనాలి?

భాషను వినోద సాధనంగా, సాహిత్యాన్ని హృదయ స్పందనలకు, సంతోషానికి సాధనంగా చూడకుండా ప్రశ్నలు-జవాబులు, వ్యాకరణ అంశాలు ప్రధానంగా బోధన జరుగుతున్నందువల్ల తెలుగు సబ్జెక్టు మీద ఆసక్తి తగ్గిపోతున్నది.

5 .అశాస్త్రీయమైన బోధన మరో కారణం. పఠనానికి ప్రాధాన్యత ఇవ్వకుండా రాతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో అక్షరాలు, గుణింతాలు, వత్తులు, పద్యాలు, నెలలు, వారాలు ఇలా అనేక విషయాలు పిల్లల చేత పలికించే వారు. చూసి రాసేటప్పుడు చదువుతూ రాసేవారు. పాఠాలు పైకి బిగ్గరగా చదివించేవారు. భావయుక్తంగా చదవడం వలన దీర్ఘాలు వత్తులు కంఠంలో పలుకుతాయి. తప్పుల్లేకుండా రాయగలరు.

L.S.R.W (లిసనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్) వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం, ఇది నేర్చుకునే క్రమం. కానీ మన వాళ్ళు చివరిదైన రాయడంతో మొదలు పెడుతున్నారు. ఇది నేర్పించేవాళ్లకు శ్రమలేని పని. చూసిరాయమని, ఇంపోజిషన్ రాయమని, పలకమీద దిద్దుకొని రమ్మని చెప్పడం చాలా సులువు గదా! చూసిరాస్తే చదువు వచ్చేసినట్లైతే చాలా మంది చాలానేర్చుకొని ఉండేవారు.

6. చదవడం, వదనం కొరవడినందువల్ల నణ- లళ -చశషస అక్షరాల మధ్య తేడాను గుర్తించలేకపోతున్నారు. ఖ ఘ ఛ ఝ ఠఢథధఫభ వత్తు అక్షరాలు ఏయే పదాల్లో ఉంటాయో గుర్తించుకో లేకున్నారు. గణితంలో దీర్ఘం(కాకూ) పొల్లు (కేకోకీ) రెండు రకాలూ దీర్ఘాలేనని చాలా మందికి తెలియదు. పొల్లు రున్నచోట్ల దీర్ఘన్ని నేకలకు సమాంతరంగా రాస్తే గందరగోళంగా ఉంటుంది గనుక ఆ దీర్ఘాన్ని పైకి ఉండేటట్లు చేశారు.

7. వ్యాకరణానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు (ఈ విషయాన్ని గత సంచికలో తరగతి గదిలో తెలుగు అనే శీర్షిక ఉన్న వ్యాసంలో తెలియజేశాను)

8. భాష వినోద సాధనంగా, సాహిత్యాన్ని హృదయ స్పందనలకు, సంతోషానికి సాధనంగా చూడకుండా ప్రశ్నలు-జవాబులు, వ్యాకరణ అంశాలు ప్రధానంగా బోధన జరుగుతున్నందువల్ల తెలుగు సబ్జెక్టు మీద ఆసక్తి తగ్గిపోతున్నది.

9. మన చుట్టూ ఇంట్లో బయటా ఇంగ్లీషు పదజాలం అనివార్యంగా వాడుతున్నాం. ఈ పదాలన్నీ ఆంధ్రీకరణ జరగాలి. అంటే తెలుగు పదజాలంగా తెలుగు లిపిలో రాయడం అలవాటు చేసుకోవాలి T.V. అని గాక టీవీ, సెల్‌ఫోను, మిక్సీ, ఫ్రిజ్, స్కూల్, బుక్స్ - ఇలా.

10. బయట షాపులు కార్యాలయాల మీద బోర్డులు, గోడల మీద రాతలు ఎక్కువ ఇంగ్లీషులో ఉంటున్నాయి. తెలుగు వాతావరణం తగ్గిపోయి ఇంగ్లీష్ భాషకు ప్రాధాన్యం పెరిగి పోతున్నది. బడిలో తాము నేర్చిన అక్షరాలు బయట కనిపించడం పిల్లలకు ఆనందంగా ఉంటుంది. వాటిని చదవడం ఒక క్రీడగా ఉంటుంది.

ఇలాంటి అనేక కారణాలు ఉన్నాయి. తెలుగు మాధ్యమంగా ఉన్నప్పుడే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, మొత్తం ఇంగ్లీషు మాధ్యమంగా మారి ఒక సబ్జక్టుకే తెలుగు పరిమితమంటే ఎలా ఉండబోతోందో ఊహించుకోవచ్చు

తెలుగును బ్రతికించుకోవడానికి పోరాటమార్గాలు చాలానే ఉండవచ్చు. అన్నిటికంటే ఉత్తమమైనదీ, నేర్పే టీచర్లకూ, నేర్చుకునే పిల్లలకూ ఉపయుక్తమైన మార్గం వేగంగా 'సులభంగా తెలుగు నేర్చుకోవడం'.

ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోనూ, విడిపోయిన తర్వాత రెండు రాష్ట్రాల్లోనూ చాలా మంది టీచర్లూ విద్యా సంస్థలూ, వ్యక్తులూ, తెలుగు, ఇంగ్లీషు, గణితం, సైన్స్, వంటి సబ్జక్టులు సులభంగా నేర్పడానికి అనేక ప్రయత్నాలు చేశారు. ఆ అనుభవాలు ఉన్నాయి.

నేను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ తెలుగు పండితుడిగా పనిచేశాను. ప్రభుత్వ ప్రత్యేక అనుమతితో మూడు సంవత్సరాలు ఒకటి రెండు తరగతులకు తెలుగు నేర్పాను. ఇటీవల 90 రోజుల్లో ఒక టీచర్ తెలుగు, ఇంగ్లీషు భాషలు చదవడం రాయడం నేర్పించినట్లు తెలిసింది. అన్నింటిలోకి ఉత్తమమైన పద్ధతి ఏదో దాన్ని ఎన్నుకొని మనం ప్రభుత్వ ప్రైవేటు టీచర్లకు చేరవేయాలి. చదువు నేర్చుకోవడం చాకిరీ కాదని నిరూపించాలి.

వచ్చే సంచికలో నేర్పే పద్ధతులు మెలుకువలు తెలియజేస్తాను.

గజల్

తెలుగు వెలుగు

జీవించాలనుకునే వారి ఆశలు కూల నీక
తెలుగు మాధుర్యము మీదన నల్ల మచ్చలు..... తూల నీక

అడుగుల వెంట అవినీతి ధార పారుతా ఉంది చూడు
మనసునంటిన నీతి మయ మైనట్టి పొరను ...... కాల నీక

తెలుగుతనం లోంచి భాషను వేరుగ చూచుచున్నారు
తెలుగు భాష వేరు యనెడి తలంపు మదిన ..... వాల నీక

పర భాషలో పడి పదములు నలిగి పోతున్నవి
తెలుగు పూలను వెలుగు కొమ్మల నుండి..... రాల నీక

పాలన కొత్త దారుల కోసం వెతుకులాడుతో
కొత్తని యెంచి చెడునే రాజును చేసి ..... యేల నీక

జీవితం కష్టసుఖముల కావడి కుండలు ఓ పృథ్వీ
కష్టమని తలచి కళ్ళల్లో నీటి చుక్కలను ..... తేల నీక

ఎస్.ఆర్.పృథ్వీ
9989223245

నవల

డి.పి. అనూరాధ
9010016555



(జరిగిన కథ)

కాలాలకు అతీతంగా సూర్యవర్మ ప్రయాణాలు చేస్తూ ఆగ్నేయాసియాలో తెలుగు మూలాల గురించి తెలుసుకుంటాడు. మయన్మార్, థాయిలాండ్లలో మన్ జాతీయుల్ని కలుసుకుంటాడు. కాంబోడియాలో ప్రపంచ ప్రసిద్ధ ఆంగ్ కార్ వాట్ శిల్పంలో తెలుగు ఆనవాళ్లు తెలుసుకుంటాడు. ఇండోచైనాలో చంపా వైభవాన్ని కళ్లారా చూస్తాడు. ఇండోనేషియాలో సుమత్రా జావాలలో తెలుగు నేలతో పెనవేసుకున్న అనుబంధాన్ని తెలుసుకుని ఆశ్చర్యపోతాడు. ఆ తరవాత సూర్యవర్మ కథ ఏమవుతుంది !

'సూర్యా.. సూర్యా..' అమ్మ పిలుపుకి మెలకువ వచ్చింది. కళ్లు తెరచి చూశా.

ఓ వైపు అమ్మ.. ఓ వైపు నాన్న.. ఆందోళనగా నన్ను చూస్తున్నారు.

'నేనెక్కడున్నా..'

'ఇంట్లోనే కదా ఉన్నావ్.. ఏదైనా కలొచ్చిందా' కంగారుగా అడుగుతోంది అమ్మ.

బొరబొదూర్.. వెన్నెల.. అగ్నిపర్వతం బద్దలవడం.. అన్నీ గుర్తొచ్చాయి.

'వెన్నెల.. వెన్నెల .. ఎక్కడ..' అమ్మని అడిగాను.

'వెన్నెల ఎవరు? అలాంటి పేరున్న అమ్మాయి గురించి నేనెప్పుడూ వినలేదే. మొన్నరాత్రి నుంచీ ఇదే వరుస. ఏదేదో కలువరిస్తున్నావ్. నాకూ, మీ నాన్నకూ అర్థం కాక ఇక్కడే ఉన్నాం. మంచి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చిందని హ్యాపీగా ఆస్ట్రేలియా విమానమెక్కావ్, టికెట్లు పంపిస్తా.. రావాలని మాకూ చెప్పావ్. బ్యాంకాక్లో దిగిపోయి మధ్యలో ప్రయాణాన్ని ఆపేసి మొన్న తెల్లవారు ఝామున వచ్చావ్. వచ్చినప్పటి నుంచీ నిద్రపోతూనే ఉన్నావ్. ఏమైంది నీకు. నాకు భయంగా ఉంది.'

అమ్మ మాటల్తో నాకొక్కటి గుర్తుకు వస్తున్నాయి.

'అమ్మా నాకేమీ కాలేదు బాగానే ఉన్నా. ఆకలిగా ఉంది, అన్నం పెట్టవా' గోముగా అడిగాను ఆమె దృష్టిని మరల్చడానికి.

'నువ్వు స్నానం చేసి రా.. ఈలోపు వంట చేస్తాను' అంటూ వంటింట్లోకి వెళ్లింది.

నాన్న నా దగ్గరగా వచ్చి.. నుదిటిపై చేయిపెట్టి చూస్తూ .. 'సూర్యా, బ్యాంకాక్లో ఏమీ జరగలేదు కదా, నీ ఇష్టంతోనే వెనక్కి వచ్చావ్ కదా' సందేహంగా అడిగారు.

'అలాంటిదేమీ జరగలేదు నాన్న, నన్ను నమ్మండి'

'సరే, స్నానం చేసిరా, భోంచేస్తూ మాట్లాడుకుందాం' తనూ బయటకి వెళ్లిపోయారు.

వెంటనే డైరీ తీసుకుని రాయడం మొదలుపెట్టాను.

మయన్మార్– మన్ జాతీయులు, ష్వేడగాన్ పగోడా, ఒక్కలప్ప, బెగో, తటోన్, మౌల్మీన్, రాజు మగాడు.

థాయిలాండ్– చామదేవి, హరిపుంజాయి రాజ్యం, లంఫూన్.

కాంబోడియా– ఆంగ్ కార్ వాట్, రెండో సూర్యవర్మ, అమరావతి శిల్పం, లండన్ మ్యూజియం.

వియత్నాం– చంపా రాజ్యం, మిసన్ సిటీ, భద్రేశ్వర ఆలయం.

ఇండోనేషియా– బొరొబుదూర్, సుధన, బొజ్జన్నకొండ, శైలేంద్ర రాజ్యం.

ఇలా కలలో నేను చూసిన ప్రదేశాలు, నిర్మాణాల లిస్టు రాసుకున్నా. ల్యాప్ టాప్ ఓపెన్ చేసి ఒక్కో దేశంలో నేను చూసిన విషయాల గురించి సర్చ్ చేశా. నా మతిపోయింది. అన్నీ నేను చూసినట్టుగానే ఉన్నాయి. అంటే అది కలే అయినా నేను తిరిగిన ప్రదేశాలన్నీ వాస్తవం. కానీ ఇవన్నీ తెలుగు వారి వలస రాజ్యాలని, తెలుగు నేలతో దగ్గర సంబంధం ఉన్న ప్రాంతాలని మాత్రం ఎక్కడా లేదు. ఇండియనైజ్డ్ హిందూ కాలనీస్ అని పేర్కొన్నారు. ఒకవేళ తెలుగు వాళ్లవి కాకపోతే నాకెందుకలా కలవచ్చింది. కలలో నన్ను కలిసిన

వ్యక్తులందరూ నా ద్వారా ఈ ప్రపంచానికి తెలుగు జాతి గొప్పతనాన్ని తెలియజేయాలని అనుకున్నారు. నా ఈ విచిత్రమైన కల గురించి ఎవరితో మాట్లాడాలి. అసలు నేనిప్పుడు ఏం చేయాలి?

'సూర్యా, భోజనానికి రా..' అమ్మ పిలుపు.

నా ఆలోచనలకు కామా పెట్టి లేచాను.

భోజనాలప్పుడు.... 'నాన్న, తెలుగు జాతి చరిత్ర గురించి తెలుసుకోవాలని ఉంది. ఎవరిని కలిస్తే మంచిదంటావ్'

'స్కూల్లో తెలుగు సబ్జెక్టంటే హడలిపోయే వాడివి, ఆ తరవాత తెలుగు పుస్తకం కాదుకదా తెలుగు వార్తాపత్రికా పట్టుకుంది లేదు నీవు, ఇప్పుడు తెలుగుజాతి చరిత్ర అంటున్నావ్, ఏమైంది నీకు?' నాన్న మాటల్లో ఎంతో ఆశ్చర్యం.

'అవును నాన్నా, నేను తెలుగును అంతగా పట్టించుకోలేదు. పైగా నాకు ఆ సబ్జెక్టంటే చాలా భయం, కానీ బ్యాంకాక్ సువర్ణభూమి విమానాశ్రయంలో దిగగానే నాలో ఏవో ఆందోళనలు చోటుచేసుకున్నాయి. సువర్ణభూమి పేరు నాలో తెలియని ప్రకంపనలు పుట్టించింది. ఆ పేరు అక్కడికి ఎలా వెళ్లిందో, అసలు ఆగ్నేయాసియాలో తెలుగు వారి మూలాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని అనుకుంటున్నా.'

నాన్న నా పరిస్థితిని అర్థం చేసుకున్నట్టున్నారు...

'ఇక్కడ నాంపల్లిలో తెలుగు యూనివర్సిటీ ఉంది. అక్కడికి వెళ్లి ఎవరైనా ప్రొఫెసర్లని కలిస్తే నీ సందేహాలు తీరొచ్చు. మా తాత ఎప్పుడూ ఓ మాట చెప్పేవాడు. తెలుగు జాతంత గొప్ప జాతి ప్రపంచంలో మరెక్కడా లేదని, నీకూ ఆయన భావనలు పట్టుకున్నాయేమో. నువ్వు ఏమి చేయదలచుకున్నా మా మద్దతు నీకెప్పుడూ ఉంటుంది.'

నాన్న మాటలు నాకు నెమ్మదిని కలిగించాయి.

'థాంక్యూ వెరీమచ్ నాన్న..' కుర్చీ లోంచి లేచి ఆయన వీపు మీద వాలిపోయా. అమ్మ వచ్చి నన్ను కౌగిలించుకుంది.

× × ×

నూతనోత్సాహంతో తెలుగు యూనివర్సిటీకి వెళ్లాను.. సాంస్కృతిక కళావారధిలా ఉంది ఆ మూడంస్థుల విశాలమైన భవనం..

అడుగడుగునా తెలుగుదనం ఉట్టిపడుతోంది ఆ ప్రాంగణంలో..

చుట్టూ చెట్లు.. హైదరాబాద్ నడిబొడ్డున ఓ అందమైన ప్రశాంతమైన వనంలా అన్పిస్తోంది. విద్యార్థులు తీర్చిదిద్దిన అనేక శిల్పాకృతులు..

లోపలికి అడుగుపెట్టగానే ఏదో తెలియని ఉద్విగ్నత..

వివిధ విభాగాల బోర్డులో నాకు కావల్సిన సమాచారం దొరుకుతుందేమోనని వెతకడం మొదలుపెట్టా

'అంతర్జాతీయ తెలుగు కేంద్రం' దగ్గర ఆగిపోయా.. అటుగా వెళుతోన్న అటెండర్ ని ఆ విభాగం ఎక్కడుందని అడిగితే రెండో అంతస్థు అని చెప్పాడు.

మెట్లెక్కుతూ వెళుతున్నా.. ఓ వైపు నుంచి సప్తస్వరాలు వినిపిస్తున్నాయి. సంగీత తరగతి అయుండొచ్చు. మరో వైపు నుంచి అందెల రవళులు.. కూచిపూడి తరగతిగది.. ఎందరో విద్యార్థులు నృత్యాన్ని అభ్యసిస్తున్నారు. కాసేపు మైమరచిపోయాను.

రెండో అంతస్థులో 'అంతర్జాతీయ తెలుగు కేంద్రం.. మునిరత్నం నాయుడు, డైరెక్టర్ .. బోర్డుపై ఉన్న అక్షరాలను చూస్తూ లోపలికి వెళ్లా. ఆయన ఏదో ఫైల్ చూస్తున్నారు. నన్ను కూర్చోమని సైగ చేశారు. ఆయన ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుండిపోయాను. ఆ గదిలో చెక్క బీరువాలలో ఎన్నో పుస్తకాలున్నాయి. ఆయన దగ్గర నుంచి చాలా సమాచారం దొరుకుతుందనే ఆశ కలిగింది.

'చెప్పండి.. మీకు ఎలా సహాయం చేయగలను' సూటిగా ప్రశ్నించారు నాయుడుగారు.

'సర్, నా పేరు సూర్యవర్మ, సాఫ్ట్ వేర్ ఇంజినీర్ని, ఆగ్నేయాసియాలో తెలుగు మూలాల గురించి తెలుసుకోవాలని మీ దగ్గరికి వచ్చాను.'

ఆయన కళ్లల్లో ఒకింత ఆశ్చర్యం కన్పించింది.

'మీ వృత్తికీ అడుగుతోన్న ప్రశ్నకి పొంతన కుదరడం లేదే' నన్ను ప్రశ్నిస్తున్నట్టుగా అన్పించాయి ఆయన మాటలు.

నా కలంతా చెప్పాను. ఆ కలలో తిరిగిన ప్రదేశాలను వివరించాను. ఇంటర్నెట్లో ధృవపరచుకుని రాసుకున్న నోట్స్ నూ చూపించాను.

నమ్మశక్యం కానట్టుగా ఆయన భృకుటి ముడిపడింది. 'నేడు తెలుగు గడ్డపై ఉన్న ప్రాచీన రాజ్యాల గురించే మరచిపోతున్న రోజులివి. ఎక్కడో దూరంగా ఉన్న ఆగ్నేయాసియా తెలుగు మూలాలున్న రాజ్యాల గురించి కల వచ్చిందంటే ఆశ్చర్యం కలుగుతోంది. ఇందులో ఏదో మర్మం ఉంది. భవిష్యత్తులో కానీ అదేమిటో మనకు తెలియకపోవచ్చు.' ఏదో తీక్షణంగా ఆలోచిస్తున్న ట్టుగా కాసేపు ఆగారు ఆయన.

'అఖండ భారతదేశంలో అత్యధిక కోస్తాతీరం ఉంది మన తెలుగు గడ్డకే. 972 కిలోమీటర్ల సుదీర్ఘ తీరం. అందుకే తీరంలో ప్రతి ఊరూ ఓడ రేవే. పైగా సాహసానికి పెట్టింది పేరు మన జాతిది. దట్టమైన అడవుల వల్ల క్రూర మృగాల బెడద ఎక్కువగా ఉండేది. కృష్ణా గోదావరి నదీ దారుల్లోనే రవాణా జరుగుతుండేది. అడవుల్లో లభ్యమయ్యే కలప ద్వారా పడవల్ని తయారుచేయడం వేల ఏళ్ల నుంచే ఉంది. ఎప్పుడూ నదీ దారులేనా సముద్రం అంతు చూద్దామనే ఆలోచనతో మన తాతముత్తాతలు సంద్రంలోకి అడుగుపెట్టి ఉండవచ్చు. అశోకుడి కాలం నుంచే శ్రీలంకకు సముద్ర మార్గంలో వెళ్లడం ఉంది. ఆనాడు మన తెలుగు నేల మీది నుంచే సింహళానికి వెళ్లినట్టు ఎన్నో ఆధారాలున్నాయి. శ్రీలంకను దాటుకుని వెళితే ఇండోనేషియా, దాని పైనే మలేషియా, ఆ దీవుల్ని ఆనుకునే థాయిలాండ్, ఓ పక్క మయన్మార్, మరో పక్క కాంబోడియా, అక్కడి నుంచి నేల దారుల్లో సులభంగా లావోస్ వెళ్లొచ్చు. వియత్నాం, చైనాలకు సముద్ర దారులూ ఉన్నాయి.. పైగా మన ధాన్యకటకం, శ్రీపర్వతం దక్షిణ భారతదేశంలో అతి పెద్ద బౌద్ధ కేంద్రాలు. దేశవిదేశాల నుంచి వచ్చిన ఎందరో యాత్రికుల కథలే దీనికి నిదర్శనం. మా అంతర్జాతీయ తెలుగు కేంద్రంలో విదేశీయులు కూడా తెలుగు నేర్చుకుంటున్నారు. 'ఎడినో చిహారు' అనే జపాన్ మహిళ మైక్రోసాఫ్ట్ లో శిక్షణ ఇవ్వడానికి హైదరాబాద్ కి వచ్చింది.

తను తెలుగు నేర్చుకోవాలనుందని నన్ను కలిసింది.

'మీ జపనీయులకు తెలుగు ఎందుకని అడిగాను.

'జపనీస్ భాషకి తెలుగుకి ఎన్నో పోలికలు ఉన్నాయి సర్. మా ప్రాచీన జాతీయులైన 'యహోయి' తెగవారు ఇండోనేషియా దీవుల నుంచే జపాన్ కు వచ్చారట. యహోయి తెగవారి ఆలయాలన్నీ పర్వతాలపైనే ఉంటాయి. వాళ్లు ప్రకృతి ఆరాధకులు' అని ఆశ్చర్యకర విషయాలు చెప్పింది.

ఇండోనేషియా వరకూ వెళ్లిన మనవాళ్లు జపాన్‌కు వెళ్లకపోయి ఉంటారా? అన్పించింది. చరిత్రలో మరుగున పడిపోయిన తెలుగుజాతి ఘనకీర్తిని మీలాంటి యువకులు మళ్లీ వెలికి తీయాలి, తెలుగుకు మనమందరం కలిసి పూర్వ వైభవం కల్పించాలి సూర్యా.'

ఆయన మాటలు ఆలోచనలు రేకెత్తించాయి.'తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఈ ప్రత్యేక సంచికను వేశారు. ఇది మీరు జిరాక్స్ చేయించుకోండి. ఇందులో మన చరిత్రంతా ఉంది. వివిధ రాష్ట్రాలలో, వివిధ దేశాలలో ఉన్న తెలుగు వారి గురించి ఉంది. బ్రిటిష్ సమయంలో వలసల గురించి చాలా వివరంగా పేర్కొన్నారు. దక్షిణాఫ్రికా, ఫిజి, మారిషస్, మయన్మార్, మలేషియా ఇలా అనేక దేశాలకు బ్రిటిష్ సమయంలో వలస వెళ్లిన తెలుగు వారి గురించి, అక్కడి వాళ్ల ద్వారానే వ్యాసాలు రాయించారు. మీకు ఈ వలసలపై విస్తృతమైన అవగాహన కలుగుతుంది. అలాగే తెలుగుజాతి కుదుర్ల గురించి, వివిధ రాష్ట్రాల్లోనే కాదు అనేక దేశాల్లోని తెలుగుజాతి వారి ఆనవాళ్ల గురించి ఎంతో పరిశోధించిన వ్యక్తి స.వెం.రమేశ్. ఆయన సామాజిక శాస్త్రవేత్త. వివిధ దేశాలు తిరిగి అక్కడి తెలుగు నుడి, బడిని తెలుగు అక్షరాలు నేర్పిన వ్యక్తి. తిరుపతి దగ్గర ఉండే రమేశ్ గారిని మీరోసారి కలుసుకుంటే మంచిది' అని నాయుడుగారు సలహా ఇచ్చారు.

ఆయన దగ్గరే స.వెం.రమేశ్ గారి ఫోన్ నెంబరు తీసుకుని మళ్లీ కలుస్తానని చెప్పి సెలవు తీసుకున్నాను. గంట క్రితం కొత్తగా అన్పించిన తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణం ఇప్పుడు నా మనసుకు ఎంతో దగ్గరగా అనిపిస్తోంది. అక్కడి పరిసరాలన్నీ మేమూ నీతోనే అంటున్నట్టుగా ఉంది.

ఆ రాత్రే తిరుపతికి బయల్దేరా. అమ్మ ఎందుకురా అంది, కానీ నాన్న మాత్రం 'ఎంతో పెద్ద బాధ్యత వాడినెత్తినేసుకున్నాడు, అదయ్యే వరకు వాడిని ప్రశ్నించకు, వాడు ఎక్కడికి వెళతా అన్నా అడ్డుచెప్పవద్దు' అని అమ్మకి చెప్పారు. నాన్నకు నా మీదున్న నమ్మకానికి మనసు కాస్త కుదుటపడింది.

× × ×

ఫోనులో చిరునామా కనుక్కుని నేరుగా స.వెం.రమేశ్ గారింటికి వెళ్లా.. కపిలతీర్థం వీధిలో...చుట్టూ చెట్ల మధ్య ఓ కుటీరంలా ఉంది ఆయన ఇల్లు. ఎంతో నిరాడంబరంగా అన్పించారు. ఆప్యాయంగా ఆహ్వానించారు. రాత్రంతా ప్రయాణ బడలిక కాస్త విశ్రాంతి తీసుకొమ్మని కోరారు. ఆయన స్వయంగా చేసిన వేడి వేడి ఉప్మా తిన్నాక నా బడలికంతా మటుమాయం అయింది. నా కలంతా వివరించాను.

'అన్నా ... ఆగ్నేయాసియాలో తెలుగుజాతి గొప్పతనం గురించి తెలుసుకోవాలని మిమ్మల్ని వెతుక్కుంటూ ఇంత దూరం వచ్చా'

'సూర్యా నీ కల ప్రకారమే వెళదాం. నువ్వు మొదట కలలో వెళ్లింది బర్మా. ఆ దేశానికి నిన్న మొన్నటి వరకూ రాజధాని రంగూన్. దాన్నే మన తెలుగు వాళ్లందరూ రంగం అనే వాళ్లు. ఈ రంగానికి సంబంధించి నాకు ఆరేడేళ్లు ఉన్నప్పుడు మా తాత ఓ కథ చెప్పేవాడు. కావేరీ నదిలో మూడు ద్వీపాలు ఉండేవట. ఒకటి రంగం, రెండోది పంద్రంగం, మూడోది శ్రీరంగం. రంగమేమో బ్రహ్మదట. బర్మా అనే పేరు బ్రహ్మనుంచి వచ్చిందని ఇప్పటికీ ఆ దేశంలో చెబుతారు. పంద్రంగం శివుడిది, శ్రీరంగం విష్ణువుది. ఒకసారి విష్ణువు, బ్రహ్మలకి వాళ్లలో ఎవరు గొప్పవారనే తగవు పడుతుండట. అప్పుడు శివుడు నా ఆదీ అంతం కనుక్కురండని పరీక్ష పెడతాడట. శివలింగంగా మారతాడు. బ్రహ్మ హంస వాహనమెక్కి ఆదిని చూడడానికి పైకి వెళతాడు. విష్ణువు వరాహ వాహనం పై భూమిని తొలుచుకుంటూ వెళతాడు. విష్ణువుకి ఏమీ కన్పించదు. బ్రహ్మ ఆది ఎక్కడో కనుక్కోలేకపోతాడు. కానీ శివలింగంపై ఉన్న మొగలి పూవు కిందకి పడుతుంటే.. బ్రహ్మకి ఓ ఆలోచన వస్తుంది. 'శివుడి ఆదిని చూసినట్టుగా నేను చెబుతాను, నువ్వు సాక్ష్యంగా నిలవాలి' అని కోరతాడు. దానికి మొగలిపూవు సరేనంటుంది. బ్రహ్మ అబద్ధం చెప్పాడని అర్థమై శివుడు రౌద్రంగా రంగాన్ని కాలితో నెట్టేస్తాడు. మొగలి పూవు పూజకి పనికిరాదని శపిస్తాడు. విష్ణువు భయపడి తన శ్రీరంగాన్ని తీసుకుని దక్షిణానికి వెళతాడు. పంద్రంగం మాత్రం మిగిలిపోయి అక్కడంతా చిత్తడి నేలలు ఏర్పడి ప్రళయ కావేరి అయిందని మా తాత చెప్పేవాడు. నేటి శ్రీహరికోట పరిసరాల్లో 40 దీవులు ఉంటాయి. అందులో ఒక దీవి పంద్రంగం. ఇక్కడ పురాతనమైన శివాలయం ఉంది. ఇక్కడ అంతా అడవే. మనుషులు ఎవరూ నివాసం ఉండరు. శివరాత్రులప్పుడు మాత్రం అందరూ వెళ్లి ఉత్సవాలు చేస్తారు. శ్రీరంగం ఎక్కడుందో మాకు తెలుసు, రంగం ఎక్కడుంది తాతా అంటే తూర్పు దిక్కున సముద్రంలో పడవల్లో వెళుతూ ఉంటే రంగం వస్తుందట అని తను చెప్పేవాడు. నేను ప్రళయ కావేరి కథలు రాసినప్పుడు ఓ ఇస్రో శాస్త్రవేత్త ఫోన్ చేశారు. ఒకప్పుడు కావేరి నది శ్రీహరికోట పరిసర ప్రాంతాల్లోనే సముద్రంలో కలిసేదట. భూకంపాల వల్ల దిశ మార్చుకుని దక్షిణానికి వెళ్లిందని పరిశోధనల్లో తేలిందని ఆయన చెప్పారు. మా తాత చెప్పిన కథకి, ఇస్రో సైటింస్ట్ చెప్పిన దానికి పోలికలున్నట్టు కన్పిస్తుంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన బర్మాలోని మన్ జాతి వారి జోలపాట 'ఓ కొడుకా మన నేల తెలంగాణ, మన రాజుకు అదృష్టం బాగాలేక యుద్ధంలో ఓడిపోతే పడవల్లో ఎర్రరాళ్లున్న ఈ సువర్ణభూమికి వచ్చాం' లో కూడా పడవల్లో మనవాళ్లు బర్మాకి వెళ్లినట్టుగానే ఉంది. మా తాత చెప్పిన కథతో సరిపోల్చుకోవచ్చు. దక్షిణ బర్మాలో తొలి రాజ్యాలు స్థాపించినది మన్ జాతీయులే. వాళ్లలో కొంత మంది థాయిలాండ్‌కు వెళ్లి రాజ్యాలను స్థాపించారు. చామదేవి మన్ జాతీయురాలే. ఇక కాంబోడియాలోని అంగ్ కార్ వాట్ ఆలయం పల్లవులు కట్టించిన కోటే. మహాబలిపురం ఆలయాల మాదిరిగానే ఉంటుంది. చోళులు కట్టించినవని తమిళులు అంటారు. కానీ చోళుల ఆలయాల పై కప్పులు చదునుగా ఉంటాయి. పల్లవులు పాలించిన మహాబలిపురంలో

వాలుగా ఉన్న పైకప్పులే కన్పిస్తాయి. చేజెర్ల కపోతేశ్వర, తిరుపతి సమీపంలోని గుడిమల్లం ఆలయాల పైకప్పులు కూడా వాలుగా ఉంటాయి. అలాగే అక్కడి శిల్పఫలకాలలో రెండు మూడు చోట్ల మన తెలుగు గ్రామాలను చెక్కారు. అందులో కోళ్లపందాలు, పంచెకట్టులో కండువా వేసుకుని ఉన్న మగవాళ్లు, ఎడ్లకు మేత పెడుతున్నట్టుగా ఉన్నాయి. మనసులో ఉన్న తమ ఊళ్లను భద్రంగా శిలలపై చెక్కారు అలనాటి మన తెలుగు శిల్పులు.

భారతదేశం మొత్తంలో ప్రాచీన ఆలయాలుగా ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మూడు ఆలయాలను పేర్కొంది. 1) చిత్తూరు జిల్లాలోని గుడిమల్లం, 2) నల్గొండ జిల్లాలోని పుష్ప భద్రేశ్వరస్వామి ఆలయం, 3) గుంటూరు జిల్లాలో చేజెర్లలోని కపోతేశ్వరాలయం. గుహల్లో తొలిచినవి కాకుండా ఇటుకతో కట్టిన ఆలయాల్లో ఇవే అతి ప్రాచీనమైనవి. ఈ మూడిట్లో కెల్లా అతి పురాతనమైందిగా పుష్ప భద్రేశ్వర స్వామి ఆలయాన్ని పేర్కొంటారు. ఇక్ష్వాకుల రాజులు రెండో శతాబ్దిలో కట్టించినట్లుగా ఆధారాలు లభించాయి. మిగతా రెండు ఆలయాల్లో నేటికీ పూజాదికాలు జరుగుతున్నాయి కానీ పుష్పభద్రేశ్వర ఆలయం నేడు పూర్తిగా శిథిలావస్థలో ఉంది. వియత్నాంలో అతి పురాతన ఆలయాల్లో భద్రేశ్వరస్వామి ఆలయం. ఇది చంపారాజులు కట్టించింది. నేటికీ మిసన్ సిటీలో శిథిలావస్థలో ఉంది. ఈ ఆలయాన్ని నాలుగో శతాబ్దిలో నిర్మించారు. ఇటుకలతో నిర్మించిన ఈ ఆలయ పై కప్పు కూడా వాలుగా ఉంటుంది. నాగార్జునకొండ సమీపంలో ఉన్న పుష్పభద్రేశ్వర స్వామి ఆలయ నిర్మాణ రీతే కాదు పేరులో కూడా ఎంతో సారూప్యత కన్పిస్తుంది ఎక్కడ మన తెలుగు నేల ఎక్కడ వియత్నాం? ప్రాచీన తెలుగులో పోత అంటే ఒకలాంటి పడవ అనే అర్థమూ ఉంది. కపోతేశ్వరం ఇలా కూడా ఏర్పడి ఉండవచ్చు అన్నది నా విశ్వాసం. పెద్ద పెద్ద పడవల్లో మన వాళ్లు ఎంతో మంది ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లి తమ ఆనవాళ్లను భవిష్యత్ తరాల కోసం భద్రపరచారు. ఆనాడు రాజులతో పాటు సామాన్యులు కూడా వెళ్లి ఉంటారు కదా, రెండో శతాబ్ది నుంచే సంస్కృత శాసనాలు కన్పిస్తున్నాయి. ఆ దేశాలలో కూడా సంస్కృత శాసనాలు దొరికాయి. అయితే సామాన్యుల గురించి తెలుసుకోవాలంటే అక్కడి ఊర్ల పేర్లను పరిశోధించాలి. కాంబోడియలో ప్రీ వేంగ్ అనే నగరం ఉంది. కాంబోడియా, వియత్నాం సరిహద్దులో ఈ నగరం ఉంటుంది. అలనాటి మన వేంగితో దీనికి ఏదైనా సంబంధం ఉందా? వియత్నాంలో పండ్రంగ్ అనే నగరం ఉంది. ఒకప్పుడు చంపా రాజుల రాజధానుల్లో ఒకటి. ఇండోనేషియాలో కోటకాపు అనే ఊరుంది సముద్ర తీరంలో. అక్కడ గుంటూరు అనే ఊరు సర్వసాధారణం. వాళ్ల భాషలో గుంటూరు అంటే పిడుగు అని అర్థం. శైలేంద్ర రాజులు శ్రీశైలం నుంచి వెళ్లిన వాళ్లని చరిత్రకారులు ఎందరో నిరూపించారు. నగరాల పేర్లు, రాజుల పేర్లు, శాసనాలు, వాస్తు శిల్పరీతులలో మన తెలుగు నేలతో ఆగ్నేయాసియాకు ఎంతో దగ్గర సంబంధం ఉన్నట్టుగా కనిపిస్తుంది. ఆ చరిత్రంతా తవ్వి తీస్తే కానీ వెలుగులోకి రాదు.

'అన్నా, పేర్లు, శాసనాలు, వాస్తు శిల్పరీతులే కాదు ఆయా దేశాల లిపి కూడా 'పల్లవ గ్రంథి లిపి' ద్వారా ఏర్పడిందని పుస్తకాల్లోనే కాదు మ్యూజియాలలో పెద్ద పెద్ద బోర్డులపై రాశారు. ఈ పల్లవ గ్రంథి లిపి మనదేనా?'

'పల్లవ గ్రంథి లిపి మన పల్లవ రాజులు తమ సౌకర్యార్థం రూపొందించారు.
ఆత్మ అనే పదం ఉంటే దీన్ని ఇంగ్లిష్‌లో ఎ టి ఎం ఎ గా రాస్తాం. రోమన్ లిపిలో అచ్చులు, హల్లులు విడివిడిగా చూపిస్తాం. మొదటి అక్షరం అచ్చు, రెండోది హల్లు, మూడో అక్షరం మ అనేది ఓ అచ్చు, హల్లు కలిసి ఏర్పడింది. హిందీవాళ్లు స్పష్టంగా ... అంటే ఎలా పలుకుతున్నారో అలాగే రాస్తారు. అదే తెలుగులో 'ఆ' రాసి తరవాత 'త' రాసి దానికి విడిగా 'మ' వత్తు ఇస్తాం. ఇలా రాయడాన్ని అశాస్త్రీయ లిపి అంటారు. పలకడం ఒకలాగ ఉంటుంది, రాయడం మరొకలాగ ఉంటుంది. మొదటి నుంచి తెలుగు వాళ్లు, కన్నడిగులు ఇలాగే రాస్తున్నారు. తమిళులు, హిందీ వాళ్లు ఇలా రాయరు. అయితే మన ఈ తెలుగు లిపి మాదిరిగానే బర్మీస్ లిపి, సింహళ లిపి కూడా ఉండడం విశేషం. బర్మీస్ లిపిలో ఆత్మ రాయమంటే ఆ రాసి త రాసి దానికి మా వత్తు ఇస్తారు. సింహళంలోనూ అంతే. పల్లవ గ్రంథి లిపి ఇలాగే ఉండడం విశేషం. అంటే పల్లవుల కాలంలో తెలుగు లిపి ఆయా దేశాలకు వెళ్లి, అక్కడ స్థిరపడింది. దానికే వాళ్లు అలవాటుపడ్డారు. ఇన్నేళ్లైనా మార్చుకోలేదు. భారతదేశంలో అత్యంత పురాతనమైన శాసనం భట్టిప్రోలు. క్రీస్తు పూర్వం మూడో శతాబ్దికి చెందిన ఆ భట్టిప్రోలు లిపి ఎలా ఏర్పడింది అన్న దానికి నేటికీ సమాధానం లేదు. ఆ తరవాతే అశోకుడి శాసనాలు వచ్చాయి. అవన్నీ బ్రాహ్మీ లిపిలో ఉన్నాయి. అయితే భట్టప్రోలుతో మొదలుపెట్టి ఆ తరవాత మూడొందల ఏళ్లు దక్షిణ భారతదేశంలో దొరికిన శాసనాలన్నీ కూడా భట్టిప్రోలు లిపిలోనే ఉన్నాయి. అందుకే ఈ లిపిని దక్షిణ బ్రాహ్మీగా పిలవడం మొదలుపెట్టారు. ఇటీవలి కాలంలో ప్రాంతానికి తగినట్టుగా ఆ లిపి పేరును మార్చుకున్నారు. తమిళులు తమిళ బ్రాహ్మీ లిపి అనడం మొదటుపెట్టి ఇప్పుడు తమిళి అంటున్నారు. అయితే క్రీస్తు పూర్యం మూడొందల సంవత్సరాల కాలంలో వచ్చిన ఈ శాసనాల్లో నూటికి తొంభై శాతం కృష్ణా గోదావరి లోయలో అంటే నేటి ఆంధ్ర ప్రాంతంలో దొరికినవే. ఓ పది శాతం మాత్రం నేటి తమిళ ప్రాంతంలో దొరికాయి. అయినా మొత్తం శాసనాలు తమిళ బ్రాహ్మీ లిపివే అని తమిళులు ప్రచారం చేసి విజయం సాధించారు. అయితే భట్టిప్రోలు శాసనం కాలానికి చెందినదే శ్రీలంకలోని అనురాధపురాలో ఓ శాసనం దొరికింది. అది కూడా భట్టిప్రోలు లిపిలోనే ఉండడం అందరినీ ఆశ్చర్యపరిచింది. భట్టిప్రోలు లిపిలో కూడా ఇందాక చెప్పినట్టుగా 'తెలుగు' ఆత్మ ప్రకారంగానే లిపి ఉంది. అలాగే అందులోని గుణింతాలు నేటి తెలుగు గుణింతాలకి దగ్గరగా ఉండడం విశేషం. మన తెలుగు నేలలో రూపుదిద్దుకున్న లిపి నేడు అనేక దేశాల తొలి లిపుల్లో ఉందంటే తెలుగు జాతి వలసల కారణంగానే అని కచ్చితంగా చెప్పొచ్చు.'' అంటూ ముగించారు.

వేల ఏళ్లనాటి తెలుగు జాతి ఘనకీర్తి చరిత్రను కళ్లకు కట్టినట్టుగా స.వెం.రమేశ్ వివరించారు. నా మనసును తేలిక పరచినందుకు ధన్యవాదాలు చెబుతూ ఆయన దగ్గర సెలవు తీసుకున్నా.

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

'నీకోసం, నీ మంచికోసం-సదా నీ అభిమానిగా ఉండిపోతాను'

("దేలెం ఒసం సకుని అసంగ్- దోహ్వానం సాయ తాయ" సవర పాట.)

ఏడువారాల నగలు × అడవిపూల చెండ్లు / సంతోష చంద్రశాలలు × వెన్నెల బయళ్ళు.
సవర బిస్మిల్లాఖాన్ 'సన్నాయి' / 'గన్నికలు వలిచే', 'ఇడిసింగ్'లు వేసే పికాసోలు .
భూమి, అడవి, విద్యతో/ విల్లమ్ములు సంధిస్తూ ఉద్యమిస్తున్న గిరిజనులు..

సర్వీస్ అంతా గిరిజనప్రాంతాల్లో, వారి సంక్షేమం, 'విద్యాభివృద్ధి'లో గడిపే రచయితలే, కనీసం బడిలో గిరిజనపిల్లలు పాడే ఒకటి రెండు పాటలు తెలుసుకోకుండా ప్రవక్తలుగా రాణిస్తూ,యాసనే మాండలికంగా చలామణి చేస్తున్న పిదప కాలంలో, శ్రీ చింతకింది శ్రీనివాసరావు విశాఖమన్యం నుడికారంతో కథలు రాయటం ఒక మలుపు. తెలుగు పాఠకులకు తెలియని గిరిజన మాండలికాన్ని పరిచయం చేయటానికి కథలకు పేరు పెట్టే దగ్గరి నుండి, ('వేలంబస', 'పనసబాసలు', 'మగనాలిమెట్ట', 'కొర్రకొత్త', 'కలిమి ముద్దలు', 'జర్రాయి', 'దగామంచు', 'బొంకుల మామిడి' 'ఇంకోకారణం'). ఆయన ఆసక్తి కలిగిస్తూ వచ్చారు. (ప్రజాశక్తిలో ఏడువారాల నగలు-గిరిజన కథలు)

నుడికారాలు-ఆచారాలు.

అయితే ఇటువంటి ప్రయత్నాలు గతంలోకొంతజరిగాయి. 'కందికొత్త', 'అనుప్పండుగ', 'మగనాలి ఘాటి' ఈనగా సినక్కలపాల్జేసిన జాతి సేమరపిల్లిది-పల్లపోడిపాల్జేసిన జాతి సవరోడిది' అంటూ అల్లిన కథలు 'మారి మారని ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మనముందుంచుతాయి' (పరిచయ వాక్యం 'వంశధార కథలు'లో; శ్రీకాకుళసాహితి) కాని గిరిజన సంస్కృతిలో ప్రముఖ పాత్ర వహించే 'బస' 'కొత్త' 'మెట్ట' 'ముద్ద' 'బాస' 'మంచు'ల దేశకాలాలు, వాటి మర్మం చింతకింది ఆకళించుకున్నాడు. కథలు మలుపు తిప్పటంలో గుర్తించవలసిన విషయాలు సూచించే ముందు, ఇప్పటి వరకు వస్తున్న సాహిత్యం తీరుతెన్నులను గమనించటం అవసరం.

కథల 'చప్పుడు' మూలాలు.

'ఇప్పపూలు' కథా సంకలనంలో కోయ రచయిత్రి వద్దం అనసూయ 'మూగబోయిన శబ్దం' ('చప్పుడు' కథలు) 'గాంధారి వేళ, బొమ్మేత్తు వేళ, మధ్యచిత్రం, చేవడిబసలు' వచ్చాయి. పిల్లంగోవిని కోయభాషలో 'తీతు' అంటారు అని రచయిత్రి కథాక్రమంలో వివరించారు. చేవడి(కల్లు) బసను కోయలుండే ప్రాంతంలో గుజ్జళ్ళు అంటారు. అలాగే మిగిలినవాటికి కూడా కోయపదాలున్నవేమో తెలుసుకుంటే బాగుంటుంది. విశాఖ మన్యంలో నంది పండుగ చేయించే 'పాటపూజారులు' వలెనే, కథలో చిత్రించిన డోలు, కోయలు చెప్పే పురాగాథలకు, మతం మారినందువల్ల వస్తున్న ప్రమాదం, ఈ బసలలో, కొత్తలలో చేసే పండుగలలో వస్తున్నమార్పుతో మొదలై ఇక్కడదాకా వచ్చిందని గమనించాలి.

ఒరవడి పెట్టిన నవలలు

అనువాదాలు చేసినవారు, మన గిరిజనులను అధ్యయనం చేయలేక పోయారు. కాని నైజీరియానవల 'చెదిరిన సమాజం' లో ఉపయోగించిన సామెతలు, జానపద కథలతో ఒక పెద్ద జాబితా తయారు చేయవచ్చు. అలాగే వారి సంప్రదాయాల, నిషిద్ధాల జాబితా కూడా రూపొందించవచ్చు' నంటూ, నవల ప్రారంభంలో 'ఇబో తెగ ప్రజలలో సంభాషణా కళకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. సామెతలు ఆ కళకు జవసత్వాలనిస్తాయి' అని రచించవలసిన పద్ధతిని నొక్కి చెప్పారు. (చెదిరిన సమాజం; చినువా అబ్బే జనసాహితి 2003). 'లాటిన్ అమెరికన్ ,ఆఫ్రికా దేశాలలో పరిస్థితులు నేడు మనదేశంలో పునరావృతమౌతున్నాయి' అని హెచ్చరిస్తారు. ఈ నవల క్రైస్తవ మతవ్యాప్తి ప్రభావాన్ని చిత్రిస్తే, దీనికి సాటి రాగల కన్నడనవల "హవన" తెలుగు అనువాదం 'తండా'లో లంబాడీజీవితాన్ని సంస్కృతిని, టీచర్‌గా వెళ్ళిన కథానాయకుడు రసవత్తరంగా వర్ణిస్తాడు. తాండా నాయకుడు సోమ్లా అన్ని విధాలా పెద్దమనిషి. కూతురుకు రెండో పెళ్లి వాడైనా, కలిగిన సంబంధం చేయాలని చూస్తుంటాడు. అప్పటికే ఆ పిల్ల బావను ప్రేమిస్తుంటుంది. గర్భవతి అయింది. కూలి కోసం వలసపోతూ, సారాకాస్తూ, దొంగతనాలు చేస్తూ బతుకున్న వాళ్ళకు పట్టణంలో నాయకులను ఆ టిచర్ పరిచయం చేసి సాగుకు భూమి ఇప్పిస్తాడు. ఆ భూమిలో గ్రానైట్ పడుతుంది. ఇక వ్యాపారస్తులు వెంటపడతారు. సోమ్లా కూతురుతో సహా కొంతమంది కూలి పనులకు పట్నంపోయి అక్కడ బతకలేక తిరిగి వస్తారు. జబ్బుపడ్డ సొమ్లాను ఉద్యోగస్తుడైన పెద్దకొడుకు తీసుకు వెళతాడు.అక్కడ ఉండలేక తిరిగి వస్తాడు. ఆ క్వారీ బొందలలో ఒకో పాత్ర బలి అయిపోతుంది. ఈవిధంగా సంస్కృతిని, బాధలతో నిండిన జీవితాలను, బాగుపడాలనే ఆరాటంలో తగిలే మందుపాతరలలో, బలి అయిపోయే బతుకులు, అంతరించే విలువలను చిత్రించే రచనలు అరుదు.

జనం నానుడులు

గిరిజనుల నుడికారం, కొండ ప్రాంతంలో వాతావరణం లాగే, లోయలు, బయళ్ళు మారేసరికి మారి పోతుంది. ఆ మార్పును కలగాపులగం చేయకుండా కొత్త, పాతపదాలను కలుపుతూ 'డబల్ కాట్ మంచం, దౌటనుమానం, చివరాఖరుకు, రైస్ అన్నం' 'స్టోరు కొట్టు' 'ఉప్మా బడి' 'పెద్ద సారు' 'బ్యాండ్ మేళం' లా అతుకులు వేసుకుంటూ పోవాలి. వేసెగి ఎండలు (వైశాఖి) ఎర్రగాయ రొండి (రోహిణి) కారండపుఅడవి (కారు అరణ్యపు అడవి) సత్తేడు సంద్రాలు (సప్త) 'మా ఘన పెద్దలు'.

కురుచుటక్కులపీట(కుర్చీ) గిరిజనుల సంప్రదాయ సాహిత్యంలో దొర్లే ఈ పలుకుబడులే వాటికీ ఒరవడి.

గిరిజన సంస్కృతి తీరుతెన్నులు – అధ్యయనాలు ,వ్యాఖ్యానాలు.

మన గ్రామీణజీవితంలో గ్రామదేవతలు, ఆటపాటలు, ఇచ్చిపుచ్చుకోవటాలలో, ముఖ్యంగా దాంపత్య జీవితంలో ఒడిదుడుకులు సరిచేసుకునే కట్టుబాట్లు; వీటి మూలాలు, లోతులు గిరిజనజీవితం తరచి చూస్తే మనకు బోధపడతాయి.

గిరిజనులు ప్రపంచమంతా ఉన్నారు. వారిని సంవత్సరాలతరబడి అధ్యయనంచేసిన మహిళా ఆంత్రపాలజిస్టులు మార్గరెట్ మీ రూత్ బెనెడిక్ట్ మేరీ డగ్లస్ ; పాశ్చ్యాత్య సమాజం స్త్రీని చూసే తీరును సవాల్ చేయసాగారు. యానాది, ఎరుకల తెగల విముక్తికి జీవితాన్ని ధారపోసిన వెన్నెలకంటి రాఘవయ్య తెల్లవాళ్ళ దృక్పథాన్ని దుయ్యబట్టారు.


'బ్రిటిష్ ప్రభుత్వము మన అనాది నీతులను మంటలో గలిపి, కొత్త నేరాల జాబితాను మనకు అంటగట్టినప్పటి నుండి, ప్రతిది నీదా, నాదా అనే గీటురాతికిలోబడవలసి వచ్చినది. ఎవరూ కష్టించి పండించని చెరువు చేపలు, కప్పతుంగలు, అడవి కట్టెలు, చాలు చెట్లు, తోపు, పోరంబోకుల ఫలితాలు, ఈ పంచాయతి రాజులు రాకమునుపు పేద సాద అనుభవించు చుండినపుడు, యనాదికి తిండి కరువే లేకుండెను. అతనికి సంసరబలగము బరువే కాకుండెను. అప్పటికి అతడు తిన్నది నాగజెముడు పండ్లు, నివసించినది కాలువకట్టన; తాగినది దొరువు నీరు; కట్టినది పారవేసిన పాతబట్ట. అట్టి నిరపరాదికి, నిష్కామకర్మికి, ఒకే సారి ఇద్దరు ఇల్లాండ్లు ఉండకూడదని, బొట్టు కట్టని స్త్రీతోడి కలయిక వ్యభిచారమని, ఏ పనిచేయక స్థిర నివాసము నోచుకోక, తిరుగుబోతుగానుండుట ఎవరికీ అపాయము కానప్పటికీ, శిక్షార్హమని, దినమొలతో తిరుగుటనేరమని, మొదలగు అనేక నేరాలను అతని నొసటిపైన రాస్తే అది ఎవరి తప్పు?" (యానాది 1974.) మార్క్సిస్ట్ సాహిత్యవేత్త త్రిపురనేని మధుసూదనరావు 'మధ్యలో వలసవాదులు వచ్చి మొత్తం సామాజిక వ్యవస్థను కంపింప చేయకపోతే (దక్షిణాంధ్ర యుగంలో) స్వేచ్ఛాభోగఉద్యమం, స్త్రీ విముక్తి ఉద్యమంగా పరిణమించేది' (సాహిత్యంలో వస్తు శిల్పాలు.182) అంటూ, మనలో తెల్లవాళ్ళు రాకముందు స్త్రీల జీవితాల్లో వస్తున్న మార్పును తెలియజేస్తారు.

ఇవేవీ గమనించకుండా....

గిరిజనులు మనమధ్య ఉన్నా, మిడిమిడిజ్ఞానంతో అర్థంచేసుకోవటం, సిద్ధాంతాల మూసలో ఇమడ్చటం, లేదా అదేదో గంధర్వలోకంగా వ్యాఖ్యానించటం పరిపాటి అయింది. ఎస్కిమోలలో వైఫ్ హాస్పిటాలిటీనుండి, మనదేశంలో మధ్య భారతంలో ఘోటుల్(youth club), కేరళలో నాయర్ నంబూద్రి సంబంధాలలో – మాతృస్వామ్యం; ఇలా ప్రపంచంలో గిరిజనులలోనే కాదు, మిగతా సమాజాలలో దేశ కాలాలబట్టి స్త్రిపురుష సంబంధాలలో ఎంతో వైవిధ్యమున్నా వాటిలో ఒక నిర్మాణం (structure) ఉంటుంది. కట్టుబాటు అంటే. వావి–వరుసలు ఖచ్చితంగా పాటిస్తారు. ఈడూ జోడు చూస్తారు. సమస్యలు తేల్చుకుంటూ 'ప్రజా తంతువు' కొనసాగేటట్లు చేస్తారు. ఇవి గమనించకుండా, ఆస్తి హక్కు, దాంపత్యం, సొంత సంతానం లేని కమ్యూన్‌లను ఊహించుకుంటూ సూత్రీకరణలు కొందరు (వివాహ వ్యవస్థ; మహీధర రామమోహనరావు; ప్రజాసాహితి డిసెంబర్ 2009), పార్టీ పనిలో ప్రేమించే తీరిక ఎక్కడుంటుంది, కుదిరినప్పుడు, నచ్చిన వాడిని 'కలుసు'కుంటూ సాగి పోవటమేనని (మూడుతరాలు) కొందరు కార్యకర్తలకు హితం చెపుతున్నారు. ఇటువంటి ధోరణులు ఒకనాటి వీరశైవ కథలలో ఉండేవి. ఇహపోతే మగనాలి, తప్పు సొమ్ము చెల్లించిన వాడికి సొంతం అవుతుందని చెంచు రాణి కథలో, స్కూళ్ళ ఇనస్పెక్టర్ అయిన రచయిత చింతా దీక్షితులు, కథ మలుపు తిప్పటానికి, లేని ఆచారం అంటగట్టి, ఆమెను తెల్లదొరకు పెళ్ళాన్ని చేస్తాడు. ఇటువంటి 'చెల్లింపు' అవకాశం ఉంటే మనం చాలా మందిని తెచ్చుకుని ఉండే వాళ్ళం..

తప్పుల కూపంలో కూరుకు పోవద్దు– సెలయేరులా సాగిపోవాలి.

గిరిజనులు ప్రాప్తకాలజ్ఞులు. 'స్థితస్య గతి;చింతనీయా' ఎదురైన సమస్యను



మహీధర రామమోహనరావు

పదిమంది కలిసి పరిష్కరించుకుంటారు. తప్పువేస్తారు. కానీ తప్పుకు దారితేసే ధోరణులను క్షమించరు. మానవజాతికి సహజమైన అరిషడ్వర్గాలు వారిలోనూ ఉన్నాయి. ఈర్ష్య, అసూయలతో చెడుపు చేయిస్తారు. కలిసిరావాలని మొక్కుతారు. కాని తగవులు చేసేటప్పుడు ఈ బీరకాయ పీచు, మోకాలికి బట్టతలకు ముడివేసే నమ్మకాలను ఒప్పుకోరు.' తీరిపోయిన కళ్ళానికి కోళ్ళుకొస్తే పండదు' ఎవడో చెడుపు చేసి 'తాపడాలు' పెట్టాడని కుళ్ళుకోటం కాదు, 'మడికిగెత్తం' వేయాలని హెచ్చరిస్తారు.

బీజ ప్రధానమైన పోడు వ్యవసాయం నుండి క్షేత్ర ప్రధానమైన ఆస్తి హక్కు వైపు మళ్ళుతున్న సంధికాలంలో, స్త్రీ స్థానం పిల్లలపెంపకం, వీటిమీద వారి సంప్రదాయ పంచాయతిలలో చేసే వాగ్వాదాలు, వెనకటి తీర్పులను సవరించమంటూ చేసే ప్రతిపాదనల ముందు, మన న్యాయశాస్త్రాలు ,కోర్టులు దిగదిడుపు. ఆ పదును పోయి సంప్రదాయంలో బలం తగ్గుతూ ఆత్మవిస్మృతిలో పడి న్యూనతాభావంతో కొట్టుకుపోతున్న ఈ దశలో, ఆ తర్కాన్ని గుర్తు చేయుటం ఆలోచనామృతమైన సాహిత్యం బాధ్యత. 'కనువిప్పును కలిగించేది, పెను నిద్దుర వదిలించేది' అన్నాడు గదా మహాకవి.

గిరిజనుల వివాహ వ్యవస్థ.

1982లో ఆదిలాబాదుజిల్లాలో గోండుతెగ వారిలో వివాహ వ్యవస్థను, సామాజిక పరిణామాలను అధ్యయనం చేసిన ప్రఖ్యాత మానవశాస్త్రవేత్త హైమెండర్ఫ్ శిష్యుడు మైఖేల్ యార్క్, తెలంగాణాకు ఇటీవల మళ్ళీ వచ్చిన సందర్భంగా, అతని

వ్యాసాలను తెలుగు చేసి ల.లి.త, సునస్పతి సంపాదకత్వంలో 'వెలిత పాట' ప్రచురించారు. దాంట్లో ఆయన 'పరిశీలించిన 125 జంటల్లో 33 మారు మనువులు. వీటిలో 13 అంతకు ముందు భాగస్వామి చనిపోవటం వల్లజరిగినవి. 16 దాకా పెండ్లి విఫలం కావటం వల్లజరిగినవి. వీటిలో నాలుగు మాత్రమే అలుమగలమధ్య సయోధ్య లేకపోవటం వల్ల విఫలమైనవి. మిగతా పన్నెండు ఇల్లరికపు పెండ్లిళ్ళు విఫలం కావటం వల్ల జరిగినవి. ఈ ఇల్లరికపు పెళ్ళిళ్ళలో సహచరులలో ఏ ఒక్కరి మరణమో కాకుండా, వేరే కారణాల వల్ల, 23% మర్కి, 18% పాట్ పెండ్లిండ్లు విఫల మోతున్నాయి. ..'.అని గిరిజన వివాహ వ్యవస్థ తీరుతెన్నులను తెలియ చేస్తారు.

కాబట్టి చూసి చూడనట్లు. నటించే తిరుగుబోతుతనానికి అవకాశం లేదు. లేచి పోయిన పెళ్ళాన్ని ఇష్టమైతే తిరిగి తెచ్చుకుంటారు.. మొగుడు సవతిని తెస్తే, పెళ్ళాం కాదనలేదు. గిరిజన సమాజంలో స్త్రీకి స్వేచ్ఛ ఎక్కువని చెప్పటానికి, స్త్రీ విముక్తి రచనలధోరణిలో కొట్టుకు పోకూడదు.

ఆదర్శ దాంపత్యం-ఎదురౌతున్న సమస్యలు.

వెన్నెలకంటి రాఘవయ్య గారు యానాదుల ఆదర్శ దాంపత్యం వర్ణిస్తూ, వారికీ ఎదురౌతున్న సమస్యలు కూడా వర్ణిస్తారు.

'పెనిమిటి కలుగులు తవ్వుతున్నప్పుడు, భార్య వక్కనచేరి ఉసి గొలుపుతుంటుంది. భర్తవడ్లు దంచుతుంటే, భార్యచేతతో చెరుగు తుంటుంది. పెనిమిటి గుంటచేపలు పట్టుతుంటే, భార్య వాటిని ఏరి తాటాకుల సంచిలో వేస్తుంటుంది. మగడు సోదే చెప్పుతుంటే, స్త్రీ బలకొట్టుతుంటుంది. పక్కగ్రామానికి ప్రయాణమైనా ఆలుమగలు కలసి ఒరుసుకుంటూ నడువవలసినదే. పనులు పొడనీ దినాలలో జవరాలి గారాబు ఒడిలో కూలబడి పేలుకుట్టించుకోటమే అతనికి తెలిసిన అలవాటైన విశ్రాంతి.ఎలుక కలుగులో తవ్వుతూనొ, నిరపాయకరమైన చిలువలకు, పాలపిట్టలకు ఉచ్చులు ఒడ్డుతునో గుంటచేపలకు చెలిమ నీళ్ళు కుండపెంకులతో చల్లుటతోనో దినమంతా నిమగ్నులైన యానాదులు అట్టి సామాన్యమైన పనులను కూడా వేట అని పిలుచుకుంటారు. యానాదిచేసే పనిపాటలు ఇంటిలోని సంకటి కష్టాన్ని బట్టి కాక, పనుల ఫక్కీని బట్టి, అవి తమంత తావే అతన్ని వెతుక్కొని వచ్చినపుడు, అతనికుండిన ఇష్టాఇష్టాలను బట్టి, ముందురాత్రి పాటిదిబ్బమీద అర్ధరాత్రి కోడికూతవరకు జరిగిన తప్పెట వేడుక జాగారము బట్టి, అప్పటి శీతోష్ణ స్థితిని బట్టి, ఇల్లాలి కౌగిటి బిగువు పట్టువిడుపుల మీద ఆధార పడిఉంటుంది'. భార్యకు నవమాసాలు నిండగానే, ప్రతి యానాది అడవికి పోయి పదివండ్రెండురకాల వేళ్ళనుతీసుకొచ్చి సిద్ధముగా ఉంటాడు. నొప్పులు సోకగానే కుండలో నీళ్ళు నింపి వేళ్ళతో కషాయం కాస్తాడు. కన్నతరువాత పదిరోజులవరకు ఈ కుండకషాయాన్ని బాలింత తగుతుందా వలసినదే. స్త్రీలకు అతి సునాయాసంగా కాన్పుజరుగుతుంది. ఆసుపత్రుల మంత్రసానులు వారికీ పనికిరారు. యానాదులలోనే తెలివితేటలుగల అందెవేసిన చేతులు ఉరూరా ఉంటారు. 'యానాది స్త్రీలకు వైధవ్యం లేదు. ఎందుకంటే బిడ్డలు కలిగిన తరువాత, భర్త చనిపోయినా విడిచిపెట్టి పోయినా, బిడ్డలను పోషించటం భారమని, స్త్రీలు మరుమనువుకు దాసులౌతారు. అయినా కలసి ఉన్నంత వరకు కలదు సుఖమని భావించి మాటల్లోనే విడిపోతారు. అంతా తృటిలో జరిగిపోయేదే. వారి సంసారదాంపత్యం నిలుపు అలుపు లేని జీవన సరళి' 'దౌర్జన్యానికి యానాదికి పొత్తుకుదరదు.కలుసుకున్న ఇల్లాలిని కొట్టే యానాదులు సకృతు. మచ్చుకు కూడ చిక్కరు. ఒకవేళ కోపాన్ని పట్టలేక, ఇతరులు ఎగతాళి చేస్తారన్న భయంతో, ఇల్లాలితో తగవులాడవలసినట్లు విధిలేక ఏర్పడితే, పండ్లు పటపట కొరికి, గుడ్లు ఎర్రచేసి, కర్రపైకెత్తి, ఒళ్ళంతా ఒణికించి కొట్టేతంట అఘాయిత్యము చేస్తాడే కాని ఆలిని తాకనే తాకడు' (యానాది.వెన్నెలకంటి రాఘవయ్య) .

'పిల్లలు పుట్టిన తరువాత ఇతర కులాల వారు యానాది స్త్రీలను వదిలేస్తున్నారు. బిడ్డలకు తండ్రిని బట్టి ST రిజర్వేషన్ ఇస్తున్నారు కనుక. తండ్రి ఇతర కులస్తుడై, ఇంటి పేరు మారినందున, ఇంటి పెర్లనుబట్టి - తండ్రి వేరే కులస్తుడైనందున, బిడ్డలకు కుల సర్టిఫికేట్ఇచ్చి రిజర్వేషన్ కల్పించుటకు అధికారులు అంగీకరించుట లేదు' అని ఆయన బాధపడతారు. యానాది మొగుడు, కట్నం కోసం, సాంఘికంగా తన అంతస్థ పెంచుకోవటం కోసం, పెళ్ళాన్ని వదిలేసి వేరే కులం అమ్మాయిని చేసుకుంటున్నాడు. తన వాళ్ళను దూరంగా పెడుతున్నాడు'. అంటూ రాఘవయ్య గారు వాళ్ళలో పెరుగుతున్న స్వార్ధం, మోసం; అధికారులు అభివృద్ధి పేరిట పెడుతున్న బాధలనుకూడా ప్రస్తావించారు..

కొండను తగిలించుకునే దుండగీళ్ళు

కాని గిరిజనేతరులు తమకులానికి ముందు కొండ తగిలించుకుని, అవసరమైతే ఒక కొండపిల్లకు పుట్టినట్లు చూపించుకుని గిరిజనులుగా చలామణి అవుతున్నారు. ఇటువంటి ఉదాహరణలు 'కొండఫలం'రచయిత్రి స్వగ్రామం చుట్టూ కోకొల్లలు. వాటిని మరింతగా తెలుసుకుని ఉంటే, ఆ కథలు ఆలోచనను రేకెత్తించేవి. అక్రమాలను అరికట్టటంలో కొంతైనా పనికి వచ్చేవి.

నమష్టితత్వం ఊపిరిగా సాగే ఈ సమాజంలో రావలసిన మార్పులకోసం చొరవచూపించేక్రమానికి బదులు వ్యక్తులపాత్రను ఎక్కువ చేసి చూపకూడదు. 1950లలో బస్తర్ రాజు లోక్ సభకు ఎన్నికైనారు. కానీ డిల్లీలో ఖర్చు తట్టుకోలేక ఆయన తిరిగివచ్చేసాడట. తీరా విచారిస్తే అతనికి వచ్చే జీతభత్యాలను అతని కార్యదర్శి కొట్టేసేవాడని తెలిసింది. ఈ చొరవగల నాయకులు, ఉద్యోగులచేతిలో అలా మోసపోయేవారు. వ్యక్తులకు ప్రాధాన్యమిచ్చే మన ప్రతినిధి సభలలో జరిగే ఫిరాయింపులు, పాలకవర్గం తిమ్మిని బమ్మిని చేయటం చూస్తూనే ఉన్నాం గదా

'అడుగడుగున 'బస' ఉంది-అందరిలో గుడి ఉంది'.

గుడులు,కోటలు, భజనలు; ఇవి మార్గ సంప్రదాయంలోవి. గ్రామీణులు పండుగలప్పుడు అటుపోతారు కానీ,వారు రోజూ మొక్కే దేవతలు, కొండ, చెట్టు, పుట్ట, రాయి, రప్పు, చెరువు కట్ట, పొలిమేరలలో ఉంటారు. వాటికీ గుడులేమి ఉండవు. ఎప్పుడో ఒకసారి సంబరం చేస్తారు. కానీ ఆ దారిన పోతున్నపుడు, సారాబొట్టు,

పొగాకుముక్క, గులకరాయి, చెట్టు ఆకు ఏదో పెట్టి మొక్కి పోతుంటారు. క్రమంగా ఈ ఊరుమ్మడి స్థలాలను కలుపుకోటం, గిరాకినిబట్టి గుళ్ళు కట్టటం, సంస్కృతంలో మంత్రాలు చదివే పూజారులను తెచ్చి, బలహీన వర్గాలకు చెందిన పూజార్లను వదిలించుకుంటున్నారు.

గిరిజనగూడేలు సాధారణంగా 30,40ఇళ్ళతో,అటవిఫలసాయం సేకరిస్తూ, పోడు వ్యవసాయం చేసుకుంటూ అయిదారు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంటాయి. ఇక్కడి అడవి. భూమి ఖనిజాల మీద కన్ను వేసిన తెల్లవాడు. తిరగబడ్డ కొండవాళ్ళను బలప్రయోగంతో అణచి వేసాడు. ఈ బలగాల, వనరుల తరలింపుకు రోడ్డులు వేసాడు. మునసబు, కరణాలు, ఫారెస్టు గార్డులు, పోలీసులను దిగువనుంచి తీసుకొచ్చి కొత్త సరిహద్దులు గీసి, లెక్కలు కట్టి, కట్టడి చేసారు. గిరిజన కుల సర్టిఫికేట్‌లు జారీ చేసే అధికారం కూడా వారికే కట్టబెట్టారు. ఈ శాంతి భద్రతల ధీమాతో,ఈ తెలిసిన ఉద్యోగుల అండతో, వలస పోయిన వ్యాపారస్తులు, రైతులు సంస్కర్తలు, గుడులు భజనలు, కూటమి సంస్కృతీ పెంచారు.

కానీ కొండప్రాంతాలు పర్యావరణం దృష్ట్యా సున్నితమైనవి. అక్కడికి వలసలు పెరిగితే అడవులు నశిస్తాయి. 'ఉగం కొట్టి' వరదలు పెరుగుతాయి. రాళ్ళూ రవ్వలు మట్టితోపాటు కొట్టుకొస్తాయి. పల్లంలో చెరువులు పూడిపోతాయి ఉపద్రవాలు విరుచుకు పడతాయి. కాబట్టి 'తృణ కాష్ట జలసమృద్ధి' తో (అడవి, గడ్డి, నీరు) కొండలలో పర్యావరణ భద్రత,దిగువన 'వాపీ కూప తటాకాలు' పెంచి అన్న సమృద్ధి, ఈ రెండు ప్రాంతాలమధ్య పరస్పర వినిమయం మన అభివృద్ధి విధానంగా ఉండేది.'దుకాణం మీద బియ్యం-దుక్కమీద ముక్క' అని కొండవాళ్ళు, దిగువవాళ్ళు రూపాయిలు పెట్టి అన్నీకొనుక్కునే మాయను దుయ్యబడితే,పల్లపోళ్ళు 'రూపాయలేం చెట్లకు కాయటం లేదు'అంటూ ఎత్తిపొడుస్తారు. సిరి సంపదలలలో వ్యత్యాసాలున్నా, ఒకనాడు దిగువన రాజులకు, గిరిజననాయకులకు 'నేస్తంకట్టుకోటం'లాంటి.

ఆచారపరమైన గౌరవాలు, మన్ననలు బలంగా ఉండేవి. తెల్లవాడి దాడికి రాజులు లొంగారుకాని, గిరిజనులు లొంగలేదు. వాళ్ళ తిరుగుబాటులను అణచి వేయటానికి, 'నరబలి' అనే దురాచారం అరికట్టటం అనేసాకుతో సాయుధ సంస్కరణలకు దిగారు. అయితే సంస్కరణలను చేసుకోడంలో మన పద్ధతులు మనకున్నాయి. నరబలి బదులు; దున్నపోతులు, క్రమంగా గుమ్మడి కాయలు వచ్చాయి. తెల్లవాళ్ళ బలప్రయోగానికి గిరిజనులు ఎదురుతిరుగుతుంటే, దిగువ బుద్ధిజీవులు తెల్లవాళ్ళను 'సంఘ సంస్కరణ పతాక'లుగా కీర్తించి మద్దతు పలికారు.

అభివృద్ధి పాచికలు.

గిరిజనులు, పితూరీ మీద పితూరీ చేస్తుంటే, ఎదురుదెబ్బలు తిన్న తెల్లవాళ్ళు, 'అభివృద్ధి' పేరిట కొత్తజపం మొదలు పెట్టారు. ఉద్యోగాల ఎర వేసారు. ఆస్తిహక్కు, శాంతిభద్రతలు, చదువుల పేరిట తొండిఆటకు దిగారు. రాతకోతలు ముమ్మరం చేసారు. అమ్మకాలకు కొనుగోళ్లకు రిజిస్ట్రార్ ఆఫీస్‌లు, తగాదాలు తీర్చటానికి కోర్టులు, ఎదురుతిరిగితే అణిచివేసి, శాంతి భద్రతలు కాపాడటానికి పోలిస్ స్టేషన్‌లు పెట్టారు. సందు చూసుకొని ఉద్యోగులు దొంగలెక్కలు రాసి జుట్టు-జుట్టు ముడివేసి తగవులు పెంచారు. రూపాయల చలామణి పెరిగింది. బడులుపెట్టారు.

వస్తుమార్పిడి, సంప్రదాయ సరిహద్దులు, గ్రామసభల తీర్పులు పాటించే గిరిజనులకు, ఈ మార్పులు అంతుపట్టలేదు. 'తాళమువేసితిని -గొళ్ళెము మరిచితిని' అన్నట్లు, ఈ చట్టాలు రికార్డుల చదువు, బడులలో చెప్పకుండా. ప్రభుత్వంలో పెద్దా చిన్నా జనాన్ని దోచుకోసాగారు.

'నీ వేమన్నా కరణానివా, మునసబువా కనిస్తేపువా; నీకు దడిచేందుకు' అన్న చిలకమర్తిమాటలు భయపెట్టి పీడించే ఈ ఉద్యోగుల దౌర్జన్యానికి మచ్చుతునకలు.

ఇటువంటి మూసలో పెరిగిన ఉద్యోగులు, తమ పదవుల డాబు, దర్పం చూపించుకుంటూ, ప్రయోజకత్వం చాటుకుంటూ, ఆటవిడుపుగా రాసే తమసాహిత్యం, చలామణి చేసుకుంటూ, 'నన్ను చూడు -నా అందం చూడు' అంటూ అధికారం చలాయిస్తూ, కళాపోషణ చేస్తూ పేరు తెచ్చుకుంటున్నారు.

ఆత్మవిమర్శ చేసుకునే రచనలు.

సర్వేయర్ గా పనిచేసిన అమృత సంతానం రచయిత తెల్లవాళ్ళు వేసిన సరిహద్దులు, గిరిజన జీవితంలో ఎటువంటి గందరగోళం కలిగించాయో సూచనా మాత్రంగా నన్నా చెపితే బాగుండేది. బెంగాలీ నవల 'వనవాని'లో భూములు, అడవులను సాగులోకి తెచ్చి పన్ను కట్టకలిగిన వారికీ కట్టబెట్టి, అప్పటిదాకా అక్కడి ఫలసాయం ఏరుకుంటూ బతికే వారిని నిర్వాసితులను, నిరాశ్రయులను చేసినందుకు కథానాయకుడు పడే మనోవ్యథ, కొందరికి భూములిస్తే, వాళ్ళు పన్ను కట్టలేక పోవటం, ఆ సొమ్ము సర్దుబాటు చేయటానికి, తను అప్పులపాలు కావటం మనం, మన ఉద్యోగాలు ప్రజలను ఎంత వంచిస్తున్నాయో కండ్లకు కడుతుంది. సర్వే శాఖలో పనిచేసిన గోపీనాథ్ మహంతి 'అమృత సంతానం' తెల్లవాళ్ళు గీసిన సరిహద్దులు గిరిజనసమాజాన్ని ఎటువంటి ఇబ్బందులకు గురిచేసాయో సూచనాప్రాయంగానైనా వర్ణించలేదు. ఒరియా రచయిత కాళింది పాణిగ్రాహి 'మట్టిమనిషి' లో కథానాయకుడు, సర్వేయర్ గా నిజాయితీగా బతుకుతుంటాడు. కాని పైనుంచి కిందివరకు తనలాంటి ఉద్యోగస్తులకు ఇచ్చే జీతం, ప్రజలనుండి గుంజిందే కదా అని తోచగానే, ఆ ఉద్యోగాన్ని వదులుకుని, ఉద్యోగులజోలికి పోకుండా గ్రామసభలు తమ సమస్యలు పరిష్కరించటానికి ఆదర్శంగా నిలుస్తాడు. ఇటువంటి ఆత్మవిమర్శ చేసుకునే రచనలు చాలా అరుదు. అటువంటి రచనలే గిరిజన ప్రాంతాలలో గ్రామసభలను బలోపేతం చేసే పేసా చట్టం అమలులోకి తేగలవు. ఉద్యోగులుగా పనిచేసే రచయితలు, తము తము, ప్రభుత్వం ఏం చేయలేకపోతున్నారో రచనలలో చెప్తే సమాజం తెలుసుకుంటుంది.

(ఇంకాఉంది)

తెలుగులో పేరుపలక (బోర్డు) లేని అంగళ్లలో కొనుగోలు చేయవద్దు. అవి ఎంతపెద్ద వ్యాపార సంస్థలయినా, సంస్థపేరు తెలుగులో తప్పనిసరిగా ఉండాలి.

యాత్రాసాహిత్యం

'ఆమె లేఖలు'

మూల రచన : జూలియా చార్లోటి
అనువాదం : కీ.శే. పెన్నేపల్లి గోపాలకృష్ణ,
డా.కాళిదాసు పురుషోత్తం
9000642079

(గత సంచిక తరువాయి...)

జడ్జి దొరగారిని చూడ్డానికి చాలా మంది స్థానికులు వచ్చిపోతున్నారు. వాళ్లమాటల తీరు, వ్యవహారం చూస్తూంటే తనకెంతో సరదాగా వుందని ఆమె అంటుంది. వారిలో ముస్లిం న్యాయశాస్త్ర వ్యాఖ్యాత 'మునీ' అంటే ఆమెకుయిష్టం. అతను చిరిగిపోయిన కాశ్మీర్ శాలువతో, కాస్త మురికిగా వున్నట్లు కనబడినా, అందంగా, హుందాగా బిచ్చమెత్తుకొంటోన్న చక్రవర్తిలా వుంటాడు. మరో 'హిందూధర్మ శాస్త్ర పండితుడు'– బ్రాహ్మణుడున్నాడు. అతని వాలకం చూస్తూంటే పచ్చి మోసగాడులా వున్నాడని ఆమె అనుకొంటుంది. ఈ యిద్దరు న్యాయశాస్త్రవేత్తల వెంట మరికొందరు వకీళ్లు దుబాసీలుగా, కార్యదర్శులుగా, తాబేదార్లుగా వ్యవహరిస్తూ జడ్జిగారి వ్యాఖ్యలు, ఉత్తరువులను విడమరిచి చెబుతుంటారు. వాళ్లు అప్పుడప్పుడు ఘోరమైన అబద్ధాలాడడానికి కూడా ఏమాత్రం వెనకాడరు. వాటిని ఎ – నమ్మకపోయేసరికి ఆమెతో "Ma Ñam, the Doory (దొర) pleanty cunning gentlyman" అంటూ పళ్లికిలిస్తారు.

"ప్రభుత్వం జిల్లా జడ్జికి తొమ్మిది మంది బంట్రోతుల నిస్తుంది – దర్పంగా కనబడాలని. వాళ్ల పనేమిటంటే, వూరకే నిలబడి వుండడం, జాబులు వగైరా తీసుకెళ్లడం, మా వెనక నడవడం (నేను సహించలేని విషయం), అడ్డమైన పనులూ చేయడం" అని ఆమె వర్ణిస్తుంది. ఒక రోజున ఆయా పాపను అలా తోటలోకి తీసుకెళ్లింది. పసిబిడ్డకు ఎస్కార్టు (రక్షణ) ఎందుకు లెమ్మని ఆమె అనుకొంది కానీ, బంట్రోతు అలా అనుకోలేదు. అతను పాప వెంట ఠంఛనుగా కమాను చేయడం మొదలుపెట్టాడు. పాపం, పాప అతని ఎర్రబెల్టు, డవాలు చూసి బెదిరిపోయింది. జడ్జిగారి వద్ద ఓ వేటగాడున్నాడు. అతను రోజూ అడవికి వెళ్లి ఆ పూట భోజనానికి పిట్టనో, బాతునో, దుప్పినో – తన యిష్టాన్ని, లేదా అదృష్టాన్ని బట్టి కొట్టుకొస్తాడు. ఒక రోజు నెమలిని తెచ్చాడు. "అంత అందమైన నెమలిని కోసి కూరచేయడానికి నాకు మనస్సు ఒప్పలేదు. కానీ యేమిచేయను? వాడు తెచ్చే సరికే అది చనిపోయింది". అని ఆమె అంటుంది. అందమైన లేళ్లను పట్టి తెప్పించి తన ఆవరణలో పెంచాలని వాటిని బాగా మచ్చిక చేయాలని ఆమె కోరిక.

ఎ – కి "ముందున్న జడ్జిగారు సాలెపురుగులా కాస్త స్థలంలో సర్దుకొని, మిగతా యిల్లు శుభ్రం చేయ నక్కరలేదనుకొన్నట్లుంది. నడుస్తూంటే కాళ్లు దుమ్ములో కూరుకపోతున్నాయ"ని ఆమె రాసింది. "ఎ – కోర్టు ఫైళ్ల దుమ్ము దులుపుతూంటే, ఆమె యింటి దుమ్ము దులిపిస్తుంది. పల్లకీ మోసే పిల్లకాయలు యింటి పనులు బాగా చేస్తారు. వాళ్ళచేత యింట్లో మారుమూలల్లో వున్న తేళ్లు, జెర్రులను చంపించి, సాలెగూళ్లు తీయించి, ఇల్లంతా శుభ్రం చేయించాను. పొదలు నరికించి కూరగాయ మొక్కలు నాటించాను. ఇంటిని నా అభిరుచికి తగినట్లు తీర్చిదిద్దాను" అంటుందామె.

రెండు రోజుల క్రితం ఒక యాత్రికుడు వచ్చాడు. అతన్ని జడ్జిగారు ఇంతవరకెప్పుడూ చూడలేదు. "ఐనా అతనొచ్చి ఆశ్రయం కోరగానే, సరే అని, భారతీయ సంప్రదాయం ప్రకారం చక్కని ఆతిథ్యం యిచ్చాం. మంచి వాడే, కానీ చాలా భయస్తుడు. కలరా అంటే చచ్చేంత భయం. "ఈ యాత్రలో అతనొకరాత్రి ఏదో పల్లెలో గడిపాడట. అక్కడ కలరా వ్యాధి వుందని తెలిసి, ఆ రోజంతా వుపవాసం చేశాడట. మా వద్దకు వచ్చేసరికి, భయంతో, ఆకలితో నకనకలాడిపోతున్నాడు. దారిలో దోపిడి దొంగలుంటారని కూడా అతనికి తగని భయం. విశాఖపట్టణం వెళ్ళడానికి బంట్రోతుల్ని తోడు తీసుకెళ్తానంటాడు. మేము నవ్వి వూర్కున్నాం. అతడు అప్పుడే భయంకరమైన అడవిదాటి రావడం వల్ల అలా భయపడడం సహజమే. కానీ మాకు అలాంటి భయాలేం లేవు. మేమిక్కడ క్షేమంగా – ప్రశాంతంగా – స్వదేశంలో వున్నట్లే వున్నాం" అని ఆమె అంటుంది.

ఇక్కడి ఇంగ్లీషువారికి స్వదేశం (Home) అంటే ఎప్పటికీ ఇంగ్లండే! ఇండియాలో తాత్కాలికంగా వున్నవారేకాక, ఇక్కడ స్థిరపడిపోయిన ఇంగ్లీషువారికి కూడా ఇది స్వంతం అనే భావం, బంధం ఏర్పడవు. ముప్పయ్యేళ్లకు పైగా యిక్కడ వున్నవాళ్లు, ఇక ఎప్పటికీ ఇంగ్లాండుకు తిరిగి వెళ్లే అవకాశం లేనివాళ్లు కూడా దీన్ని తమదేశంగా భావించరు" – అని ఆమె వ్యాఖ్యానిస్తుంది.

పదకొండో లేఖ

"థగ్గులను గురించి నీవెప్పుడైనా విన్నావా ?"

రాజమండ్రి ప్రజలలో అంతులేని సంచలనం కలిగించిన ఆ నరహంతకులను గురించి ఆగస్టు 14వ తేదీ ఉత్తరంలో ఆమె యిలా రాస్తుంది –

ఆటవిక జాతికి చెందిన థగ్గుల వృత్తి హత్యలు చేయటం. ఉల్ఫ్ జర్నల్ చివరి సంపుటిలో వీళ్లను గురించి విపులంగా రాశారు, అదంతా అక్షరాలా నిజం.

రాజమండ్రిని కలవలపరచిన థగ్గుల్లో ఒకణ్ణి పట్టుకొని ఎ – యెదుట విచారణకు తీసుకొచ్చారు. కానీ తీరా విచారణ ప్రారంభమయ్యేసరికి ముద్దాయే ఫిర్యాది అయ్యాడు. తనను పట్టుకొన్న ప్యూన్ డబ్బుయిస్తే వదలి పెడతానన్నాడని, కానీ తాను డబ్బు యిచ్చినా వదిలి పెట్టలేదని అతని ఫిర్యాదు. జడ్జి విచారించగా అంతా పచ్చి అబద్ధమని తేలింది. దాంతో ప్యూన్ ని వదిలేసి, థగ్గుని జైలుకి పంపారు.

జడ్జి బంగళాలో పాముల భయం ఎక్కువగా వుంది. ఒక రాత్రి ఇంట్లోకి పాము వచ్చిందని పనివాళ్లు పెద్దగా గోలచేయడం మొదలుపెట్టారు. పెట్టెకింద దాక్కొన్నదని 'మేటి' (Maty) చెప్పగా, అందరూ కర్ర లెత్తుకొని దాన్ని తరుముకొని చివరకు ఎలానో

చంపేశారు. తీరా చూస్తే అది ఏమంత విషసర్పం కాదనితేలింది. మరొకరోజు 'మేటి' గోడౌన్లో పాము వుందంటూ భోజనాలగదిలోకి పరిగెత్తి తలుపులు బిడాయించుకొన్నాడు.

"Sir! One snake Sir! One big Snake is godown!
He very good snake Sir!"

అది భయంకరమైన విషనాగు. నక్కి చూస్తున్నారు. మెట్లకింద నీటిని చల్లబరిచేచోట, సీసాల వెనక దాక్కొంది. జడ్జిగారు తుపాకి కోసం వెళ్లారు. ఆమె మరీ దగ్గరకు వెళ్లకుండా తొంగిచూస్తూ నిల్చుంది. పల్లకీ బోయీలు పాము వెలుపలికొస్తే చంపడానికి కర్రలతో సిద్ధంగా వున్నారు. బంట్రోతులు వాళ్లవెనకచేరి, నక్కి చూస్తున్నారు. అలా పామును చంపడం ప్రమాదం, తప్పించుకున్న దంటే కాటేస్తుందని జడ్జిగారు అందర్నీ హెచ్చరిస్తూ, తానే దాన్ని తుపాకితో కాల్చి చంపేశారు. రెండు రోజులు తర్వాత, తోటలో ఒక చెట్టు తొర్రలో పాము వుందని తెలిసి, జడ్జిగారు తుపాకి సిద్ధం చేసుకొంటూంటే పాములవాడు వచ్చి దాన్ని పట్టుకున్నాడు. వాడుదాని కోరలు తీయకుండానే చక్కగా ఆడించాడు. అది కాటువేయబోయే సరికి దాని మీద గుడ్డవేసి శాంతింపజేశాడు. కాటువేస్తే ప్రమాదమే, ఆ పాముని కొని సీసాలో భద్రపరచాలని ఆశ. అనుకొన్నానే కానీ అతను ఎంతడబ్బు యిస్తామన్నా అమ్మడానికి ఒప్పుకోలేదు.

"అమ్మగారూ! పాముని సీసాలో పెడితే అది చస్తుంది" అన్నాడు పాములవాడు.

"అది నాకు తెలుసుగానీ చచ్చినపామే నాకు యిష్టం" అన్నది ఆమె. పాములవాడికి బతికిన పాము కావాలి.

"బతికిన పాము ఎందుకు ? కాటేస్తుంది." అని ఆమె అంటే, "లేదమ్మా కాటేయదు.

దాన్ని వాడు ఆడిస్తాడు" అని బట్లర్ చెప్పాడు.

మరునాడు పాములవాడు వచ్చితనకు ఇంకో నాగుపాము దొరికిందని చెప్పి, ఆమెకు కావలిస్తే మొదటి పామును అమ్ముతానంటూ ఒక పాత్రలోంచి పామును తీసి ఆ రంగు సీసాలో విడిచాడు. కాసేపటికి అది చచ్చింది. దాన్ని ఆమె టేబిల్ మీద పెట్టుకుంది.

"విష సర్పాలను వాళ్లు మంచిపాము (Good Snakes) అంటూ క్షుద్రదేవతలుగా భావించి పూజిస్తారు. కానీ చంపగలిగితే మాత్రం వదలి పెట్టరు సుమా!" అని అంటుంది.

పాముచూపులోనే క్రూరత్వం వంటి తత్వం, పగ కనబడతాయని, అది ఎంత హానికరమైందో చూడగానే తెలిసిపోతుందని, ముఖాన్ని చూసి మనోభావాలను పసిగట్టేశాస్త్రం (physiogmony) మీద నమ్మకాన్ని అవి బలపరుస్తున్నాయని ఆమె వ్యాఖ్యానిస్తుంది. ఎంత విషసర్పమైతే అంత క్రూరంగా చూస్తుంది. హాని చేయని పాములు సాదాగా వుంటాయి. నాగుపాము మరీ ప్రమాదకరమైనది. దానికళ్లు భయంకరంగా వుంటాయి.

"రాత్రివేళల్లో అప్పుడప్పుడూ నక్కల అరుపులు వినిపిస్తాయి. అవి చాలా జిత్తులమారి జంతువులైనా, పరమ పిరికివి. చిన్నచిన్న జంగుపిల్లుల్ని తప్ప వేటినీ చంపలేవు, కోళ్లగూటిలో దూరి కోళ్లను, ఒక్కోసారి కుక్కపిల్లల్ని, మరీ ఆకలేస్తే గాడిద పిల్లల్ని మాత్రమే చంపుతాయి. ఇవి ఇంగ్లండు నక్కల కంటే ఏమంత భయంకరమైనవి కావు."

జడ్జిగారు అరమైలు దూరంలో ఒక నక్కను పట్టుకొని చంపారు. సాధారణంగా నక్కలు మనుషుల్ని చూసి పారిపోతాయి. కానీ ఆ నక్క ఒక పేద బ్రాహ్మడి మీద పడి బాగా గాయపరచింది. "నేను ఆ నక్క తోక కత్తిరించి పెట్టమన్నాను. ఫ్రాంకకు పంపుతాను. చిరుతపులి చర్మం కూడా వుంది. వాటిని త్వరలో పంపుతాను."

అందమైన సీతాకోకచిలుకలంటే ఆమెకు చాలా యిష్టం. ఐతే వాట్ని పట్టుకోబోతే కాలియో పైరా (గట్టి టెంక, పై భాగం కలిగిన ఆరుద్ర పురుగుల వంటి పురుగులుంటాయని, వాటిలో కొన్ని కుట్రే (ప్రమాదం – అనువాదకుడు) పురుగులుంటాయని భయం, జెర్రులుంటాయని భయం.

"చాలా పనులున్నాయి. ఒకటి వెన్న చిలకడం. ఇక్కడి వాళ్లు సీసాల్లో చిలికి వెన్న తీస్తారు. వడ్రంగి వారం రోజులు కష్టపడి కవ్వం తయారుచేశాడు. చాలా బరువుగా వుంది. వాళ్లు చాలా బరువుగా వుందని మెచ్చుకొంటున్నారు. పాలు కాచడానికి చట్టి తయారు చెయ్యమన్నాను.

"మొన్నకరోజు పుస్తకాల షెల్ఫ్ తయారు చేయమన్నా. వడ్రంగి కొయ్యకోసం చేపలవేటకు వెళ్లాడన్నారు. చేపల వేటకు వెళ్లడమేమిటని ఆశ్చర్యపోయాను కానీ, అది నిజమే! మంచి కొయ్యకావాలంటే నదికి వెళ్లాలట. నదిలో కొట్టుకొచ్చే కొయ్య దుంగల్ని తెచ్చి వాడుకొంటారు!"

రాజమండ్రిలో ఇంగ్లీషువాళ్లు కొద్ది మందే వున్నారు. కమాండింగ్ ఆఫీసరు కెప్టెన్ ప్రెస్, విక్టర్ స్టీవర్ట్ అనే స్కాచ్, సబ్ కలెక్టరు మెక్ డొనాల్డ్. రిజిస్ట్రార్ (ఇక్కడ రిజిస్టర్ అని పలుకుతారు") వుండాలి, కానీ ఆయన స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు. సబ్ కలెక్టర్ కూడా రాజమండ్రిలో వుండడం లేదు. కెప్టెన్ ఫ్రైస్ "పెద్ద మనిషిలా వున్నాడు –" ఆయన భార్యను నేనింతవరకు చూడలేదు. "కమాండింగ్ ఆఫీసర్లను మూడు నెలల కొకసారి బదిలీ చేస్తుంటారు. రాజమండ్రి మద్రాసు వెళ్లే దారిలో వుండడం వల్ల ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూపోతూనే వుంటారు. మిలిటరీ వాళ్లయితే కెప్టెన్ ఫైస్ యింటికి, సాధారణ పౌరులు జడ్జిగారి అతిథులుగా వస్తూంటారు. ఎవరింటికి అతిథులు వచ్చినా ముందు యేర్పాటు చేయాల్సిందే! ఆదారి వెంట వెళ్లే ప్రయాణీకులకు ఎ – చాలా సహాయం చేస్తూంటాడు. సంపన్నులైతే నేరుగా జడ్జిగారింటికి వెళ్తారు. కానీ పేదవాళ్లు ఎండకు ఏ చెట్టు నీడనో గుడారం వేసుకొని విశ్రాంతి తీసుకొంటారు. ఎ – వెళ్లి వాళ్లను పరామర్శించి వాళ్లకేం కావాలో విచారించకపోతే వాళ్లు దారినపోయే దానయ్యల్లా వెళ్లిపోవలసినదే! ఒకరోజు రెజిమెంట్ ను చేరుకోడానికి వెళ్తున్న ఏడుగురు ఇంగ్లీషు సైనికుల్ని ఎ – 'కనుక్కొని' వాళ్లకేమైనా సాయంకావాలేమోనని విచారిస్తే, వాళ్లు తమకేమీ అవసరం లేదన్నారు. ఎ – మరీమరీ అడిగేసరికి కాస్త మంచి ఇంగ్లీషు టీ తయారు చేసుకోడానికి కొంచెం చక్కెర, టీ పొడి కావాలన్నారు. మంచి టీ రుచి చూసి ఎన్నాళ్లయిందో వాళ్లకే గుర్తులేదట! వాళ్లకు దండిగా టీ, దాంతోపాటు బైబిల్ మొదలైన పుస్తకాలు కూడా పంపారు. రాజమండ్రిలో బ్యారెక్స్ సార్జెంటుగా పదేళ్ల నుండి ఓ

ముసలిదొర వున్నాడు, ఆయనంటే అందరికీ గౌరవం. అతనికి తక్కువ కులానికి చెందిన భార్య, కుమారుడు వున్నారు. ఆ పిల్లవాడు కూడా జబ్బుగా వుంటాడు. ఐనా వాళ్లు సంతోషంగానే జీవిస్తుంటారు. ఆయనకు ఎ – పుస్తకాలు, వార్తా పత్రికలు యిస్తుంటారు. ఆయన ప్రతి సోమవారం ఎ – ఇంటికొచ్చి పుస్తకాలు తీకొని కాసేపు కబుర్లు చెప్పి వెళ్తుంటాడు. అప్పుడప్పుడు యూరోపియన్లతో కాలక్షేపం చెయ్యడం ఆయనకు ఎంతో యిష్టమట. ఇంగ్లీషు రాణి ఇబ్బందుల నెదుర్కొంటున్నదని జాలిపడుతూ, తను పరిస్థితుల్ని అంత చిన్నవయసులో ఎలా సమర్థించుకో గలుగుతుందో నంటాడు.

జడ్జిగారి సామాన్లు గతవారం దిగాయి. పల్లకీబోయీలు తడిసిపోయిన వస్తువులను ఎండకు ఆరపెట్టి బాగుచేశారు. ఆమె ఒక రోజంతా పుస్తకాలు సద్దుకొంది – నేలంతా దుమ్ము. ఆమె ఆ దుమ్ములోనే కూచుని పుస్తకాలు సద్ది, షెల్ఫ్ లో అమరుస్తుంటే మిసెస్ ఫ్రైస్ వచ్చింది. "చక్కగా ముస్తాబు చేసుకొని వచ్చిన మిసెస్ ఫ్రైస్ నన్ను చూసి అసహ్యించుకోకుండా వుండాలంటే నాకు చటుక్కున ఓ ఉపాయం తోచింది. కొత్త పుస్తకాలు ఉన్నాయి, చూడమన్నాను. దాంతో ఆమె నా పక్కనే కూచొని పుస్తకాలు చూడడం మొదలు పెట్టింది. మిసెస్ ఫ్రెస్ వయసులో వున్న అందగత్తె. ఆమె పొరుగున వుండడం నాకెంతో సంతోషంగా ఉంది. ఇంగ్లీషు వనితలు స్నేహానికి అందుబాటులో ఉండడం సంతోషమేకదా!"

రాజమండ్రి బాగుంది, మద్రాసుకంటే ప్రశాంత వాతావరణం. తనకు నచ్చిందని, బాగుందని ఆమె అంటుంది. ఇంగ్లండ్ లోలాగా మద్రాసులో చెమట ఎక్కువ. రాజమండ్రిలో చల్లనిగాలి, చక్కని పల్లెవాతావరణం. స్నేహితులు ఇబ్బంది పెట్టేంత ఎక్కువ మరీ వుండరు. మరీ ఒంటరిగా అనిపించేంత తక్కువగానూ లేరు. ఆమెకు చేతినిండా పని, ఎప్పుడూ బద్ధకంగా వుండదు. "ఇంగ్లంలో లాగా కాదు, ఇక్కడ తెల్లవారుఝామున్నే నిద్రలేచినా, వ్యవధి చాలదు. ఉదయం షికారు వెళ్లడం, మధ్యాహ్నం కాసేపు కునుకు తీయడం తప్పనిసరి. సాయంకాలం గూడా షికారుకెళ్తాం. తిరిగి వచ్చేసరికి అలసిపోయి, ఇక ఏ పనీ చేయడానికి నాకు బుద్ధిపుట్టదు. అలసిపోవడం, విశ్రాంతి తీసుకోడంలోనే, నాకు కాలమంతా గడచిపోతున్నట్టుంది!"

"ఈ రోజు పెద్ద జమీందారు ఒకరు ఆయన్ను రాజా అంటారు – మమ్మల్ని చూడ్డానికి వచ్చారు. ఆయనకు ఈ జిల్లాలో ఎస్టేట్ వుంది. ప్రభుత్వానికి ఏటా పది వేల రూపాయలు శిస్తు చెల్లిస్తాడు. దర్జాగా వుంటాడు. ఐతే ఆయనకు కోర్టులో కొన్ని వ్యాజ్యాలున్నాయి. అందువల్ల ఏదో చెత్తంతా మాట్లాడాడు. ఇక్కడి వాళ్లందరూ అంతే! చదువు లేకపోవడం వల్ల వీళ్ల తెలివితేటలు బొత్తిగా నిరుపయోగమవుతున్నాయి."

స్థానికులకోసం ఒక ఇంగ్లీషు స్కూలును స్థాపించాలని ఎ – చాలా ఆతురతగా వున్నారు. అందులో ఉపాధ్యాయుడుగా పని చేయడానికి సార్జెంట్ కీలింగ్ ఒప్పుకొంటే స్కూలు మొదలు పెట్టవచ్చు. కానీ కీలింగ్ తనకు ఆపాటి విజ్ఞానం లేదంటాడు.

ఈ వుత్తరాన్ని రాయడానికి ఆమెకు నెలా పది రోజులు పట్టింది. ఆగస్టు 14వ తేదీ మొదలు పెట్టి మధ్యలో ఆపానంటుంది.

ఈ జాబు ముగించే లోపలే ఆమెకు ప్యాకెట్ అందుతుంది. "మరొకరి ద్వారా నీవు పంపిన ప్యాకెట్ అందింది. పదిహేను రోజుల కిందట జాబులు కూడా చేరాయి. ప్రయివేట్ గా పంపే ఉత్తరాలు ఎప్పుడూ ఆలస్యంగా అందుతాయి. అది తెచ్చేవాళ్లు తమపనులన్నీ పూర్తి చేసుకొని కానీ వాటిని మనకు అందజేయరు" అంటుంది.

(తరువాయి వచ్చే సంచికల)

కవిత

తుంటరి శత్రువు

గందర గోళంతో విందింది భూగోళం
కనిపించని శత్రువుతో పోరాటం
ప్రజలు ఆందోళనతో నిండిపోయారు
భయం గుప్పెట్లో మునిగి పోయారు
కిలాది కరోనా కరాళ నృత్యం
వికాటట్ట హాసం తాండవం చేస్తుంది
తుంటరి శత్రువుకి ఒంటరితనం ఆయుధం
శానిటైజర్లు, మూతికి చిక్కాలు అస్త్రాలు
కదలక నిత్యం నిలిచే కొండలాంటి ధైర్యం ఉండాలి
పలకరింపులు చేతి స్పర్శలకు అడ్డు వేయాలి
మూడడుగుల దూరం పాటించడమే మన కర్తవ్యం కావాలి
మనమందరం ఇప్పుడు గదుల్లో ఒంటరి ఖైదీలం
స్వేఛ లేని బడుగు జీవులం
ప్రయాసపడే మూగ జీవులం
ప్రయత్నం మాత్రమే మిగిలిన ఆశా జీవులం

డా. బి. జ్యోతి స్వరూపరాణి
98482 11664

రచయితులకు సూచన:

ప్రతి నెల 15వ తేదీ లోపు
మాకు చేరిన రచనలను మాత్రమే
ఆ నెలలో ప్రచురణకు పరిశీలించగలుగుతాము.
దయచేసి గమనించ ప్రార్థన
–సం.

తెలుగులో పేరు పలక (బోర్డు) లేని అంగళ్లలో కొనుగోలు చేయవద్దు.
అవి ఫ్లెక్సీలయినా, ఎంతపెద్ద వ్యాపార సంస్థలయినా తెలుగులో ఉండాలి

డా॥ మధురాంతకం నరేంద్ర
9866243659

జావళీల జోరు

కర్ణాటక సంగీతానికి పుట్టిల్లు తిరువారూరు అనుకుంటే, దానికి రాజధాని మదరాసు అనుకుంటే, దాని మాతృభాష మాత్రం తెలుగే అవుతుంది. సాదిర్, దాసీ ఆట్టం అని పిలుస్తూవుండిన దక్షిణాత్య నాట్యాన్ని, దానిలోని శృంగారపు పొంగుల్ని తగ్గించి (కొందరు విదుషీల మాటల్లో చెప్పాలంటే, కడిగి శుభ్రపరచి భారతనాట్యమనే పేరుతో చలామణీలోకి తెచ్చినా, ఆ నాట్యానికి కావల్సిన కృతులు మాత్రం తెలుగు భాషలోనే యెక్కువుగా వున్నాయి.

1900వ సంవత్సరపు ప్రాంతాల్లో తంజావూరు, మధురై ప్రాంతాల నుంచీ సంగీతమూ, నాట్యమూ, మదరాసుకు తరలి రావడం ప్రారంభమైంది. మదరాసు నగరంలోని ధనవంతులైన వర్తకులంతా సంగీతకచేరీలనూ, నాట్య ప్రదర్శలనూ ప్రాణం పెట్టి పోషించ సాగారు. 1927కే మదరాసు సంగీత అకాడమీ పుట్టుకొచ్చింది. అప్పుడే బలపడుతున్న కాంగ్రెస్ స్వాతంత్ర్య పోరాటానికి వువనదిలా సంగీతనాట్య ప్రదర్శనలూ, కచేరీలూ కొనసాగాయి. 18వ శతాబ్దంలో బ్రహ్మణులు పెంచి పోషించిన కర్ణాటక సంగీతం, 19వ శతాబ్దంలో దేవదాసీల చేతుల్లో యెదిగి, 20వ శతాబ్దం వచ్చేసరికి మదరాసులో బ్రాహ్మణులు, దేవదాసీ కులాల మధ్య జరిగిన ప్రచ్ఛన్న పోటీలో రాటుదేలింది. భరతనాట్యమని యిప్పుడు పిలుస్తూన్న సాదర్, దేవదాసీల ఆట్టంకు దేవదాసీల అనుబంధకులమైన నట్టువార్ల కులంలో పుట్టిన తంజావూరు చతుష్టయమని పిలిచే పొన్నయ్య, చిన్నయ్య, వడివేలు, శివానందం అనేవాళ్ళు ఆధునికరూపాన్ని, ప్రాచుర్యాన్ని తీసుకొచ్చారు.

1930–35 ప్రాంతాల్లో కర్ణాటక సంగీతాన్నీ భాతరనాట్యాన్నీ శుభ్రపరచాలనే పెద్ద వుద్యమాలు చుట్టుకొచ్చాయి. సంగీత కచేరీల్లో శృంగారరస ప్రధానాలయిన జావళీలను పూర్తిగా విడిచిపెట్టాలని కొందరు వాదించసాగారు. అలాగే నాట్యంలోనూ అంతవరకూ పెద్ద పీట వేస్తున్న శృంగార, కామపూరితమైన జావళీలను విస్మరించాలనే అభిప్రాయం బలపడసాగింది. అయితే యింత పెద్ద యెదురు దాడుల్ని తట్టుకుని జావళీలు మాత్రం యింకా ప్రాచుర్యంలోనే వున్నాయి. యిందుకున్న కారణాలను తరచి చూడాలనే వాళ్ళకు మానవ మనస్తత్వమనేదొక గొప్ప సవాలుగా మాత్రమే తయారవుతుంది.

తెలుగులో పాడటానికి అనువుగావుండే గేయాలను కృతులు, కీర్తనలు, తత్వములు, జావళీలు, పదములు, పాటలు అని ఆరు రకాలగా విభజిస్తారు. వీటిలో కృతులూ, కీర్తనలూ, భక్తి ప్రధానమైనవి. తత్త్వములు, వేదాంతరచనలు, పాటల్లో అన్ని రకాలు వుంటాయి. పదములు, జావళీలు అభినయ ప్రధానమైనవి.

పదకవితా పితామహుడైన అన్నమయ్య కాలం నుంచీ పదములూ, తరువాయూరు సంగీత త్రిమూర్తులు త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితుల కాలంనుంచీ కీర్తనలూ ప్రాచుర్యంలోకి వచ్చినా జావళీలు మాత్రం 19వ శతాబ్దపు తొలిదశాబ్దాల నుంచే విరివిగా పుట్టుకొచ్చాయి.

భారతదేశపు సామాజిక చరిత్రలాగే జావళీల చరిత్రకూడా మంచిచెడ్డల పరుగూ పేకల కలనేతే ! దేవదాశీలకున్న యీనాం భుములన్నీ పోయాకా, బీదరికంలో పడ్డాక, పోషకుల్ని వెతుక్కోవలసివచ్చుకా, వాళ్ళని ఆకర్షించడం కోసం ఇటువంటి శృంగార ప్రధానమైన నాట్యాల్ని వాటికి అనుగుణమైన పాటల్ని తయారు చేసుకున్నారన్నది ఒక వాదన. అయితే శృంగార ప్రధానమైన పదములు, తెలుగులో అంతకుముందు నుంచే వున్నాయి. ప్రముఖ సంగీత విమర్శకులు వి.యే.కే. రంగారావు గారు త్యాగరాజ కీర్తనలు ''ఎంత ముదో, ఎంతసొగసో'', ''చిన్న నాడే నాచేయి పట్టితివి '' '' ఎందుకౌగలింతురా '' జావళీలే అని అంటారు. ఆ కీర్తనల్లో శృంగార ప్రధానమైనవి, మాత్రగాకుండావే, దాదావుగా అన్ని జావళీల ప్రధాన లక్షణమైన పల్లవీ, చిన్నచరణాలూ వుంటాయి. శృంగార ప్రధానాలయిన యీ కీర్తనలో, పదాలో, విరివిగా ముందుపుట్టి, ప్రాచుర్యం కచ్చాక వాటికి జావళీ అనే పేరువచ్చివుండవచ్చుననే ఆయన వాదన కూడా సబబుగా కనిపిస్తుంది.

జావళీ అనే పదం పుట్టుకను గురించి గూడా చాలా అభిప్రాయాలున్నాయి. అవి ప్రదర్శించే ప్రదేశమైన చావడి అనే మాటనుంచి జావళీ అనే పదం పుట్టివుంటుందని కొందరు వ్రాస్తే, జావళి అనే మన్మధుడి వింటినారి పేరు యిలాంటి పాటలకు తగినదే అని యింకొందరంటారు. జయదేవుని అష్టపదుల్లోనూ, అన్నమాచార్యుని శృంగార కీర్తనల్లోనూ, క్షేత్రయ్య నదాల్లోనూ శృంగారపుపాలు యెక్కువే అయినా, వాటి అర్థం జనసామాన్యానికందకపోవడంతో వాటికున్న గౌరవం పలచబడలేదనే మరికొందరు వాదిస్తారు. కీర్తనలంత గాఢత లేకుండా సరదాగా అందరినీ అలరించేలావుండడం, భక్తీ వైరాగ్యాలతో సంబంధం లేకుండా, సాదాసీదా మనుషులకు వేడుకగావుండేలా వుండడం జావళీల ప్రధాన లక్షణాలని తెలిసివస్తోంది.

శృంగారం, కరుణ, అద్భుతం, హాస్యం, భయానకం, భీభత్సం, రౌద్రం, శాంతి, అనే యీ నవరసాల్లో మొదటిదైన శృంగారరసం ప్రముఖంగా వుండే రచనలు చేయడం కత్తిమీద సాము లాంటిపని. తాను సేవించే దేవుడూ, దేవేరుల శయనలీలల్ని గురించి రాసిన శృంగార సంకీర్తనల్లోనూ గొప్ప సంయమనాన్నీ, భక్తినీ మాత్రమే వెల్లడించే భావాలనే నింపిన అన్నమాచార్యుడిలా శృంగార రసస్ఫూ రకమైన



తంజావురు చతుష్టయంలో వొకరైన చిన్నయ్య (1802–1856) రాసిన తెలుగు జావళీలను చదివినప్పుడైనా తెలుగువాళ్ళు తమ వేర్లు తంజావూరును దాటి కన్యాకుమారిదాకా, యింకా మాట్లాడితే శ్రీలంక వరకూ వున్నాయని తెలుసుకోగలగాలి. తమిళనాడు దక్షిణపు కొసలోవుండే రామనాథపురం వాస్తవ్యులైన శ్రీనివాస అయ్యంగార్ గూడా జావళీలుంటే తెలుగులోనే అనుకున్నాడు

రచనలు చేసిన వాళ్లెవరూ కనిపించరు. జావళీలలోని శృంగారాన్ని కొలవడానికి యిదివరకూ మనముపయోగించిన కొలబద్ధలేవీ వుపయోగపడవు. వాటిని చూసేవారి, వినేవారి, ఆనందించేవారి స్వభావాన్ని బట్టి అవి వుండగలిగే 'ప్లాస్టిక్ స్వభావం' వాటికుండడమే వాటి విశిష్టత (కాకపోతే బలహీనత!).

1940 ప్రాంతలలో మదరాసు సంగీత ప్రపంచంలో తమిళ సంగీత ఉద్యమమనే కొత్త పోరాటం పొడుచుకొచ్చింది. కర్ణాటక సంగీత కచేరీల్లో కీర్తనలన్నీ తెలుగులోనే పాడుతున్నారనీ, తమిళాన్ని బండ భాషగా, అసంగీతాత్మక భాషగా భావిస్తున్నారనీ తమిళ సంఘాలన్నీ, పెద్దగా గొల్లు మన్నాయి. తిరువాయూరు త్రయం పుట్టక ముందునుంచీ కర్ణాటక సంగీతముందనీ, తమిళులు రాసిన కీర్తనలనెందుకు నిరాదరణ చేస్తున్నారనీ వాళ్ళు విరుచుక పడ్డారు. ప్రఖ్యాత కర్ణాటక విదుషి యం.యస్. సుబ్బలక్ష్మి పైన జావళీలు పాడవద్దనీ, తమిళ కీర్తన యెక్కువగా పాడమనీ ఆమె భర్త సదాశివం పెట్టిన ఆంక్షలు యీ గొడవలకంతా వొక వుదాహరణ మాత్రమే, అయితే యీ ఆటుపోట్లనంతా తట్టుకుని కర్ణాటక సంగీతం తెలుగునే యింకా తన మతృభాషగా గౌరవిస్తోంది. యిందుకు తమిళ సోదరుల సంయమనమూ, నాగరకతే కారణం. మదరాసు పూరిటన్ల విమర్శనలను తట్టుకుని జావళీలు కూడా,తమ ప్రాచుర్యాన్ని పెంచుకుంటూనే పోతున్నాయి. ఇందుకు కారణాలైన గొప్ప లక్షణాలు జావళీలలో ఉన్నాయని తరచి చూడాల్సిన అవసరం ఇప్పుడేర్పడింది.

జావళీలన్నిటిలోనూ ఓ స్త్రీ తన ప్రియుడి ప్రేమ కోసం, సమాగమనం కోసం తపన పడుతూ ఉంటుంది. చిత్రమైన విషయమేమిటంటే ఈ జావళీలు రాసిన వాళ్ళందరూ పురుషులే ! మచ్చుకైనా వో స్త్రీ కూడా లేదు. యీ పురుష కవులందరూ స్త్రీల ఆత్మల్లోకి దూరి, ఆయా స్త్రీలుగా మారి వాళ్ల ఆత్మగతమైన విరహాల్ని అద్భుతంగా అక్షరీకరించారు. వాటిని పురుషస్వామ్య ధోరణుల కొనసాగింపుగాను, వొక సామాజిక రుగ్మత చిహ్నాలుగాను, విమర్శకులు గుర్తించడంలో ఆశ్చర్యమేముంది. భగవంతుడ్నీ, ప్రపంచాన్నీ, ప్రకృతీ పురుషులుగా భావించే కాలం నుంచి, భక్త కవులందరూ తమని గూడా గోపికలుగా నమ్మిన రోజునుంచి వస్తున్న ధోరణే యిదయినపుడు, జావళీలను మాత్రం ఇంకో గాటిలో కట్టడంలో ఔచిత్యమెంత ఉంది.? ఇవన్నీ ఆసక్తికరమైన ప్రశ్నలే ! అయితే రసికులైన ప్రేక్షకులు మాత్రం స్త్రీ పురుష భేదాల్లేకుండా జావళీలను అదరిస్తూనే ఉన్నారు.

జావళీలు రాసినకవుల్లో వొకరిద్దరు మాత్రమే యిప్పటి తెలుగు రాష్ట్రాల వాళ్ళు గావటం. మిగిలిన వాళ్ళందరూ (ప్రసిద్ధులైనవాళ్ళే ముప్పయిమంది పైగా వున్నారు) ఇప్పటి తమిళ, మలయాళ రాష్ట్రాల వాళ్ళుగావడం గమనించినప్పుడు మనం తెలుగును యీ రెండు రాష్ట్రాల పరిధిలోకి కుంచింపజేసి బోన్సాయీ వృక్షాలమైపోయామని అర్థమవుతుంది.

ప్రముఖ కర్ణాటక విద్వాంసుడు, వాగ్గేయకారుడు, తిరువాన్కూరు సంస్థాన పాలకుడూ స్వాతి తిరునాళ్ తెలుగులో జావళీలు రాశాడు. త్యాగరాజు శిష్యుడు మానాంబుబావడి వెంకట సుబ్బయ్య శిష్యుడు – తంజావూరునివాసి పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ తెలుగు జావళీలు ప్రసిద్ధాలు. యిక జావళీలంటేనే ధర్మపురి సుబ్బరాయర్ గా ఆయన పేరంటేనే జావళీలుగా పేరుపడిన ధర్మపురి సుబ్బరాయన్ ను సుబ్బారావని పిలవడంలో అవుచిత్యం లేక పోలేదు. ఆయన తన అభిమాన స్త్రీ అసమాన్య విదుషీమణీ వీణధనమ్మ కోసమని, ఆమె యింట్లోనే వుంటూ రాసిన జావళీలలో దొరికినవన్నీ ప్రసిద్ధాలే ! వీణధనమ్మ గారి కూతురు జయమ్మ గాత్ర సహకారంతో జయమ్మగారి కూతురు బాలసరస్వతి జావళీల నాట్య ప్రదర్శనలకు ప్రపంచ ప్రఖ్యాతిని తీసుకొచ్చి పెట్టింది. ధనమ్మగారి మనవరాళ్ళు బృంద, ముక్తలు తమకచేరీల్లో జావళీలకు పేరుప్రతిష్టల్ని తెచ్చారు.

తంజావూరు తాలూకా కార్యాలయంలో గతశతాబ్ది మొదటి దశకంలో గుమాస్తాగా పనిచేసిన తిరువప్పనందాళ్ పట్టాభిరామయ్య పేరులోలాగే, ఆయన జావళీల్లోనూ తెలుగే గుబాళిస్తోంది. తంజావురు చతుష్టయంలో వొకరైన చిన్నయ్య (1802–1856) రాసిన తెలుగు జావళీలను చదివినప్పుడైనా తెలుగువాళ్ళు తమ వేర్లు తంజావూరును దాటి కన్యాకుమారి దాకా, యింకా మాట్లాడితే శ్రీలంక వరకూ వున్నాయని తెలుసుకోగలగాలి. తమిళనాడు దక్షిణపు కొసలోవుండే రామనాథపురం వాస్తవ్యులైన శ్రీనివాస అయ్యంగార్ గూడా జావళీలుంటే తెలుగులోనే అనుకున్నాడు.

కోలారులో పుట్టి మైసూరురాజుల ఆస్థానంలో జీవితాన్ని గడిపిన బెంగుళూరు చంద్రశేఖరశాస్త్రి, బెంగుళూరులోని తెనుగుపేటలో నివసించిన సంగీతం వెంకటరమణయ్య అనే కన్నడ ప్రాంతీయులకయితే తెనుగు మాతృభాషతో



సమానమే గాబట్టి వాళ్లూ తెలుగులోనే జావళీలు రాశారు.

విజయనగర ఆస్థాన విద్వాంసులయిన తచ్చూరు శింగరా చార్యులు, తచ్చూరు చిన శింగరా చార్యులూ, బెల్లపిల్ల వేంకట శాస్త్రి గారిచేత రెండవ శ్రీనాధుడని కీర్తించబడిన దాసు శ్రీరాములూ లక్కవరం జమిందారు మంత్రిప్రగడ భుజంగరవూ తెలుగు ప్రాంతాల వాళ్లూ జావళీలు రాశారు లెమ్మని వూరడించడం కోసమన్నట్టుగా జావళీలు రాశారు. యిక నాటర్కావుత్తర ఆరాటు ప్రాంతానికి చెందిన విద్యల తిరుపతి నారాయణ స్వామి నాయుడూ, వుంగునూరులో వుట్టిన చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్లైలు జావళీలు రాయడం కొత్తనీటిలో చేపపిల్లలు యీదినంత సహజంగా జరిగిన పనే!


ఆధునికులూ గొప్ప జావళీలు రాయగలరని మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, వింజమూరి వరదరాజయ్యంగారూ, తెల్లాకుల వేంకటేశ్వర గుప్తా, భూసురపల్లి వేంకటేశ్వర్లుగారు నిరూపించి చూపెట్టారు.

యీ కొవలో జావళీల గురించి మాట్లాడుతున్నప్పుడు ప్రత్యేకంగా పేర్కొనవలసినవాళ్లు మల్లాది రామకృష్ణ శాస్త్రి, వి.ఏ.కె. రంగారావు గార్లనే గురుశిష్యులు. మల్లాది రామకృష్ణ శాస్త్రి గారి ఆనందలహరి, గంగాలహరి మొదలైన అనేకానేక కథల్లోని సానులు తెలుగు పాఠకలోకనికి చిరపరిచితులు. మల్లాది రామకృష్ణశాస్త్రి గారు దాసీల దగ్గర సేకరించిన జావళీలను యిటీవల యశోదా ఠాకూర్ గారి సంపాదకత్వంలో గుంటూరు సంస్కృతి సంస్థ వాళ్ళు ప్రచురించిన 'కేళీగోపాలమ్'లో ముద్రించి తెలుగువాళ్ళకు సమర్పించారు. ఆధునిక సంగీత లోకంలో జావళీలకు తగితంత గౌరవమర్యాదల్ని సమకూర్చడమే బాధ్యతగా గుర్తించిన వి.ఏ.కే.రంగారావుగారు స్వంతంగా జావళీలను గూడా రాశారు.

మదరాసు సాంస్కృతిక జీవితంలోకి జావళీలను గౌరవప్రదంగా ప్రవేశపెట్టిన కీర్తి తంజావూరునుంచీ వచ్చి మదరాసులో స్థిరపడిన గొప్ప విదుషి వీణధనమాంబ కుటుంబానికి, ప్రతేకించి ప్రఖ్యాత నర్తకీమణి తంజావూరు బాలసరస్వతికి దక్కుతుంది. సంగీత నృత్యాల్లో వెలలేని ఆభరణాలుగా వెలిగిన ఆ కుటుంబం సాధారణమైన ప్రాపంచిక ధన సంపదల కోసం వెంపర్లాడడు మెప్పుడూ జరగలేదు. వోసారి వాళ్ళకు టుంబుం బాగా బీదరికంలో పడిపోయిందట. "అప్పుడు ధర్మపురి సుబ్బరాయర్ మాకో పెద్దగంపతో సంపదను పంపించారు. ఆగంపలో వున్న సంపదే 'జావళీ'. ఆయన రాసిన 'సఖీ ప్రాణ' అనే జావళీ ఆయన మాకిచ్చిన గొప్ప మణుల్లో చివరిది" అని బాలసరస్వతి తల్లి జయమ్మగారోచోట అంటారు.

1900 నుంచి దాదాపు యేడెనిమిది దశాబ్దాల పాటూ మదరాసు నగరంలో కర్ణాటక సంగీతమూ, భరతనాట్యమూ స్వర్ణయుగాన్ని అందుకున్నాయి. ఆధునికమనే పేరుతో యెన్నో మార్పులొచ్చినా, యిప్పుడుకూడా మదరాసులోని పాతికపైగా గానసభలు సంగీత కచేరీలనూ, భరతనాట్య ప్రదర్శనలను అదొక బాధ్యతగా, గౌరవంతో నిర్వహిస్తూనే వున్నాయి. యిప్పుడు కూడా అక్కడ జరుగుతున్న భరతనాట్య ప్రదర్శనల్లో జావళీలకు తప్పనిసరిగా ప్రముఖ స్థానాన్నిస్తున్నారు. **ప్రత్యేక భాషారాష్ట్రం పేరుతో తెలుగువాళ్ళు తెలుగుభాషను రాష్ట్రాల పరిధుల్లో కుంచింపజేయడంతో బాటూ కర్ణాటక సంగీతాన్నీ, భరత నాట్యాన్ని గూడా మదరాసుతోబాటూ అక్కడే వదిలి పెట్టివచ్చేశారు. శృంగార ప్రధానమైన జావళీలకు సాహిత్య, ప్రదర్శనా గౌరవాలివ్వాలా వద్దా, మొదలైన సాంస్కృతికమైన ప్రశ్నలు తెలుగు వాళ్ళకు పాపం పట్టవు. అయితే మదరాసులో యిన్ని ప్రతికూలతలున్నా జావళీలు బతికి పట్టు బట్టలే కట్టుకున్నాయంటే, అందుకు తమిళ సోదరుల సాంస్కృతిక చైతన్యంతో బాటూ, జావళీలలోని గొప్పతనమూ, జావళీలకు తగినంత సొబగైన భాషగా తెలుగుకున్న అనితరసాధ్యమైన మాధుర్యమూ కారణమని యెప్పుడో వొకనాటికయినా తెలుగువాళ్ళకు తెలియకపోదన్న ఆకాంక్ష మాత్రమే యిప్పుడు మిగిలింది.**

యీ ఆకాంక్ష కేవలం నీటి మీది రాత మాత్రమే కాదనడానికి సాక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సాంస్కృతిక సంస్థ సహకారంతో గుంటూరు అన్నమయ్య గ్రంథాలయం వాళ్ళు 2017లో మోదుగుల రవికృష్ణగారి సంపాదకత్వంలో జావళీలు మొదటి భాగాన్ని ప్రచురించారు. గుంటూరు సంగీత సాహిత్య నాట్య నాటక సంస్థ సంస్కృతి వాళ్ల శ్రీమతి యశోదాఠాకోర్ సంపాదకత్వంలోమల్లాది రామకృష్ణశాస్త్రి గారు రాసుకున్న జావళీలను వి.ఎ.కే. రంగారావుగారు రచనలైన జావళీలను కేళీగోపాలమ్ అనే పుస్తకంలో ప్రచురించారు. ఈ రెండవ పుస్తకం ప్రచురణ వెనకాలకూడా మోదుగుల రవికృష్ణగారి హస్తమేవుండడంతో యిది గూడా మొదటి పుస్తకమంత సురభిళంగా రూపొందింది. యీ రెండు పుస్తకాల ప్రచురణల రూపకల్పులందరికీ అభినందనలు చెప్పడం యిప్పుడు మన కనీస బాధ్యత.




"ఒక బిడ్డ మాతృభాషలో ఒక సంవత్సరం నేర్చుకున్న విద్య పరాయి భాషలో నేర్చుకోవడానికి నాలుగేళ్ళు పడుతుంది"

–విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్

పుస్తక సమీక్ష

పరిమితం

(కథలూ, వ్యాసాలూ, సమీక్షలూ, జ్ఞాపకాలూ)



రచన : సింగమనేని నారాయణ
వెల : రూ. 125
ప్రచురణ : అమరావతి పబ్లికేషన్స్ గుంటూరు.
ప్రతులకు: నవోదయ, నవచేతన హైదరాబాదు, విశాలాంధ్ర విజయవాడ

దగాపడ్డ సీమరైతు కడగడ్లను అత్యంత వాస్తవికంగా అక్షరబద్ధంచేసే కథనుకుని పేరు తెచ్చుకున్న సింగమనేని నారాయణ చేసిన కొన్ని రచనల సంకలనం ఈ 'పరిచయం' పుస్తక ఇందులో నారాయణ తాజాగా రాసిన (2017-2019) రాసిన ఐదు కథలూ, వివిధ అంశాలపై రాసిన ఆరు వ్యాసాలు, వివిధ రచనలు, కథా సంకలనాలు,కథకులు మొ॥ అంశాలపై దిన, మాసపత్రికలలో ప్రచురితమైన 16 సమీక్షావ్యాసాలు ఉన్నాయి.


కథలలో వస్తువులుగా-ప్రపంచీకరణ ప్రభావంవలన సంపాదనే ధ్యేయంగా పరుగులెత్తే మధ్యతరగతి జీవితాలు (వెయ్యి కాళ్ళజెట్టి), కొడుకు ఉద్యోగంకోసం లంచం ఇవ్వడానికి యిష్టపడక యింటికి దూరంగా వెళ్ళిపోయే ఒక ఆదర్శజీవి వెంకటరత్నం (రైలు వెళ్ళిపోయింది), ఆంగ్లభాషపై మోజుతో మాతృభాష తెలుగుని దూరం చేసుకోవటం సాంస్కృతిక దోహమనీ (మనరాలి ప్రశ్న) లో పురుషాధికం ఉన్న భర్తలో మార్పుకోసం చిన్న నాటకమాడే విద్యావతి ఉద్యోగస్థురాలయిన భార్య అరుణ (మరో దిద్దుబాటు), ఇక పెళ్ళిచూపులకు వధువే, వరుని ఇంటికి తరలి వెళ్ళటం చేసిన ఆధునిక భావాలు కలిగిన సమీరకథ (హేమంతసమీరం) -ఇవన్నీ సమకాలీన సమాజంలో మనం చూస్తున్న వాస్తవికతకు అద్దంపట్టే కథలు సామాజిక సమస్యలు, పరిణామాలు సంక్లిష్టతలేకుండా సరళమైన శైలిలో చెప్పబడిన కథలు ఆసక్తికరంగా చదివింపజేస్తాయి. ఆరువ్యాసాలలో రచయితకు గల విషయ పరిజ్ఞానం, అధ్యయనశీలతమనకు స్పష్టంగా కనిపిస్తుంది. సాహిత్యపఠనం, గురజాడ వర్ధంతి సందర్భంగా రాసిన నిందాస్తుతిపూర్వక సంభాషణ 'మాటా-మంతీ', 'రాయలసీమ కథావికాసం' లో రాయలసీమ కథకుల గురించిన విమర్శనావ్యాసం, కాళీపట్నం రామారావుపై రాసిన 'అప్రజ్ఞాతం', ప్రఖ్యాత విమర్శకుడు, చిత్రకారుడు, తాత్వికుడు సంజీవదేవ్ శతజయంతి సందర్భంగా రచయిత చేసిన అధ్యక్షోపన్యాసం ప్రసంగవ్యాసం రచయిత ప్రతిభను ప్రదర్శిస్తున్నాయి.


'వందేళ్లకథకు వందనాలు' (గొల్లపూడి సంపాదకత్వం), 'శత వసంతాల తెలుగుకథ' (విశాలాంధ్ర ప్రచురణ), ప్రఖ్యాత హిందీ, నవలా రచయిత ప్రేమ్‌చంద్, ఆయన రాసిన 'గోదాన్' నవల, మహీధర రామమోహన రావు 'కత్తులవంతెన' నవల, చిదంబరరెడ్డి ఆత్మకథ 'బతుకు వెతుకులాట' ఇలా 16 అంశాలపై నారాయణ రాసిన సమీక్ష వ్యాసాలు రచయిత సాహిత్య అభినివేశానికి, విషయపరిజ్ఞానానికి అద్దంపట్టేవిగా ఉండటంతో సమీక్షలు చదివిన పాఠకులలో ఆ పుస్తకాలను సంకలనాలను తప్పకుండా చదవాలను కుతూహలాన్ని కలిగిస్తాయనటంలో సందేహం లేదు.

ఇక పుస్తకంలో చివరి అధ్యాయం "జ్ఞాపకాల్లో బాల్యం" నారాయణ బాల్యపు జ్ఞాపకాలకు మాత్రమే కాకుండా, 70సం॥ల క్రాతంనాటి రాయలసీమ ప్రాంతపు గ్రామీణ జనజీవన చిత్రణగా చెప్పవచ్చు. అనంతపురం దగ్గరి మరూరు బండమీద పల్లెలో జన్మించిన నారాయణ తనకు 17 సం॥ల వయస్సు వచ్చేవరకు గడిపిన ఆప్రాంతపు విశేషాలను చాలా ఆసక్తికరంగా చెప్పారు.

కథకునిగా, వ్యాసకర్తగా, విమర్శ కునిగా, సమీక్షకునిగా నారాయణ బహుముఖీనమైన ప్రజ్ఞ ఈసంకలనంలో చూడగలుగుతాం. నిర్మలంగాను, నిరాడంబరంగాను సరళమైన శైలిలో సాగే రచనలతో 'అపరిమితమైన' విషయాలు, సాహిత్య సౌరభాలను అందించిన సంకలనం ఈ 'పరిమితం'.


-ఎం.వి. శాస్త్రి
9441342999







“మహా నటి” సినిమా ఆ ‘నటి’కి న్యాయం చేయదు!
వ్యాసాలూ, కథలూ, ప్రశ్నలూ – జవాబులూ కలిసిన సంపుటం
రచన : రంగనాయకమ్మ
పుటలు: 206, వెల :70/-
ప్రతులకు :అరుణా పబ్లిషింగ్ హౌస్ ఏలూరు రోడ్డు, విజయవాడ – 520 002
ఫోన్ : 9440630378

తెలుగు శిల్పుల వైభవం వంశ చరిత్ర- శాసనాలు
రచయిత :ఈమని శివనాగిరెడ్డి
సంపాదకులు :డా॥ కొండా శ్రీనివాసులు
పుటలు :410, వెల :350/-
ప్రతులకు: శ్రీ విశ్వజ్యోతి పబ్లికేషన్స్, శివశ్రీ నిలయం, వార్డు నెం.21, జర్నలిస్టుకాలనీ, ఏలూరు-534 001




సమర్థ పాలకుడు సర్ థామస్ మన్రో
(సంక్షిప్త జీవిత గాథ)
రచన: రావినూతల శ్రీరాములు
పుటలు:48, వెల :40/-
ప్రతులకు : ఆర్. శ్రీరాములు
రమణస్థాన్, 10/228, వసంతపురి కాలనీ, మల్కాజ్ గిరి, హైదరాబాద్ – 500 047.
మొబైల్ నెం. : 8885653924






పెళ్ళి మంత్రాల్లో దాగివున్న బూతుల మర్మం, హేతువాద భావజాలం (అనుబంధం)
రచన :డి. పేరలింగం, హేతువాది
పుటలు:48, వెల:అమూల్యం
ప్రతులకు : సైన్స్ గ్రంథాలయం డి. పేరలింగం, హేతువాది ఎ.వి.అప్పారావు రోడ్డు, బాలాజీవీధి, రాజమండ్రి. సెల్: 95026 54774



హోసూరు వరకవి యోగి **శ్రీ ఆంజనప్పస్వాములు**
రచన : అగరం వసంత్
పుటలు: 76, వెల:100/-
ప్రతులకు: డా.ఎన్.వసంత్, కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం, 2/1097, బస్తీ, ఆవులపల్లి రోడ్డు, హోసూరు – 635 109, కృష్ణగిరి జిల్లా, తమిళనాడు.
ఫోన్ : 09488330209, 6383959101

నా భాష నా శ్వాస (కవితల కూర్పు)
కూర్పరి : అగరం వసంత్
పుటలు: 86, వెల :100/-
ప్రతులకు: డా॥ ఎన్. వసంత్, 9488330209 శ్రీలక్ష్మీనారాయణ మెడికల్స్ & క్లినిక్ 2/1097, బస్తి, ఆవులపల్లి రోడ్డు, హోసూరు – 635109, కృష్ణగిరి జిల్లా, తమిళనాడు.




ఆనందం అర్ణవమైతే
(శ్రీశ్రీ గీతాలకు సావిత్రి అభినయం)
కూర్పు : సింగంపల్లి అశోక్‌కుమార్
పుటలు: 55, వెల: రు.50/-
ప్రతులకు :శ్రీశ్రీ సాహిత్యనిధి, 305 ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతి నగర్, విజయవాడ 520004, ఫోన్ : 0866-6617375




హాస క్రీడలు (శ్రీ శ్రీ)
కూర్పు: సింగంపల్లి అశోక్‌కుమార్
పుటలు: 120, వెల :100/-
ప్రతులకు :శ్రీశ్రీ సాహిత్యనిధి, 305 ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతి నగర్, విజయవాడ 520004, ఫోన్ : 0866-6617375






కాల విజేత (చైనా కవితలు)
తెలుగు అనువాదం : ఎన్. గోపి
పుటలు:120, వెల: రు.100/-
ప్రతులకు : 13-1/5 బి, శ్రీనివాసపురం, రాంమంతపూర్, హైదరాబాదు, తెలంగాణా రాష్ట్రం,
ఫోన్ : 93910 28496

మొలకెత్తిన పిడికిళ్ళు (కవిత్వం)
రచన :చౌశా
పుటలు:143, వెల: రు.100/
ప్రతులకు : ఎం. తేజోవతి
కర్నూలు-518004. సెల్ : 9490445484,
కెంగర మోహన్
కర్నూలు- 518001. సెల్ : 9493375447



పిచ్చిగీతలు (కవితలు)
రచయిత: డా॥ నాగభైరవ ఆదినారాయణ
పుటలు: 93, వెల:100/-
ప్రతులకు : డా॥ నాగభైరవ ఆదినారాయణ 202, శ్రీ వెంకటసాయి రెసిడెన్సీ 2వ లైను, రామయ్యనగర్, ఒంగోలు,- 5230002
చరవాణి : 98497 99711





కరోన (దీర్ఘల కవిత)
రచన : ఎస్.ఆర్. పృథ్వీ
పుటలు: 32, వెల :50/-
ప్రతులకు :శ్రీమతి పి. ఉషారాణి, 3-866, మహాత్మ గాంధి వీధి, రామకృష్ణా నగర్, రాజమహేంద్రవరం. ఫోన్ : 9389223245

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

తెలుగు జాలవేదిక

మాతృభాషా మాధ్యమ అంతర్జాలవేదిక

తెలుగు వెబినార్(జాలవేదిక) నమోదు

మన మాతృభాష (అమ్మనుడి) తెలుగును కాపాడుకొనేందుకూ అన్ని రంగాలలో వినియోగించుకొనేందుకూ ఆయా రంగాలలో జరుగుతున్న కృషినీ, పరిశోధనలనూ, విశ్లేషించుకొంటూ ఉద్యమ స్ఫూర్తిని బలోపేతం చేయడం కోసం ఏర్పడిన అంతర్జాల వేదికే **"తెలుగు జాలవేదిక"**. దూరతీరాలలోని కార్యశీలురైన తెలుగువారిని ఇంటర్నెట్ సాధనంగా స్మార్ట్ ఫోనుతోనే నడుపుకోగల చర్చావేదిక ఇది. ఏ రంగంలో పనిచేస్తున్న తెలుగువారైనా దీనిలో పాల్గొనవచ్చు.

ప్రస్తుత పరిస్థితులలో మాతృభాషా మాధ్యమ ఉద్యమంలో భాగంగా విద్యాబోధన పట్ల ఒక సరైన అవగాహనను ప్రజలలోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉంది అని గుర్తించి, కరోనా కట్టడి అమలులోవున్న కారణంగా, భౌతికంగా వివిధ రంగాలలో ఉన్న ప్రజలను కలిసి చర్చించే వీలు లేనందున అంతర్జాల మాధ్యమాన్ని ఉపయోగించదలచుకున్నాం. విధిగా అన్ని విద్యాసంస్థలూ మూతపడి ఉండటమూ చాలావరకు ప్రభుత్వ సంస్థలు 30 శాతంకంటే తక్కువ ఉద్యోగులతో పనిజరపటమూ ప్రైవేటు సంస్థలు ఇంటినుండి పనిచేసుకునే వెసులుబాటు కల్పించటమూ ఇవన్నీ అంతర్జాలంలో వీరితో చర్చించే అవకాశం కల్పించాయి. ప్రస్తుతం తెలుగు భాషకు పొంచివున్న ముప్పు గురించీ, బోధనా స్థితిగతుల గురించీ, విద్యా సాంకేతిక మాధ్యమాలలో తెలుగు అమలు గురించి ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో గత 11 వారాల కిందట తెలుగుజాలవేదిక అనే పేరుతో మొదలుపెట్టాం. వెంటనే అనుకున్నదానికంటే ఎక్కువగా వివిధ రంగాలవారి నుండి స్పందన కనిపించింది. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారి ఆధ్వర్యంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు డా. సామల రమేష్‌బాబు ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ గార్ల ప్రోత్సాహంతో జాలవేదిక నిర్వహించబడుతోంది. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారు వక్తగా మే 17న "మాతృభాష–సమాజం–ఆర్థిక స్థితిగతులు" అన్న అంశం మీద మొదటి జాలవేదిక నిర్వహించబడింది. రెండవ జాలవేదికలో "ముడి చిత్ర పుస్తకాల నుండి లాక్షణిక వర్గీకృత పాఠం – కార్య విధానం" అన్న అంశం మీద విక్రమ్ గారు ప్రసంగించారు. మూడవ జాల వేదికలో పెద్ది సాంబశివరావు గారు "తెలుగులో నిఘంటువుల నిర్మాణం" మీదా, కుమార్ చంద్రశేఖర్ గారు "భారతీయ లిపి మరియు తెలుగు ఓసీఆర్" మీదా ప్రసంగించారు. నాల్గవ సమావేశంలో "తెలుగు భాషోద్యమ అవసరం" అన్న అంశం మీద పారుపల్లి కోదండరామయ్య గారు, డాక్టర్ వెంకటస్వామి గారు "తెలుగు కవిత్వంలో కరోనా వలస కూలీల జీవన చిత్రణ" అన్న అంశం మీద ప్రసంగించారు. ఆచార్య ఆర్. వి. ఎస్. సుందరం గారు ఐదవ సమావేశంలో "తెలుగు ఛందస్సు అధ్యయన విధానాలు" అన్న అంశం మీద లోతైన విశ్లేషణతో పరిశోధనాంశాలను వివరించారు. డాక్టర్ సామల రమేష్‌బాబు, ఆచార్య ఆవుల మంజులత, శ్రీ రమేష్ పట్నాయక్ గార్లు ప్రధాన వక్తలుగా ఆరవ సమావేశం "తెలుగు భాషోద్యమం, తొలి నుంచీ : భాషోద్యమానికి సైద్ధాంతిక స్పృహ" అన్న అంశం మీద ప్రసంగించారు. డాక్టర్ సామల రమేష్‌బాబు తెలుగు భాషోద్యమం మొదలైన నాటినుండి ఇప్పటి వరకూ చేసిన ప్రయత్నాలూ వాటి తీరుతెన్నులూ సాధించిన వివరాలతో వివరణాత్మక ప్రసంగం చేయగా ఆపైన సుమారు గంటకు పైగా చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో 105 మంది ఔత్సాహికులు పాల్గొని మాతృభాష ఆవశ్యకత, మాధ్యమబోధన, అడ్డంకులూ పరిష్కారాలపై ప్రశ్నోత్తరాలతో చర్చ జరిగింది. శ్రీ రమేష్ పట్నాయక్ ఏడవ సమావేశంలో "మాతృభాషా మాధ్యమం – ప్రభుత్వాలు – కోర్టులు – తీర్పులు – రాజ్యాంగం" అన్న అంశం మీద ప్రసంగించి, గుట్టుగా ఉండిపోయిన ఎన్నో అంశాలను, న్యాయస్థాన తీర్పులను, చట్టసభల నిర్ణయాలను కొత్త కోణంలో విశదీకరించారు. ఎనిమిదవ, తొమ్మిదవ సమావేశాలలో ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ప్రధాన వక్తగా "మాతృభాష – విద్యాబోధనఅమలు– ఆవశ్యకత" అన్న అంశం మీద ప్రశ్నోత్తర కార్యక్రమం జరిగింది. మాతృభాషలోనే పాఠశాల విద్య, కార్పోరేట్, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలన్నింటా దానికి అడ్డంకులు ఏమిటి? అన్న విషయాలను గణాంకాల ఆధారంగా వివరించారు. "ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాషా మాధ్యమం" అన్న అంశం మీద పోటీ ప్రపంచంలో మాతృభాషను ఎలా అర్థం చేసుకోవాలి? అన్న విషయాలను వివరించారు. సమావేశంలో "నేను – నా భాష" అనే శీర్షికతో, నీ మాతృభాష, నువ్వు వ్యక్తిగా, మనం సమిష్టిగా ఏం చేయాలి అన్న విషయాలను ఆచార్య గారపాటి ఉమామహేశ్వర రావు గారు వివరించారు. జూలై నెల 26న జరిగిన జాలవేదికలో తెలుగు వారందరికీ ఉపయోగపడేలా "సాంకేతిక ఉపకరణాలలో తెలుగు వినియోగం: మొదటి భాగం" గురించి జరిగిన ప్రదర్శనాత్మక ఉపన్యాసంలో వీవెన్, రహమానుద్దీన్ గార్లు ప్రధాన వక్తలుగా ఉన్నారు. ఆగష్టు 2న 'జాతీయ నూతన విద్యాప్రణాళిక : మాతృభాషలో ప్రాథమిక విద్యపై – చర్చ' ఉంటుంది.

ఈ జాలవేదికలో పాల్గొనటానికి ఆసక్తి ఉన్నవారు ఈ కింది లింకు నుండి నమోదు చేసుకోగలరు.

https://forms.gle/fDtzQiumfQ1cCxi38

– శ్రీగణేశ్ తొట్టెంపూడి, హైడల్‌బర్గ్, జర్మనీ

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
August 2020 Vol :6, Issue 3
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244